

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

31-5-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 120 పేజీలు: 10+4 వెల: 8.00


లోయలో పడిన బస్సు 22 మంది దుర్మరణం

గ్రీన్‌కార్డుపై యుటర్న్ నిబంధనలు సడలించిన యుఎస్

5



గవర్నర్ గెహ్లాట్‌కు ఎమ్మెల్యేల మద్దతు పత్రాన్ని అందజేస్తున్న డికె తదితరులు

## కర్ణాటక సిఎల్‌పి నేతగా డికె



సిద్దరామయ్య ప్రతిపాదనకు ఏకగ్రీవ ఆమోదం

3న సిఎంగా పదవీ ప్రమాణం

నలుగురు డిప్యూటీ సిఎంలకు డికె 'నో!

**బెంగళూరు, మే 30:** కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ పగ్గాలు చేపట్టనున్నారు. శనివారం సాయంత్రం బెంగళూరులో జరిగిన కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో సీఎల్పీ నేతగా డీకే శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాజీ సీఎం సిద్ధరామయ్య డీకే పేరును ప్రతిపాదించగా ఎమ్మెల్యేలంతా సమర్థించారు. దీంతో కర్ణాటక కాంగ్రెస్ సీఎల్పీ నేతగా డీకే శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఏఐసీసీ పరిశీలకులు ప్రకటించారు. కేవలం పది నిమిషాల్లోనే సీఎల్పీ భేటీ ముగిసింది. కొత్త ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రమాణస్వీకారోత్సవం జూన్ 3వ తేదీ జరుగుతుంది. రాష్ట్రకాంగ్రెస్ కార్యని ర్వాహక అధ్యక్షుడు జీసీ చంద్రశేఖర్ ప్రకటించారు. >>2

# ఢిల్లీలో భారీ పేలుళ్ల కుట్ర భగ్నం




రక్షణదళాల స్థావరాలు, ప్రార్థనా స్థలాల పేల్చివేతకు కుట్ర

9 మంది ఐఎస్ఐ ఉగ్రవాదుల అరెస్టు

భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం

**హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త:** దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి వరుస పేలుళ్లకు పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు పన్నిన కుట్రను ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు శనివారం నాడు భగ్నం చేశారు. రక్షణ, పోలీసు బలగాలు మొహరించే కీలక స్థావరాలు, ప్రార్థన స్థలాలను ఉగ్రవాదులు టార్గెట్ చేసినట్లు పోలీసులు తేల్చారు. ఈ సందర్భంగా తొమ్మిది మంది ఉగ్రవాదులు అరెస్టవగా వారి వద్ద నుంచి భారీగా ఆయుధాలు, పేలు డు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ ఉగ్రవాదుల్లో కొందరు నేపాల్‌కు చెందిన వారుండగా వీరికి పాకిస్థాన్‌లో ఆశ్రయ ం పొందుతున్న అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం అండదండలున్నట్లు వెల్లడయ్యింది. ఉగ్రవాదులను ఢిల్లీ పోలీసులు రహస్య ప్రాంతంలో విచారిస్తున్నారు. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం నాడు ఢిల్లీలో పేలుళ్లకు ఉగ్రవాదులు పన్నిన కుట్ర భగ్నం కాగా అంతకు మించిన ఉగ్రదాడికి పాక్ టెర్రరి స్టులు రెడీ అవగా చివరి నిమిషంలో ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు దానిని అడ్డుకున్నారు. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు దేశ రాజధానిలో మరోసా రి భారీ ఉగ్ర కుట్రకు వ్యూహాలు రచిస్తున్నట్లు నిఘా వర్గాలు హెచ్చరించిన నేపథ్యంలో దేశ వ్యాప్తంగా అన్ని నగరాల పోలీసులు అప్రమత్తంగా వుండడం తెలిసిందే. ఉగ్రవాదులు ఢిల్లీని టార్గెట్ చేశారని పక్కా సమాచారం వుండడంతో ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు లోతుగా విచారించగా కొందరు ఉగ్రవాదులు నక్కిన రహస్య ప్రాంతం గురించి సమాచారం అందింది. దీంతో శనివారం ఉదయం ఆ ప్రాంతంపై పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల సందర్భంగా తొమ్మిది మంది ఉగ్రవాదులు పట్టుబడ్డారు. వీరిలో భారత్‌కు చెందిన వారితో పాటు నేపాల్ వాసులు కూడా వున్నారని తెలిసింది. ఉగ్రవాదుల వద్ద అధునాతన తుపాకులు, హ్యాండ్ గ్రేనేడ్లు, పేలుడు పదార్థాలు లభ్యమయ్యాయి. తుపా కులను వెంటనే స్వాధీనం చేసుకున్న పోలీసులు హ్యాండ్ గ్రేనేడ్లు, పేలుడు పదార్థాలను నిపుణుల సమక్షంలో జాగ్రత్తగా స్వాధీనం చేసుకుని అవి పేలకుండా >>2

# ఉచిత విద్యుత్‌కే 'రైతు డిస్కం'



మోటార్లకు మీటర్లు పెట్టినా, ఉచిత విద్యుత్ ఆగినా మేం ఎన్నికల్లో పోటీ చేయం

ఆ 2 కొనసాగితే బిఆర్ఎస్ తప్పుకొంటుందా!

జూన్ 15 దాకా ప్రతి గింజా కొంటాం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే30:** తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ నిలిపివేసినా, మోటార్లకు మీటర్లు పెట్టినా తాము ఎన్నికల్లో పోటీ చేయ బోమని, ఈ సవాల్‌కు బీఆర్ఎస్ సిద్ధమా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తాము ఉచిత విద్యుత్ కొనసాగిస్తే బీఆర్ఎస్ ఎన్నికలకు దూరంగా ఉంటుందా అని ప్రశ్నించారు. శనివారం సాయంత్రం ఎంసిహెచ్ఆర్‌డిలోని బుద్దా పివిలే యిన్‌లో ఆయన మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ చేశారు. స్మార్ట్ మీటర్లు పెట్టాలని కేంద్రం ఎప్పుడూ చెప్పలేదని. రాజకీయ లబ్ధి కోసమే కేసీఆర్ రైతుల ముసుగులో లైఫ్ లైన్ కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దేశంలోనే తొలి సారిగా రైతుల కోసం ప్రత్యేకంగా 'రైతు డిస్కం' ఏర్పాటు చేశా మని, దీనివల్ల ప్రభుత్వానికి తక్కువ ధరకే విద్యుత్ కొనుగోలు చేసే వెసులుబాటుతో పాటు జవాబుదారీతనం,పారదర్శకత పెరుగుతుందని స్పష్టం చేశారు. అన్నదాతలకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించేందుకే రైతు డిస్కం ఏర్పాటు చేస్తున్నామని, ఉచితంగా అందిస్తున్న విద్యుత్ వినియోగాన్ని దీనికి కనెక్ట్ చేస్తున్నామని అన్నారు. కేంద్రంలోని బీజేపీ

మహేశ్‌గౌడ్‌ది, నాది సక్సెస్‌ఫుల్ కాంబినేషన్

హరీష్‌రావు ఇక బిఆర్ఎస్ నుంచి పోటీ చేయరు

ఎన్టీఆర్‌ను కులం, ప్రాంతంతో పోల్చడం సరికాదు..

మీడియాతో సిఎం రేవంత్‌రెడ్డి చిట్‌చాట్

ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి వదిలేసిందే తప్ప ఒక్క గింజ కూడా కొనడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో వరి, జొన్న, మొక్కజొన్న పంటలను తమ ప్రభుత్వమే పూర్తిస్థా యిలో కొనుగోలు చేస్తోందని, ఇప్పటివరకు 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడిం చారు. జూన్ 15 వరకు ప్రతి గింజను కొంటామని, అకాల వర్షాల వల్ల అక్కడక్కడ ఇబ్బందులు వచ్చాయని, తడిచిన ధాన్యానికి సైతం మద్దతు ధర కల్పిస్తున్నామని, సన్న వడ్లకు బోనస్ ఇస్తున్నామని చెప్పారు.తెలంగాణలో 32 శాతం ధాన్యం మాత్రమే కేంద్రం కొంటోందని రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్రం ఎంఎస్‌పిని ప్రకటిస్తుందే తప్ప ధాన్యం కొనుగోలు చేయడం లేదని, కేంద్రం ధాన్యం కొనుగోలు చేయకపోతే బిజెపి నేతల ఇళ్ల ముందుకే ట్రాక్టర్లతో వడ్లు తెచ్చి పోస్తామని ఆయన హెచ్చరించారు. వడ్లు కొనుగులు చేయని కేంద్రం, వరి పంట వేస్తే ఉరే అన్నది బిఆర్ఎస్ అని పేర్కొన్నారు. తాము ఏడాదికి రూ.70 వేల కోట్లు అప్పు చేస్తే రూ.95 వేల కోట్ల అప్పు తీరుస్తున్నామన్న రేవంత్ రెడ్డి.. మాజీ మంత్రి హరీశ్‌రావు తాము తీరుస్తున్న అప్పుల గురించి ఎందుకు చెప్ప డం లేదన్నారు. రూ.54 వేల కోట్లు అప్పులు తీసుకుంటామని ముందే చెప్పామని అన్నారు. ఎఫ్ఆర్‌బీఎం పరిధి దాటి అప్పులు చేయడానికి అనుమతిలేదని >>2



శనివారం తెలంగాణభవన్ వద్ద మీడియాతో బాల్కసుమన్

## మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్టు

తెలంగాణ భవన్ వద్ద అరెస్టు చేసిన నాంపల్లి పోలీసులు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), మే 30, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను నాంపల్లి పోలీసులు శనివారం తెలం గాణభవన్ వద్ద అరెస్ట్ >>2

# సంతకం చేయని ట్రంప్



ముందుకు కదలని శాంతి ఒప్పందం

పశ్చిమాసియాలో మరింత పెరిగిన ఉద్రిక్తతలు

త్వరలో సంచలన ప్రకటన చేస్తానంటున్న యుఎస్ అధ్యక్షుడు

**వాషింగ్టన్, మే 30:** మధ్యప్రాచ్యంలో నెలల తరబడి సాగుతున్న భీకర యుద్ధానికి ముగింపు పలికే దిశగా దౌత్య వ్యూహాలు వేగవంతమయ్యా యి. ఇరాన్‌తో శాంతి ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు, దానిపై ఒక తుది నిర్ణయం తీసుకునేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్ హౌస్‌లోని అత్యంత సురక్షితమైన సిచ్యువేషన్ రూమ్‌లో సలహా దారులతో సమావేశం అయ్యారు. ఈ చర్చల తర్వాత అతి త్వరలోనే ప్రపంచవ్యాప్తంగా ఒక సంచలన ప్రకటన రాబోతోందని ఆయన సంకే తాలిచ్చారు. అయితే కాల్పుల విరమణ పొడిగింపు ఒప్పందంపై సం తకం చేయకుండానే వెనుదిరిగినట్లు వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించాయి. ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదరాలంటే ఇరాన్ ప్రభుత్వం తమ కఠినమైన షరతులకు లొంగాల్సిందేనని ట్రంప్ తన సోషల్ మీడియా పోస్ట్‌లో అల్టిమేటం జారీ చేశారు. ఇరాన్ తన అణ్వాయుధ ఆశయాలను పూర్తిగా వదిలిపెట్టాలి. భవిష్యత్తులో ఇరాన్‌దగ్గర ఎలాంటి అణు బాం బులు ఉండకూడదని హామీ ఇవ్వాలి. అంతర్జాతీయ చమురు, వాణిజ్య రవాణాకు గుండెకాయ లాంటి హార్ముజ్ జలసంధిని తక్షణమే రెండు వైపులా తెరవాలి. ఎలాంటి టోల్ టాక్స్ లేకుండా, ఎవరి జోక్యం లేకుండా అంతర్జాతీయ నౌకల రాకపోకలను అనుమతించాలి. హార్ముజ్ జలమార్గంలో ఇరాన్ అమర్చిన భయంకరమైన సముద్రపు మైన్లను తక్షణమే తొలగించాలి. దీనికి బదులుగా ఇరానియన్ ఓడరేవులపై ఉన్న అమెరికా నౌకాదళ దిగ్బంధనాన్ని ఎత్తివేస్తారు. దీంతో అక్కడ చిక్కుకు పోయిన నౌకలు తిరిగి తమ దేశాలకు వెళ్లవచ్చు. ఇరాన్‌వద్ద ఉన్న అత్యం త ప్రమాదకరమైన సుసంపన్న యురేనియం నిల్వలను నాశనం చేయడంపై అమెరికా ప్రత్యేక ప్లాన్ సిద్ధం చేసింది. దాదాపు 11 నెలల క్రితం అమెరికాకు చెందిన శక్తివంతమైన బి2 బాంబర్ యుద్ధ విమానాలు ఇరాన్ అణు కర్మాగారాలపై దాడి చేశాయి. ఆ దాడిలో పర్వ తాలు కూలిపోయి, భూగర్భంలో పాతిపెట్టుకుపోయిన ఆ సుసంపన్న యురేనియం పదార్థాన్ని ఇప్పుడు అమెరికా, ఇరాన్ మరియు అంతర్జా తీయ అణుశక్తి ఏజెన్సీలు ఉమ్మడిగా తవ్వితీసి పూర్తిగా నాశనం చేస్తా యని ట్రంప్ స్పష్టం చేశారు. ఈఒప్పందంలో తదుపరి నోటీసు ఇచ్చేంత వరకు ఎలాంటి డబ్బు మార్పిడి (ఆర్థిక సహాయం) ఉండదని తేల్చిచెప్పారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఈ శాంతి >>2




శనివారం హైదరాబాద్‌లో ఎడ్‌సెట్ ఫలితాలను విడుదల చేస్తున్న ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకిష్టా రెడ్డి

# ఎడ్‌సెట్‌లో 96.95% అర్హత

బాలుర శాతం ఎక్కువ

గత యేడాది 196 కాలేజీల్లో 13,278 కన్వీనర్ కోటా సీట్లు

ఫలితాలు విడుదల చేసిన ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకిష్టా రెడ్డి

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 30:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు బీఈడీ కాలేజీల్లో బీఈడీ కోర్సులో ప్రవే శాల కోసం నిర్వహించిన ఎడ్ సెట్-2026 పరీక్షల్లో 96.95 శాతం మంది అర్హత సాధించారు. ఫలితాల్లో బాలికల కంటే బాలుర ఉత్తీర్ణతా శాతం ఎక్కువగా ఉంది. ఎడ్ సెట్ ఫలితాలను శనివారం మాసబ్ ట్యాంక్‌లోని ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె ప్రతాప్‌రెడ్డి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్లు ప్రొఫెసర్ ఈ పురు షోత్తం, ఎస్‌కె మహమూద్,కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్, ఎడ్‌సెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ >>2

మండుటెండల కారణంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాల సమయం మార్పు 2



ఇంకా 45° తగ్గని ఉష్ణోగ్రతలు 2



పలు జిల్లాల్లో రెడ్ అలర్ట్



## ఇ వేలం ద్వారా మొక్కజొన్న విక్రయం

-మంత్రి తుమ్మల

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే30:** మొక్కజొన్నను సరళ మైన నిబంధనలతో ఈ వేలం నిర్వ హించడంతో రాష్ట్ర ప్రభుత్వానికి గతంలో కంటే రూ. 202.56 కోట్ల అధిక ఆదాయం లభించిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం ఓ ప్రక టనలో వెల్లడించారు. 2025-26 వానాకాలం సీజన్‌లో రాష్ట్ర మార్క్‌ఫెడ్ ద్వారా >>2





ముష్కిన్ చెరువులో కబ్జాలను తొలగిస్తున్న హైడ్రా అధికారులు

## రూ.5.వేల కోట్ల స్థలానికి హైడ్రా 'గొడుగు'

నార్సింగి ముష్కిన్ చెరువులోని కబ్జాలు నేలమట్టం

భూముల ధరలు పెరగడంతో చెరువులను దోచేస్తున్న కబ్జాదారులు

బడాబాబుల ఆగడాలు ఇకసాగవన్న హైడ్రా అధికారులు

**నార్సింగి, మే 30 ప్రభాతవార్త:** నార్సింగి సర్కిల్ పరిధిలోని ముష్కిన్ చెరువులో వెలిసిన అక్రమ కట్టడాలపై హైడ్రా అధి కారులు కొరడా ఝులిపించారు. జేసీబీతో ఆ కట్టడాలను నేల మట్టం చేసి రూ.5.వేల కోట్ల విలువ చేసే స్థలంను కాపా డారు. హైడ్రా అధికారుల తీరుపట్ల స్థానికులు సంతోషంను వ్యక్తం చేస్తున్నారు. హైడ్రా లేకుంటే ఈ ముష్కిన్ చెరువులో వెలిసిన అక్రమ కట్టడాలను ఎవరూ తొలగించే వారు కాదని స్థానికులు పేర్కొంటున్నారు. హెచ్ఎండిఏ రికార్డుల ప్రకారం ముష్కిన్ చెరువు 52.20.ఎకరాల స్థలం ఉంది. ఇటీవల నార్సింగి ప్రాంతంలో భూముల ధరలు చుక్కలనంటడంతో కొంత మంది బడాబాబుల కన్ను ఈ చెరువు స్థలంపై పడిం ది. ఎలాగైనా ఈ స్థలంను కొట్టేయాలని కొన్ని నిర్మాణాలు, షెడ్లు ఏర్పాటు చేసి అందులో పేదలను ఉంచారు. ఏకంగా 34.21.ఎకరాల స్థలంను కొట్టేసేందుకు భారీ స్కెచ్ వేశారు. తానొకటి తలిస్తే దైవం మరోటి >>2



శనివారం సిద్దిపేట రైతులతో మాట్లాడుతున్న హరీష్‌రావు

'రైతు డిస్కం' కాదు..

## మెడకు ఉరితాడు

కరెంటుకు ఎసరుపట్టే కుట్రను అందరం అడ్డుకుందాం: హరీష్‌రావు

**సిద్దిపేట రూరల్, మే 30, ప్రభాతవార్త:** కరోనా కష్టకాలంలో కూడా ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా కెసిఆర్ సర్కార్ హయాంలో వడ్లు కొనుగోలు చేయడం జరిగిందని.. కాంగ్రెస్ సర్కార్ వచ్చాక వడ్లు అమ్మాలంటే రైతుల కళ్లలో రక్తం వస్తోందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు.సిద్దిపేట జిల్లా సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలో శనివారం వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా 50 రోజులుగా వడ్లు పోసుకొని, గత 12 రోజులుగా కొనుగోళ్లు నిలిచిపోయి >>2



లక్నోలో 'నౌసేన శౌర్య వాటిక'ను ప్రారంభిస్తున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్. చిత్రంలో యుపి సిఎం యోగి తదితరులు

# మెడకు ఉరితాడు

>> తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులను కలిసి వారి ఆవేదనను అడిగి తెలుసుకున్నారు. కల్లాల్లోనే పడిగాపులు కాస్తున్న రైతులకు భరోసానిచ్చి అక్కడి నుంచే ఆర్డీఓ ఇతర అధికారులకు ఫోన్ చేసి కొనుగోలు ప్రక్రియను వెంటనే వేగవంతం చేయాలని హెచ్చరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్వింటాల్‌కు 5 కిలోల తరుగు, మళ్లీ బీ-గ్రేడ్ అని చెప్పి ఎకరాకు దాదాపు రెండు మూడు వేల రూపాయలు రైతులు నష్టపోతున్నారని వాపోయారు.కేంద్ర సర్కార్ యూరియా,డీఏపీ ధరలు పెంచింది ఇక్కడి కాంగ్రెస్ సర్కార్ కొనుగోళ్లు సరిగ్గా చేయక మిల్లర్ల దోపిడికి వదిలేసిందన్నారు. వడ్లకు తరుగు లేదన్న సిఎం రేవంత్‌రెడ్డి మాటలన్ని గాలి మాటలే అయ్యాయన్నారు.కాంగ్రెస్ సర్కార్ ఇప్పటికే రైతు బంధు, రైతు బీమా బంద్ పెట్టిందన్నారు. కరెంటును కూడా ఆగం చేయడానికి కాంగ్రెస్ సర్కార్ కొత్తగా 'రైతు డిస్కం' పేరుతో రైతుల మెడలకు ఉరితాడు వేస్తున్నారని మండిపడ్డారు. రైతు డిస్కం అమల్లోకి వస్తే ఉదయం 7 గంటలకు ఇచ్చి సాయంత్రం 5 గంటలకు కరెంటు తీసేస్తారని తెలిపారు. ఇక రాత్రి కరెంటు ఉండనే ఉండదని 24 గంటల కరెంటుకు ఎసరుపట్టే కుట్రను అందరం కలిసి అడ్డుకుందామన్నారు. ఎట్టి పరిస్థిల్లో రైతులు ఆధైర్యపడొద్దని..కటింగ్ లేకుండా రనపతి గింజను కొనిపించేలా అధికారులపై ఒత్తిడి తెస్తామని..బిఆర్ఎస్ రైతులకు అండగా ఉంటుందన్నారు. ఒక్క గింజ కూడా కటింగ్ లేకుండా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని సిద్దిపేట ఆర్డీఓ సదానందంకు ఆయన సూచించారు. ఆయన వెంట బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు తదితరులు ఉన్నారు.

# ఎడ్‌సెట్‌లో 96.95% అర్హత

>> వెంకట్రామ్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎడ్ సెట్-2026 పరీక్ష ఈ నెల 12న ప్రశాంతంగా జరిగింది. పరీక్షకు 82.42 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఎడ్ సెట్‌కి 35,600 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 29,342 మంది పరీక్షకు హాజరయ్యారు. అందులో 28,446 మంది(96.95శాతం) అర్హత సాధించారు. పరీక్షకు 29,441 మంది మహిళలు దరఖాస్తు చేసుకుంటే 24,482 మంది హాజరయ్యారు. వారిలో 23,642 మంది(96.57శాతం) అర్హత సాధించారు. ఎడ్ సెట్‌కి 6,155 మంది పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో 4858 మంది హాజరయ్యారు. అందులో 4802 మంది(98.85శాతం) అర్హత సాధించారు. నలుగురు ట్రాన్స్‌జెండర్లు దరఖాస్తు చేసుకోగా వారిలో ఇదనదరు పరీక్షకు హాజరైతే ఇద్దరు అర్హత సాధించారు. పరీక్షకు హాజరైన వారిలో బానోతు అజిత్ సాయి కృష్ణ 124.65 మార్కులతో మొదటి ర్యాంక్ సాధించగా, 122.81 మార్కులతో పోతుగంటి తరుణ్‌కుమార్ 2వ ర్యాంక్, 122,58 మార్కులతో నీరటి ఉదయ్‌కుమార్ రెడ్డి 3వ ర్యాంక్, 122.15 మార్కులతో గర్రెపల్లి శరత్ చందర్ 4వ ర్యాంక్, 122.01 మార్కులతో 5వ ర్యాంక్‌ను సాధించారు. రాష్ట్రంలో గత ఏడాది 2025-26 విద్యా సంవత్సరంలో 196 కాలేజీల్లో 17,350 సీట్లు అందుబాటులో ఉండగా వాటిలో 13,278 కన్వీనర్ కోటా సీట్లు, ఉంటే అందులో 7469 సీట్లు భర్తీ అయ్యాయి. భర్తీ అయిన సీట్లలో 6100 మహిళలు కాగా 1369 మంది పురుషులు ఉన్నారు. ఈ ఏడాది ఇంకా బీఈడీ కాలేజీలకు సంబంధించిన గుర్తింపు ప్రక్రియ ముగియలేదని, గుర్తింపు ప్రక్రియ ముగిసిన తరువాత కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను జారీ చేయనున్నట్టు అధికారులు తెలిపారు.

# ఢిల్లీలో భారీ పేలుళ్ల కుట్ర భగ్నం

>> తగిన భద్రత మధ్య ఫోరెన్సిక్ లాబ్‌కు తరలించారు. కాగా ఉగ్ర నెట్ వర్క్‌ను ఢిల్లీ పోలీసులు ఛేదించడం వెనుక దావూద్ ఇబ్రహీం అనుచరుడు సలీం డోలా అరెస్టు, అతను ఇచ్చిన సమాచారం వుందని తెలిసింది. భారత్‌లో జరిగిన అనేక నేరాలు, ఘోరాలకు కారకుడైన సలీం డోలా నెల రోజుల క్రితం టర్కీలో పట్టుబడగా అతన్ని భద్రతా బలగాలు దౌత్య మార్గంలో భారత్‌కు రప్పించారు. 2020 నుంచి ఇతను పరారీలో వుండగా ఇస్తాంబుల్‌లోని బేలిక్‌డుజులో రహస్యంగా వుండగా టర్కీ పోలీసుల ఆపరేషన్‌లో పట్టుబడ్డాడు. టర్కీలో ఇతనిపై మాదక ద్రవ్యాలకు సంబంధించిన అనేక కేసులుండగా ఆ కేసుల్లోనే ఇతన్ని అరెస్టు చేశారు. అనంతరం డోలాను దేశ బహిష్కరణ చేయగా ఇదే సమయంలో భారత్ అతన్ని ఇక్కడకు రప్పించి ఉగ్ర కుట్రలపై విచారించి కీలక సమాచారం రాబట్టింది. డోలా అందించిన సమాచారం ఆధారంగా దావూద్ ఇబ్రహీం భారత్‌లో మరోమారు ఉగ్రదాడికి పథకం రచించినట్లు వెలుగు చూసింది. ఈ నేపథ్యంలోనే ఢిల్లీలో స్లీపర్ సెల్‌కు చెందిన ఉగ్రవాదులు వున్నట్లు డోలా పోలీసుల విచారణలో తెలపగా వారిని పోలీసులు పట్టుకున్నారు. కాగా ఉగ్రవాదులకు ఢిల్లీలో ఆశ్రయం ఇచ్చిన వారి తో పాటు నిధులు, పేలుడు పదార్థాలను సమకూర్చిన వారి గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు.

# సంతకం చేయని ట్రంప్

>> చర్చల ఫ్రేమ్‌వర్క్ ఒప్పందంపై పురోగతి సాధించామని చెప్పున్నప్పటికీ, ఇరాన్ మాత్రం చాలా దూకుడుగా స్పందించింది. ఇరాన్ కీలక మధ్యవర్తి, పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాగెర్ ఖాలిబాఫ్ ఎక్స్ వేదికగా అమెరికాకు గట్టి కౌంటర్ ఇచ్చారు. మేము అమెరికా ఇచ్చే ఎలాంటి హామీలను, మాటలను విశ్వసించము. మాకు కేవలం వారి చర్యలు మాత్రమే ముఖ్యం. అమెరికా ఆచరణలో ముందడుగు వేసే వరకు మేము ఎలాంటి అడుగు ముందుకు వేయమని స్పష్టం చేశారు.

## భారీగా మున్సిపల్ కమిషనర్ల బదలీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే30:** మున్సిపల్ శాఖలో భారీ స్థాయిలో మున్సిపల్ కమిషనర్ల బదిలీలు చేపట్టింది. 91 మంది మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ మున్సిపల్ శాఖ కార్యదర్శి టికె శ్రీదేవి శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని ఆయా మున్సిపాలిటీలతో పాటు జిహెచ్ఎంసీ,సిఎంసీ, ఎంఎంసీలోని మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేశారు. దీంతో పాటు గ్రూప్1,గ్రూప్2 ద్వారా వచ్చిన కొత్త మున్సిపల్ కమిషనర్లకు సైతం పోస్టింగ్ ఇచ్చారు.

## బాల్క సుమన్
# అరెస్టు

>> చేశారు. ఈ సందర్భంగా ఇక్కడ తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకొంది. సీఎం డౌన్‌డౌన్ అంటూ బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య బాల్క సుమన్‌ను అరెస్ట్ చేసి పోలీసులు ఇక్కడి నుంచి నాంపల్లికి తరలించారు. వివాదస్పద వ్యాక్యలు చేసిన బాల్క సుమన్‌పై నాంపల్లి ఠాణాలో కేసు నమోదైంది. ఈ వ్యవహారంలో గత మూడు రోజులుగా తెలంగాణ భవన్‌లో బాల్క సుమన్ ఉన్నారనే సమచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలంగాణ భవన్ వద్ద నిఘా పెట్టారు. ఎసిపి ప్రవీణ్ ఆధ్వర్యంలో నాంపల్లి పోలీసులు తెలంగాణ భవన్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్యకర్తలు,నాయకులు భవన్ ముందు పోలీసులను అడ్డుకున్నారు. పోలీసులు గో బ్యాక్ అంటూ, సీఎం డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం పోలీసులతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన న్యాయవాదులు మాట్లాడారు. వివాదస్పద వ్యాక్యల నేపథ్యంలో నాన్ బెయిలబుల్ కేసు నమోదైందని, ఎలాంటి నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేదని అబిడ్స్ ఎసిపి స్పష్టం చేశారు. అనంతరం కొద్ది సమయం తరువాత భవన్ నుంచి బయటకు వచ్చిన ఆయన బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, మన్నె గోవర్ధన్‌రెడ్డి తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలోనూ తనను టార్గెట్ చేశారని, ఉద్యమ సమయంలోనూ తనపై 250కిపైగా కేసులు పెట్టి జైల్లో పెట్టారన్నారు. ఇటీవల క్యాతనపల్లి ఎన్నిక సమయంలోనూ తనని జైల్లో పెట్టారని గుర్తు చేశారు. తాను ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తానని, జైలు తనకు కొత్త ఏం కాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వివేక్ తనను జైలుకు పంపి పైశాచిక ఆనందం పొందాలని చూస్తున్నారన్నారు. తనపై కాకుండా ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని, ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని అన్నారు. సింగరేణిలో వందల విలువైన స్కాములు జరిగాయని, సింగరేణి కుంభకోణాలమయంగా మారిందన్నారు. కాంగ్రెస్ పాలకులు ఎమర్జెన్సీ రోజులను గుర్తుచేస్తున్నారని, చట్టంపై, వ్యవస్థలపై, రాజ్యాంగంపై నమ్మకం ఉందని, చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా పోలీసులకు సహకరిస్తానని అన్నారు. తాను ఎక్కడికి పారిపోలేదని, పార్టీకి సంబంధించిన ఒక యాప్ తయారీలో ఉన్నానని అన్నారు. ప్రశ్నించే నేతలను వేధించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారిందన్నారు. అనంతరం పోలీసులు అతన్ని అరెస్ట్ చేసి నాంపల్లి ఠాణాకి తరలించారు.

## వారం - వర్జ్యం

31-05-2026, అధికజ్యేష్ఠ ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, రోహిణి కార్తె
పౌర్ణమి మ.2.15
అనూరాధ సా.4.12
వర్జ్యం : రా.10.29-రా.12.17
దు.సా.4.47-సా.5.39
శుభసమయం : ఉ.6.30-7.30
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** మిత్రుల నుండి మీరు ఆశించిన సహాయమును పొందగలుగుతారు. ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం తగదు.

**వృషభం:** మీ అభిప్రాయములను కొన్ని సలహాలను అమలు వరచుట వలన భాగస్వాములు లాభములు పొందుతారు.

**మిథునం:** మీరు నిర్లక్ష్యముతో పోగొట్టుకున్న వస్తువులు కనబడకపోవచ్చును. కుటుంబ సభ్యుల సాయం పొందుతారు.

**కర్కాటకం:** వృత్తి రీత్యా మీరు చేసే ప్రయాణములు అనుకూలిస్తారు. ఖర్చులు అధికంగా ఉంటాయి.

**సింహం:** నంన్ధ వ్యవహారములు నెరవేరుటకు పలుకుబడి గల వ్యక్తుల సహాయమును తీసికొనుట మంచిది.

**కన్య :** కొత్తగా చేపట్టే ఉద్యోగమునకు సంబంధించి మీరు ధైర్యముతో తీసికొనే నిర్ణయము వలన లాభం పొందుతారు.

**తుల:** వాహనములకు, టెలిఫోన్స్‌కు, ధనవ్యయం గోచరిస్తుంది. నూతన వస్త్రాలు ఖర్చు మీ అంచనాలు దాటుతాయి.

**వృశ్చికం:** అధికారము నుండి మాట పడకుండా ముందు జాగ్రత్త చర్యలను పాటించండి. ఉద్యోగులకు బదిలీలు.

**ధనుస్సు:** మీరు దర్శించుకోవాలి అనుకున్న ప్రదేశమునకు ప్రయాణము అనుకూలిస్తుంది. స్పెక్యులేషన్‌కు దూరంగా ఉండండి.

**మకరం:** ఆరోగ్యమును గురించి వైద్యుని సంప్రదించవలసి వస్తుంది. పురోభివృద్ధి మాత్రం నామమాత్రంగా సాధిస్తారు.

**కుంభం:** ఉమ్మడి ఏ కార్యకలాపములను చేపట్టకండి. బదిలీకి చేసే ప్రయత్నములు ఫలిస్తాయి, శుభవార్తలు అందుకుంటారు.

**మీనం:** వివాదాస్పద వ్యవహారములు పరిష్కార మౌతాయి. టెండర్స్ అతి కష్టము మీద మీకు అనుకూలంగా వస్తాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 'గ్లోబరేనా'ను సిబిఎస్ఇ బోర్డు ఎలా నమ్మింది?

## కేంద్ర విద్యాశాఖ మంత్రి సమాధానం చెప్పాలి: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే30:** తెలంగాణలో 2019లో ఇంటర్మీడియట్ ఫలితాలను అస్తవ్యస్తం చేసి, పలువురు విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమైన 'గ్లోబరేనా' సంస్థే ఇప్పుడు కేవలం తన పేరును మార్చుకుని, సీబీఎస్ఈ నుంచి అంతకంటే పెద్ద కాంట్రాక్ట్‌ను దక్కించుకోవడం అత్యంత దురదృష్టకరమని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ శనివారం సాయంత్రం ఎక్స్ వేదికగా మండిపడ్డారు. కేంద్ర బోర్డు నిర్లక్ష్యం వల్లే ఇప్పుడు దేశవ్యాప్తంగా ఇంత పెద్ద గందరగోళం నెలకొందని విమర్శించారు. నాడు గ్లోబరేనా వ్యవహారంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించిందని కేటీఆర్ గుర్తుచేశారు. లోపాలను వెలికితీసేందుకు తక్షణమే ముగ్గురు నిపుణులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశామని, ఆ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా తప్పు చేసిన సంబంధిత అధికారులను పదవుల నుంచి తక్షణమే తొలగించామని కేటీఆర్ వివరించారు. అంతేకాకుండా, బాధ్యురాలైన సదరు సంస్థపై కోర్టులో చట్టపరమైన క్రిమినల్ చర్యలు కూడా తీసుకున్నామని ప్రస్తావించారు.
ఇంతటి చెడ్డ పేరు ఉన్న ఒక అసమర్థ సంస్థను సీబీఎస్ఈ బోర్డు ఎలా నమ్మిందని కేటీఆర్ ప్రశ్నించారు. కేవలం ఆ సంస్థకు లబ్ధి చేకూర్చేందుకే బోర్డు తన నిబంధనలను పదే పదే మార్చిందని ఆయన ఆరోపించారు. ఒక చిన్న పేరు మార్పు ప్రక్రియతో పాత తప్పులను దాచిపెట్టి, లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో, భవిష్యత్తుతో ఆడుకోవడం క్షమించరాని నేరమని స్పష్టం చేశారు. నిరుద్యోగం, పరీక్షల లీకేజీలు, తప్పుడు మూల్యాంకనాలతో దేశంలోని విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెట్టేస్తున్నారని, లక్షలాది మంది మానసిక క్షోభకు కారణమైన ఈ మార్కుల వివాదానికి కేంద్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి కచ్చితంగా దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బాధితులైన విద్యార్థులకు పూర్తి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉండి పోరాడుతుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## రూ.5.వేల కోట్ల స్థలానికి
# హైడ్రా 'గొడుగు'

>> తలిచిందన్న చందంగా ఈ కబ్జాదారుల తీరు మారింది. గత ఏడాదిలో హైడ్రా ఆవిర్భవించి చెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం పని చేయడం ప్రారంభించింది. ముష్కిన్ చెరువులో వెలిసిన అక్రమ కట్టడాలను స్థానికులు గుర్తించినా, తాము ఆ బడాబాబులను ఎదుర్కోలేమని మిన్నకుండి పోయారు. హైడ్రా రావడంతో వెంటనే స్థానికులు కొందరు వెళ్లి హైడ్రాకు ముష్కిన్ చెరువులో జరుగుతున్న కబ్జాల పర్వంను వివరించి, ఆ చెరువు స్థలంను కాపాడాలని కోరారు. అధికారులు ముందుగా రికార్డులన్నింటిని పరిశీలించి, పూర్తి ఆధారాలతో చెరువు వద్దకు వచ్చి, అక్కడ అభివృద్ధి పేరుతో జరుగుతున్న కట్టడాలను అడ్డుకున్నారు. ఇక్కడ ఎలాంటి కట్టడాలు చేపట్టరాదని హెచ్చరించారు. షెడ్లు, నిర్మాణాలు తొలగిస్తామని, ఇందులో ఉండే పేదలు ఖాళీ చేసి వెళ్లాలని హైడ్రా అధికారులు మూడు సార్లు నోటీసులు ఇచ్చారు. శనివారం ఉదయం నార్సింగి పోలీసుల సహకారంతో ముష్కిన్ చెరువు వద్దకు వచ్చిన హైడ్రా అధికారులు జేసీబీతో సదరు కట్టడాలను నేలమట్టం చేశారు. ఎఫ్‌టిఎల్‌తో పాటు బఫర్ జోన్లలో వెలిసిన అన్ని నిర్మాణాలు తొలగించారు. ఈ సందర్భంగా హైడ్రా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు, జలసిరులకు సంబంధించిన భూములు కాపాడేందుకు హైడ్రా నిరంతరం పని చేస్తుందన్నారు. చట్ట పరిధిలోనే కబ్జాలను తొలగిస్తున్నామని వివరించారు. హైడ్రా అధికారులు కాపాడిన 34.ఎకరాల స్థలం బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం రూ.5.వేల కోట్ల విలువ ఉంటుందని స్థానికులు పేర్కొన్నారు. హైడ్రా పనితీరును స్థానికులు అభినందిస్తున్నారు.

# ఇంకా 45° తగ్గని ఉష్ణోగ్రతలు

## పలు జిల్లాల్లో రెడ్ అలర్ట్

**హైదరాబాద్,మే 30,ప్రభాతవార్త:** పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న సూపర్ ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వడగాల్పులు వీయడంతోపాటు తెలంగాణ వ్యాప్తంగాగరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డు కావడంతో వాతావర్ణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్‌సొసైటీ విడుదల చేసిన దత్తాంశం ప్రకారం శనివారం తెలంగాణ రాష్ట్ర సగటు ఉష్ణోగ్రత 45.4గా నమోదైంది. తెలంగాణలో 11 ప్రాంతాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైనాయి. మంచిర్యాల జిల్లాలో సూర్యుడు నిప్పులు చెరిగాడు. బెల్లంపల్లి,45.4సెం.గ్రె, దండెపల్లిలో45.3సెం.గ్రె, చెన్నూర్45.1సెం.గ్రె తాండూర్‌లో 45సెం.గ్రె, ములుగు జిల్లా ఏటూరునాగారం,వెంకటాపూర్, నిర్మల్ జిల్లా మామడ ,దస్తూరాబాద్ పెద్దపల్లి జిల్లా అంతర్గాం, ఎలిగేడు, ఓదెలలో అత్యధికంగా ఉష్ణోగ్రత నమోదు కావడమే కాకుండా రాత్రి పదకొండు వరకు వేడి వడగాల్పులు వీచాయి.తెలంగాణలో మంచిర్యాల,పెద్దపల్లి, ములుగు,నిర్మల్ కుమురంభీం జిల్లాలో ఉష్ణోగ్రత 45 సెంగ్రేడ్ మించి ఉండటంతో స్టేట్ ఆవరేజ్ ఉష్ణోగ్రత 45.4గా నమోదు కావడంతో రెడ్ అలర్టు రాష్ట్రం మొత్తంకు జారీచేశారు. ఉష్ణోగ్రతలు 35సెం.గ్రేలోపు ఉంటే గ్రీన్ అలర్టుగా భావించి ఏలాంటి హెచ్చరికలు వాతావర్ణశాఖ చేయదు. ఎప్పుడైతే 35సెం.గ్రే మించి 40సెంగ్రె లో ఉష్ణోగ్రత ఉంటుందో అప్పడు ఎల్లో అలర్టు జారిచేస్తారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం,మహబూబ్‌నగర్,వికరాబాద్,వనపర్తి, నారాయణపేట జోగులాంబగద్వాలలలో 39.8సెం.గ్రెలు అత్యధిక ఉష్ణోగ్రత నమోదు కావడంతో ఎల్లో అలర్టు ఆ జిల్లాలకు జారీ చేశారు. 22జిల్లాలకు ఆరెంజ్ అలర్టు జారీచేశారు. ఆదివారం ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, జిల్లాలో వడగాలుపులు వీచే అవకాశం ఉందని వాతావర్ణశాఖ తెలిపింది. భూమిపై వేడిగాలి పైకిపోయి ఆకాశంలో చల్లటిగాలితో ఢీకొని అక్కడక్కడ ఓ మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉందని అంచనావేస్తున్నారు. బలమైన గాలులు వీచేందుకు సంభావ్యత ఉందని వాతావర్ణశాఖ వర్గాలు పేర్కొన్నాయి.



శనివారం న్యూఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో భేటీ అయిన మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్

# ఉచిత విద్యుత్‌కే 'రైతు డిస్కం'

>> తెలిపారు. కేసీఆర్ మీద ఒట్టేసి తాను బీఆర్ఎస్‌లోనే ఉంటానని హరీశ్‌రావు చెప్పాలని కోరారు. గతంలోనూ హరీశ్‌రావు వైఎస్ఆర్ దగ్గరికి వెళ్లారని రేవంత్ ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ నుంచి హరీశ్‌రావు పోటీ చేయడు, హరీశ్‌రావు ఎవరెవరితో మాట్లాడుతున్నారో తనకు తెలుసునని కానీ తాను చెప్పనని స్పష్టం చేశారు. హరీశ్‌రావు ఫ్యూచర్ ఏంటో ఆయనకే తెలియదు, బిజెపిలో చేరనని హరీశ్‌రావు కెసిఆర్ మీద ఒట్లేసి చెప్పగలరా? అని ప్రశ్నించారు. పార్టీ మీటింగ్ వదిలేసి హరీశ్‌రావు దిల్లీకి ఎందుకు వెళ్లారో చెప్పాలన్నారు. హరీష్ రావు ఇదులకుంట చెరువు అక్రమాలపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి పోటీ చేస్తాయనటంలో అనుమానమే లేదని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రాథమిక ఆధారాలతో 2 కేసులు సీబీఐకి ఇచ్చామని, సీబీఐ దర్యాప్తు ఇంకా ఎందుకు జరగట్లేదో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. 2034 వరకు రాష్ట్ర రాజకీయాల్లోనే ఉంటానని, తర్వాత కేంద్ర రాజకీయాల్లోకి వెడతానని మరోసారి స్పష్టం చేశారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్, తనది విజయవంతమైన కాంబినేషన్ అన్న రేవంత్ రెడ్డి.. తమ ఇద్దరి నేతృత్వంలో అన్ని ఎన్నికలు గెలిచామన్నారు. 2029లో జరిగే ఎన్నికల్లోనూ గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహేశ్‌గౌడ్‌కు మంచి పదవి రావొచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. జవాబుపత్రాలు తారుమారు చేసిన గ్లోబరీనా సంస్థ కేటీఆర్ బినామీ సంస్థ అని సీఎం ఆరోపించారు. కెసిఆర్ తెలంగాణ ప్రజలకు అబద్దాలు చెప్పారు, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంట్ ఉండదని అన్నారు, రెండున్నర ఏండ్లలో కరెంట్ ఎప్పుడన్న పోయిందా? అని ప్రశ్నించారు. అంతర్రాష్ట్ర జలవివాదాలను పరిష్కరించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ చెప్తున్నారని, ప్రాణహిత ప్రాజెక్టుపై మహారాష్ట్ర సీఎంతో చర్చలకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. ఆ రాష్ట్ర సీఎం ఎందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదో చెప్పాలన్నారు. పోలవరం కోసం 7 మండలాలు ఇచ్చిన మోదీ.. తెలంగాణ కోసం తిరిగి ఇప్పించలేరా అని ప్రశ్నించారు. ఎన్టీఆర్‌ను కులం, ప్రాంతంతో పోల్చడం బుద్ధిలేని తనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పువ్వాడ అజయ్ ఖమ్మంలో ఎన్టీఆర్ విగ్రహం పెట్టలేదా.. కమ్మ సంఘానికి కేసీఆర్ 10 ఎకరాలు ఇవ్వలేదా.. అంటూ ప్రశ్నించారు. పొట్టి శ్రీరాములు వర్సిటీకి సురవరం పేరు పెట్టిందే తానేనని ముఖ్యమంత్రి చెప్పారు. ఆంధ్రలో తెలంగాణ వాళ్ల విగ్రహాల గురించి ఏపీలో పార్టీ పెట్టిన కేసీఆర్‌ను అడగాలని సూచించారు. కేటీఆర్.. తారకరామారావు పేరు ఎందుకు మార్చుకోవడం లేదని ప్రశ్నించారు. వివాదాలు, సెంటిమెంట్‌తో రాజకీయాలు చేయాలని అనుకోవట్లేదని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇప్పుడే తొందర లేదని, ఉద్యోగులంతా జనగణన, ఎస్ఐఆర్ కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారని సిఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# కర్ణాటక సిఎల్‌పి నేతగా డికె

>> కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవం లోక్‌భవన్‌లో జరుగుతుందని నిరాడంబరంగా నిర్వహించాలనే ఉద్దేశంతోనే సీఎం ప్రమాణస్వీకారోత్సవ వేదికను లోక్‌భవన్‌కు మార్చినట్లు చంద్రశేఖర్ చెప్పారు. డీకే శివకుమార్ శనివారం ఉదయం లోక్‌భవన్‌లో గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్‌తో భేటీ అయ్యారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపైనే వీరిద్దరి మధ్య ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాలని గవర్నర్‌కు డికె లేఖ అందించారు. ఆయన వెంట సిద్ధరామయ్యతోపాటు పలువురు సీనియర్ కేబినెట్ సహచరులు కూడా ఉన్నారు. గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్ ఆదివారం ధర్మస్థలలో జరిగే ఉపరాష్ట్రపతి పర్యటనకు హాజరుకావాల్సి ఉంది. ఇందుకోసం ఆయన ఈ రోజే బెంగళూరు వెళ్తున్నారు. గవర్నర్ అందుబాటులో ఉండరనే ఉద్దేశంతోనే, సీఎల్పీ సమావేశానికి ముందే డీకే ఆయనతో భేటీ అయినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. సీఎం అయ్యాక, కొత్త మంత్రి వర్గంలో సిద్ధరామయ్య కుమారుడికి చోటు దక్కే అవకాశాలున్నాయి. సీఎం పదవికి రాజీనామా చేసి ఢిల్లీ వెళ్లిన సిద్ధరామయ్య, కొత్త క్యాబినెట్‌లో తన తరఫున మంత్రుల జాబితాను పార్టీ అగ్రనేతలు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ పరిశీలన కోసం అందించారు. అందులోనూ తన కుమారుడు, ఎమ్మెల్సీ డాక్టర్ యతీంద్రకు ఉపముఖ్యమంత్రి పదవితోపాటు, కీలక శాఖలు కేటాయించాలని ప్రత్యేకంగా కోరినట్లు తెలుస్తోంది. అయితేసిద్ధరామయ్య ప్రభుత్వంలోని మంత్రుల్లో దాదాపు సగం మందికి కొత్త మంత్రివర్గంలో చోటు దక్కకపోవచ్చని సమాచారం.

**నలుగురు ఉపముఖ్యమంత్రులకు డికెశివకుమార్‌నో!**

కర్ణాటక సీఎంగా పగ్గాలు చేపట్టబోతున్న డీకే శివకుమార్ తన క్యాబినెట్‌లో నలుగురు ఉప ముఖ్యమంత్రుల ప్రతిపాదనకు నో చెప్పారు. ఈ విషయంలో తన నిర్ణయాన్ని ఆయన అధిష్ఠానానికి తెలియజేశారు. కర్ణాటక కాంగ్రెస్‌లో చాలామంది సీనియర్లు ఉన్నందున కొందరిని మాత్రమే ఉపముఖ్యమంత్రులుగా ఎంపిక చేయడంవల్ల పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి రేగుతుందని పార్టీకి వివరించారు. జూన్ 3న డీకే శివకుమార్‌తోపాటు కొద్దిమంది మాత్రమే మంత్రులుగా ప్రమాణస్వీకారం చేస్తారని తెలుస్తోంది. రాష్ట్ర నాయకత్వం, కాంగ్రెస్ అధిష్ఠానం మధ్య సంప్రదింపుల అనంతరమే తదుపరి మంత్రివర్గ విస్తరణ ఉంటుందని సమాచారం. కర్ణాటక అసెంబ్లీలో మొత్తం 32 మందిని మంత్రివర్గంలోకి తీసుకునే వీలుంది. మంత్రివర్గం కూర్పుపై చర్చలను కాంగ్రెస్ అధిష్ఠానం ఇప్పటికే ముమ్మరం చేసింది.పలువురు సీనియర్ మంత్రులను క్యాబినెట్‌లోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ఆ సీనియర్‌లలో ఎంబీ పటేల్, జి పరమేశ్వర, కేజీ జార్జి, ప్రియాంక్ ఖర్గే, యతీంద్ర సిద్ధరామయ్య, కేబీ గౌడ, లక్ష్మీ హెబ్బాల్కర్, బి సురేష్, సంతోష్ లాడ్ పేర్లు ఉన్నాయి. అసెంబ్లీ స్పీకర్ పదవికి రేసులో సీనియర్ మంత్రులు హెచ్‌ఎం మునియప్ప, హెచ్‌కే పటేల్ ఉన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం, శివకుమార్, సిద్ధరామయ్య మధ్య సంప్రదింపుల ఆధారంగానే మంత్రివర్గం తుది కూర్పు ఉంటుందని చెబుతున్నారు.

## మండుటెండల కారణంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాల సమయం మార్పు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే30:** మండుటెండల కారణంగా ఈసారి తెలంగాణ రాష్ట్ర ఆవిర్బావ దినోత్సవ వేడుకలను ఉదయం పూట నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జూన్2న పేరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే వేడుకలను ఉదయం 8.30కే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. జాతీయ పతాకావిష్కరణతో పాటు అవతరణ ఉత్సవ కార్యక్రమాలను గంటన్నర వ్యవధిలో పూర్తి చేయాలని సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా వేడుకలకు హాజరయ్యే అతిథులకు, ప్రజలకు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.

## ఇ వేలం ద్వారా మొక్కజొన్న విక్రయం

>> 78,916 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన 3,80,187 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న విక్రయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన వినూత్న ఈ వేలం విధానం ఫలితంగా అదనపు ఆదాయం వచ్చినట్లు మంత్రి తెలిపారు. గతంలో మార్క్‌ఫెడ్‌లో మొక్కజొన్న విక్రయానికి మొదట గోదాము వారీగా ఈ వేలం నిర్వహించేవారని, గత నెల ఒకటవ తేదీన జరిగిన ఈ వేలంలో సగం పరిమాణానికి మెట్రిక్ టన్నుకు రూ. 14,355 ధర లభించగా, మరో సగానికి బిడ్డర్లు ముందుకు రాలేదన్నారు. దీంతో ఏప్రిల్ 24వ తేదీన మరోసారి జరిగిన టెండర్‌లో సగటు ధర మెట్రిక్ టన్నుకు రూ. 14,010 మాత్రమే లభించిందని, ఈ క్రమంలో అధిక పోటీ వాతావరణంతో ఈ నెల 29న జరిగిన ఈ వేలంలో మెట్రిక్ టన్నుకు రూ. 19,337 ధర లభించిందని, ఇది గత టెండర్ కంటే టన్నుకు రూ. 5,327 అధికమని మంత్రి వివరించారు. మొత్తం నిల్వలపై గత టెండర్‌ను ఆమోదించి ఉంటే రూ. 532.64 కోట్లు మాత్రమే లభించేవని, తాజా ఈ వేలంలో హెచ్1 ధరల ప్రకారం రూ. 735.20 కోట్లు లభించడంతో రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 202.56 కోట్ల అదనపు ఆదాయం వచ్చిందని మంత్రి తెలియజేశారు. గత టెండర్‌ను రద్దు చేసి, రాష్ట్రంలోని సమీప గోదాములను భౌగోళిక ప్రాతిపదికన సమీకరిస్తూ మొత్తం నిల్వలను 25 లాట్లుగా విభజించి ఎక్కువ మంది బిడ్డర్లు పాల్గొనేలా నిబంధనలను సరళీకృతం చేశామన్నారు. దీంతో దేశవ్యాప్తంగా బిడ్డర్ల మధ్య పోటీని పెంచి ప్రభుత్వం మెరుగయిన ధర పొందిందని, ప్రజా ధనాన్ని పరిరక్షిస్తూ ప్రభుత్వానికి గరిష్ఠ ఆదాయం సమకూర్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

# వరల్డ్‌లో విశ్వసనీయమైన ఓటరుజాబితా సవరణ 'సర్'

## -సిఇసి జ్ఞానేష్‌కుమార్

**న్యూఢిల్లీ, మే 30:** ప్రపంచంలోనే అత్యంత విశ్వసనీయమైన, కచ్చితమైన ఓటరు జాబితాలను సిద్ధం చేయడం కేంద్ర ఎన్నికల సంఘం లక్ష్యమని సిఇసి జ్ఞానేశ్ కుమార్ స్పష్టం చేశారు. పౌరుడిని ఓటరు జాబితాలో చేర్చేందుకు ఎన్నికల యంత్రాంగం చురుకుగా పనిచేస్తోందని తెలిపారు. జాతీయ స్థాయిలో న్యాయవాదుల కోసం నిర్వహించిన రెండో జాతీయ సదస్సులో జ్ఞానేశ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. 18 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రతిభారత పౌరుడు ఓటరుగా నమోదుకు ఈసీ ప్రాధాన్యత ఇస్తోందని, అదే సమయంలో మరణించిన వారు, డూప్లికేట్ పేర్లు ఉన్నవారు, చిరునామా మార్చినవారు, గైర్హాజరు ఓటర్లు, విదేశీ పౌరులు వంటి అర్హత లేని వ్యక్తుల పేర్లను ఓటరు జాబితాల నుంచి క్రమబద్ధంగా తొలగిస్తున్నట్లు వెల్లడించారు.
ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం భారత అత్యున్నత న్యాయస్థానం పరిశీలనను విజయవంతంగా ఎదుర్కొనడమే కాకుండా రాజ్యాంగబద్ధ, చట్టబద్ధ బాధ్యతలను సమర్థవంతంగా నెరవేర్చిందని పేర్కొన్నారు.

పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల నిర్మాణ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో ఇల్లు కట్టుకోవాలంటే సామాన్యుడు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇంధన ధరలపెరుగుదలవల్ల రవాణా ఛార్జీలు, ముడి సరుకుల ధరలు,కార్మికుల వేతనాలు అమాంతంపెరిగాయి. దీంతో మొత్తం నిర్మాణవ్యయం 5శాతం వరకు పెరిగేఅవకాశం ఉంది. సిమెంట్, ఇసుక, ఉక్కు (స్టీల్), ఇటుకలు వంటి నిర్మాణ సామగ్రిని దూర ప్రాంతాల నుండి హైదరాబాద్ లేదా ఇతర నగరాలకు తీసుకురావడానికి రవాణా ఛార్జీలు భారీగా పెరిగాయి. జేసీబీలు, మిక్సర్లు, క్రేన్లు ఇతర హెవీ మెషినరీ నడపడానికి డీజిల్ అత్యవసరం. ఇంధన ఖర్చులు పెరగడంతో కాంట్రాక్టర్లకు రోజువారీ నిర్వహణ ఖర్చులు తడిసిమోపడవుతున్నాయి. రవాణా వ్యయం పెరగడంతో ఆటోమేటిక్‌గా సిమెంట్, స్టీల్ వంటికీలకమైన నిర్మాణ సామగ్రి ధరలు మార్కెట్‌లో పెరుగుతున్నాయి. నిర్మాణ వ్యయం పెరగడంతో డెవలపర్లు/రియల్టర్లు అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాల ధరలను పెంచవలసివస్తుంది. ఫలితంగా సొంత ఇల్లు, స్థలాలుకొనాలనుకునే సామాన్య, మధ్యతరగతి ప్రజలపై అదనపు భారం పడుతోంది. ఇంధన ధరలపెరుగుదలతో ద్రవ్యోల్బణం పెరిగి నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రోజువారీ జీవనం సాఫీగా సాగాలంటే కార్మికులుసైతం తమవేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ముడిచమురు సంక్షోభంఇలాగే కొనసాగితే, రానున్న రోజుల్లో ధరల మంట మరింత భయంకరంగా ఉండబోతోందనిఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. భవిష్యత్తులో పెట్రోధరలు మరింతగా పెరుగుతాయన్న ఆందోళనల నేపథ్యంలో పరిమితి ఆదాయం లేని నల్లధనస్వాములకు ఏధరఎంత పెరిగినా ఇబ్బంది ఉండకపోవచ్చేమో కాని రెక్కాడితే డొక్కాడని రోజువారీ కూలీలు, నిరుపేద, మధ్యతరగతి ప్రజల జీవితాలను మాత్రం కోలుకోలేని దెబ్బతీయడం ఖాయంగా కనిపిస్తోంది.

# పెట్రో ధరల పెంపుతో అన్ని రంగాలు కుదేలు

**బోగిని మల్లికార్జున్**

ఇంధన ధరల పెంపుతో పలు రంగాలు కుదేలవుతున్నాయి. పెట్రో ధరల పెంపు ప్రతికూల ప్రభావం రవాణా రంగంపైనే కాకుండా వ్యవసాయం, నిర్మాణ రంగం, ఫుడ్ ఇండస్ట్రీ ఇలా పలు రంగాలను కుదుపు కుదేపేస్తోంది. పెట్రో ధరల పెంపు ఇలానే కొనసాగితే మార్కెట్‌లో ద్రవ్యోల్బణం పెరిగి, బ్యాంక్ వడ్డీ రేట్లు కూడా పెరిగే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ పెట్రో ధరల పెంపు ఇంతటి ఆగిపోదని, రానున్న రోజుల్లో మరింత పెరుగుతాయన్న నిపుణుల హెచ్చరికలు అన్నివర్గాల ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. లీటరు పెట్రోల్, డీజిల్ ధర రూ.150ని తాకే అవకాశముందన్న ప్రచారం దేశ ఆర్థిక మార్కెట్‌ను కుదిపేస్తోంది. వాస్తవానికి దేశంలో పెరుగుతున్న ఇంధన ధరలు ముందుగా సామాన్య ప్రజలు, వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు భారీగా పెరగడం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు దేశీయంగా పెట్రోల్,డీజిల్ ధరలను రోజుల వ్యవధిలోనే నాలుగుసార్లు పెంచాయి. ఈ పెంపుతో పెట్రోల్, డీజిల్ రేట్లు రెండేళ్ల గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. ఈ క్రమంలోగత 11 రోజుల్లో పెట్రోల్, డీజిల్ రేట్లు సగటున రూ.8మేర పెరిగాయని చెప్పొచ్చు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపు పరభావం అత్యంత వేగంగా, నేరుగా పడేది రవాణారంగం పైనే. ప్రతి రోజూ ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు, సొంత వాహనాలు వాడే వారిపై తక్షణ భారం పడుతోంది. లారీలు, ట్రక్కుల నిర్వహణ ఖర్చుల్లో కేవలం డీజిల్ వాటానే దాదాపు 55శాతంగా ఉంటుంది. దీనికితోడు టైర్లు, ఇన్సూరెన్స్, టోల్ ఛార్జీలు, మెయింటెనెన్స్ ఖర్చులు ఇప్పటికే పెరిగాయి. ఇప్పుడు లీటరుకు రూ.8 మేర ధర పెరగడంతో రవాణా వ్యాపారం నిర్వహించడం యజమానులకు అదనపు భారంగా మారింది. అలాగే క్యాబ్ సర్వీసులు, ఆటోలు, స్కూల్ బస్సులు, అంతరాష్ట్ర బస్సు ఛార్జీలు రాబోయే రోజుల్లో మరింత పెరగనున్నాయి. వాస్తవానికి దేశ ఆర్థిక వ్యవస్థకు డీజిల్ ఒక వెన్నెముక లాంటిది. దేశంలోని సప్లై చైన్, లాజిస్టిక్స్ రంగాలతోపాటు వ్యవసాయ రంగం పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో తీవ్రంగా ప్రభావితమవుతోంది. డీజిల్ ధరలు పెరగడంతో ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలు సరకు రవాణా ఛార్జీలను పెంచడం ప్రారంభించాయి. దీనివల్ల ఒక నగరం నుంచి మరో నగరానికి సరుకులను తరలించే ఖర్చు పెరుగుతోంది. నిర్వహణ ఖర్చులు భరించలేక కొన్ని ప్రాంతాలలో రవాణా వాహనాలను షెడ్లకే పరిమితం చేస్తు




న్నట్లు తెలుస్తోంది. లారీలు, ఇతర వాణిజ్య వాహనాలకు డీజిల్ ప్రధాన ఇంధనం. పెట్రో ధరలు వరుసగా పెరుగుతుండడంతో సరుకు రవాణా వ్యయం విపరీతంగా పెరుగుతోంది. ఆర్టీసీ బస్సుల నిర్వహణ ఖర్చులు పెరిగి, సంస్థలపై అదనపు భారం పడుతుంది. హైదరాబాద్, విజయవాడ వంటి నగరాల్లో ఆటోలు, క్యాబ్‌లు నడుపుకునే డ్రైవర్ల రోజువారీ ఆదాయం తగ్గి, జీవనం కష్టతరంగా మారుతుంది. పెట్రో ధరల పెంపుతో దేశవ్యాప్తంగా సామాన్యుడి నెలవారీ బడ్జెట్‌ను ప్రభావితం చేస్తుంది. వరుసగా పెట్రో ధరల పెంపు సామాన్య, మధ్యతరగతి కుటుంబాల బడ్జెట్‌పై తీవ్రమైన అదనపు భారాన్ని మోపుతోంది. ముఖ్యంగా డీజిల్ ధరలు పెరగడం వల్ల రవాణా, లాజిస్టిక్స్ రంగానికి అయ్యే ఖర్చులు గణనీయంగా పెరగబోతున్నాయి. పెరిగి పెట్రోధరలకు అనుగుణంగా సరుకు రవాణా ఖర్చులు పెరిగి ఆ ప్రభావం నిత్యావసర వస్తువులైన పాలు, కూరగాయలు, గుడ్లు, బ్రెడ్ వంటి రోజువారీ వస్తువుల ధరలపై పడుతోంది. రవాణా వ్యయం పెరిగిన ప్రతిసారీ మార్కెట్లో వస్తువుల ధరలు ఆటోమేటిక్‌గా పెరుగుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి లారీలద్వారా వచ్చే టమాటాలు, ఉల్లిపాయలు, ఆకు కూరలు, పండ్ల ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. అలాగే పాడి పరిశ్రమలకు రవాణా ఖర్చులు పెరగడం వల్ల పాల ప్యాకెట్ల ధరలను సైతం పెంచుతున్నాయి. నిత్యావసర సరుకులు, ప్యాక్ చేసిన ఆహార పదార్థాల పంపిణీ వ్యయం పెరిగిపోతోంది. పెట్రో ధరలపెంపుతో వంట నూనెల ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఒకప్పుడు కిలో రూ.140 ఉన్న వంట నూనె ధర ఇప్పుడు రూ.190కి చేరింది. మధ్యతరగతి ఇళ్లల్లో ఎక్కువగా వాడే 15 కేజీల ఆయిల్ టిన్ ధర రూ. 2,200 నుండి రూ. 2,800 కి పెరగడం గమనార్హం. ఇవే కాకుండా హోటళ్లు, రెస్టారెంట్లలో కూడా ఫుడ్ రేట్లు భారీగా పెరిగిపోయాయి. తలకిందులవుతున్న మధ్యతరగతి బడ్జెట్‌ఈ ధరల పెరుగుదల వల్ల సగటు కుటుంబాల నెలవారీ బడ్జెట్ 20 శాతం వరకు పెరిగిపోయింది. ఆఫీసులకు, పనులకు వెళ్లే టూవీలర్ వాహనదారులకు నెలకు వెయ్యి రూపాయలకుపైగా అదనంగా పెట్రోల్ ఖర్చవుతోంది. "జీతాలు పెరగడం లేదు కానీ, ఖర్చులు మాత్రం రోజురోజుకూపెరిగిపోతున్నాయి. గతంలో నెల సామాన్లకు రూ.20 వేలు ఖర్చయితే, ఇప్పుడు రూ. 24వేలవుతోంది. పిల్లల చదువులు, ఇతర ఖర్చులు చూసుకోవడమే కష్టంగా మారింది, ఇక పొదుపు అనే ముచ్చటే లేదు అని స్థానిక పౌరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకపక్క ఆకాశాన్నంటుతున్న పెట్టుబడులు, ఇంకోవైపు కంటిమీదకునుకు లేకుండా చేస్తున్న ప్రకృతి వైపరీత్యాలు, వీటన్నింటికీ తోడు పండిన పంటకు గిట్టుబాటు ధర లేక ఇప్పటికే కొట్టుమిట్టాడుతున్న అన్నదాతలకు పెట్రోభారం ఊపిరాడకుండాచేస్తోంది. ఇటీవల వరుసగా పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు వ్యవసాయ రంగాన్ని కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయి. లీటరుపై ఏకంగా రూ.8 వరకు ధరలు పెరగడంతో సాగుఖర్చులు భారమై రైతులు విలవిలలాడుతున్నారు. సాగులో కీలకమైన ట్రాక్టర్ ఎక్కాలన్నా, పంటకు నీటిని సరఫరా చేసే ఇంజన్ నడవాలన్నా డీజిలే ముఖ్యం. ఆధునిక వ్యవసాయంలో ప్రతి పనికీ యంత్రాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. పొలం దున్నడానికి, నాట్లువేయడానికి, పంట కోతలకు, చివరకు పండించిన ధాన్యాన్ని మార్కెట్‌కు తరలించాలన్నా ట్రాక్టర్లు, లారీల అవసరం తప్పనిసరి. వీటన్నింటికీ డీజిలే ఇంధనం. ఇప్పుడు లీటరు ధర అమాంతం పెరిగిపోవడంతో ఎకరాకు అయ్యే సాగుఖర్చు వేలల్లో పెరిగిపోయింది. 'పెట్టిన పెట్టుబడి కూడా చేతికి వచ్చేలా లేదు, ఇక వ్యవసాయం దండగ అనే పరిస్థితి వస్తోంది' అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నెపం నెట్టేసుకోకుండా, రైతాంగాన్ని ఆదుకోవడానికి తక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. ఇప్పటికైనా పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే తగ్గించి వ్యవసాయరంగాన్ని సంక్షోభం నుండి గట్టెక్కించాలని రైతుసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. వరుసగా డీజిల్ ధరలు పెరుగుతూ పోతే వ్యవసాయ పెట్టుబడి విపరీతంగా పెరిగిపోయి రైతులకు లాభాలు గాల్లో కలిసిపోతాయి. ఇది అంతిమంగా దేశంలో తీవ్రమైన ఆహార ద్రవ్యోల్బణానికి దారితీస్తుందని మార్కెట్‌వర్గాలు భయపడుతున్నాయి. మరోవైపు పెట్రో ధరలపెంపు దెబ్బకు బస్సు ఛార్జీలు, క్యాబ్, ఆటోల రేట్లు అమాంతం పెరగడంతోనే ఆగిపోదని, మనకు రోజూ అలవాటైన స్విగ్గీ, జొమాటో వంటి ఫుడ్ డెలివరీ యాప్స్, అలాగే అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈకామర్స్ సంస్థల డెలివరీ చార్జీలు కూడా భారీగా పెరగబోతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కంపెనీలు తమపైపడే ఈ డీజిల్ భారాన్ని తగ్గించుకోవడానికి కస్టమర్లకు ఇచ్చే డిస్కౌంట్లలోకోత విధించడం లేదా డెలివరీ ఛార్జీలను పెంచడం ఖాయంగా కనిపిస్తోంది. హిందుస్థాన్ యూనిలివర్, నెస్లే, డాబర్, మారికో వంటి ప్రముఖ ఎఫ్ఎంసీజీ కంపెనీలు ఇప్పటకే ద్రవ్యోల్బణంతో ఇబ్బందులు పడుతున్నాయి. ఇప్పుడు పెరిగిన రవాణా ఖర్చులు వారి లాభాల మార్జిన్లను మరింత దెబ్బతీస్తాయి. ఇంధన ధరలు ఇలాగే కొన్ని నెలల పాటు కొనసాగితే, కంపెనీలకు రెండు మార్గాలు మాత్రమే మిగులుతాయి. ఒకటి సబ్బులు, బిస్కెట్లు, సర్ఫ్ వంటి ఉత్పత్తుల ధరలను 2 నుండి 5 శాతం పెంచడం లేదా ధర అంతే ఉంచి ప్యాకెట్ బరువును తగ్గించడం. అదే సమయంలో పెట్రోధరల పెంపు పర్యాటక రంగాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ●

కర్ణాటక

# తుపాను వెలిసిందా!

**ఎ.వి.వి ప్రసాద్**

ఒక తుపాను వెలిసింది. లేదు లేదంటూనే గత ఏడెనిమిది నెలలుగా సాగుతున్న సంక్షోభానికి తెరపడింది. ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామాచేయడం, డిప్యూటీగా ఉన్న డికె శివకుమార్‌కు కాంగ్రెస్ అధిష్ఠానం తలుపులు తెరవడం 'సజావు'గానే సాగిపోయాయి. అధికార మార్పిడి కార్యక్రమం అనేక అపోహలు సృష్టించినా, చివరికి అంతా ప్రశాంతంగానే సాగిందని చెప్పాలి. తేలవలసిన అంశాలు ఇంకా ఒకటి రెండు ఉన్నా, అవి కూడా తేలికగానే సర్దుబాటు కావచ్చు. ఎందుకంటే కాంగ్రెస్‌లో అధిష్ఠానం నిర్ణయమే 'ఫైనల్' గనుక. అధిష్ఠానం చెప్పింది గనుక తాను అధికారం నుంచి వైదొలగుతున్నాననీ, కానీ పూర్తి కాలం సేవలందించాలన్నదే తన అభిమతమనీ సిద్దరామయ్య చెప్పడాన్ని బట్టి ఆయన వ్యూహం ఎలా ఉండబోతుందనేది తేలికగానే అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ అధిష్ఠానమంటే రాహుల్ గాంధీయే. సోనియా, ఖర్గే కూడా ఈ అంతంత మాత్రమే. సిద్దరామయ్య కొనసాగడానికి ప్రియాంక గాంధీ మద్దతు ఇచ్చినా, రాహుల్ మాత్రం డికె వైపే మొగ్గు చూపారనీ, దీనిలో ఖర్గే పాత్ర ఏమీ లేదనే అంటున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడుగా ఉన్న ఖర్గే పేరు కూడా కొత్త సిఎం పదవికి ఒక దశలో ప్రచారమైంది. అయితే తనకు అలాంటి ఉద్దేశమేదీ లేదని ఖర్గే స్పష్టం చేశారు. నిజానికి 2023లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడే డికె శివకుమార్ సిఎం అవుతారని అంతా భావించారు. అయితే సామాజిక వర్గాల ప్రాధాన్యత దృష్ట్యా అప్పటికి సిద్దరామయ్యకు సిఎం సీటు ఇచ్చినా, రెండున్నరేళ్ల తర్వాత డికెకు అప్పగించే విధంగా అప్పట్లో ఇరువర్గాల మధ్య 'అంగీకారం' కుదిరిందనీ, అధిష్ఠానం ఆమోదంతోనే డికె తన వ్యూహాలు రూపొందించారనీ అంటున్నారు. దాని ప్రకారం గత నవంబరులో రెండున్నరేళ్లు పూర్తి కాగానే డికెకు సిఎం పీఠం అప్పగించాలనే డిమాండ్ మొదలయింది. కానీ తనకు ప్రజలలో అమితమైన ఆదరణ ఉన్నదనీ, అధిష్ఠానం తననే అధికారంలో కొనసాగే అవకాశం ఇస్తుందనీ సిద్దరామయ్య అంటూ వచ్చారు. డికె మాత్రం నిబ్బరంగా 'అంతా అధిష్ఠానం చూసుకొంటుందనే భరోసాతో కాలం గడిపారు. గత ఏడెనిమిది నెలలుగా అటు సిద్ధరామయ్య, ఇటు డికె ఎవరి ప్రయత్నాలు వారు చేస్తూ వచ్చినా, గత మంగళవారం ఢిల్లీలో ఇరువర్గాలు అధిష్ఠానంతో జరిపిన చర్చల తర్వాత ఒక స్పష్టత వచ్చింది. మరో రెండేళ్లలో జరిగే ఎన్నికల్లో తిరిగి కాంగ్రెస్ అధికారంలోకి రావడమే టార్గెట్‌గా అధిష్ఠానం పావులు కదిపింది. డికెకు నాయకత్వం అప్పగిస్తే 'అదనపు ప్రయోజనాలు' కనిపించడంతో, రాహుల్ ఆ మార్పిడికే మొగ్గు చూపారనే అభిప్రాయం వినిపించింది. ఆరోజున అధికార మార్పిడిపై దాదాపు ఏడు గంటల పాటు చర్చలు జరిగినా అసలు ఆ విషయమే ప్రస్తావనకు రాలేదని కాంగ్రెస్ నేతలు బుకాయించారు. కానీ ఆ రాత్రికే సిద్దరామయ్య తాను వైదొలగుతున్నట్లు


సిద్దరామయ్య

ప్రకటించడంతో సమీకరణాలు త్వరత్వరగా మారిపోయాయి. డికెకు పీఠం అప్పగిస్తే ఎవరెవరికి డిప్యూటీ సిఎం పదవులు లభిస్తాయనే చర్చలు వెల్లువెత్తాయి. నలుగురి పేర్లు తెరపైకి వచ్చాయి కూడా. దానిపై మళ్లీప్రతిష్టంభన ఏర్పడింది. సిద్దరామయ్య కురుబ సామాజిక వర్గానికి చెందినా, ఆయన నిర్మించిన 'అహింద' కూటమిలో మైనారిటీలు, ఒబిసిలు, దళితులు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. ఆయన బలమంతా ఆ కూటమిలోనే ఉంది. శివకుమార్ వొక్కళిగ సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో మెజారిటీ నియోజకవర్గాల్లో ఆయనకూ అంతే బలంఉంది. అయితే వొక్కళిగ ఓట్లు కొంత శాతం దేవెగౌడ, కుమారస్వామి నాయకత్వంలోని జెడిఎస్ కు కూడా వెళ్తాయి. కానీ 'అత్యంత సంపన్నుడైన నేత'గా శివకుమార్‌కు గల 'అదనపు బలం' అధిష్ఠానం ఆయన వైపు మొగ్గు చూపేట్లు చేసిందని చెప్పవచ్చు. ఎన్నికల సమయంలోపార్టీని ముందుకు నడిపించగల 'సంపన్న నేత' అవసరం గనుక అధిష్ఠానం మద్దతు ఆయనకే లభించింది. అధికార మార్పిడి సజావుగా సాగినా, 'దెబ్బతిన్న పులి' ఊరికే ఉండదు కదా! తనకు రాజ్యసభ పదవి వంటివి అవసరం లేదనీ, ఎమ్మెల్యేగా 'క్రియాశీలక' రాజకీయాల్లోనే ఉంటాననీ సిద్దరామయ్య అంటున్నారు. ఆ మాటలను బట్టి ఆయన వ్యూహం ఏమిటో తేలికగానే అర్థమవుతుంది. వివాదాస్పదమైన వెనుకబడిన తరగతుల కమిషన్ సామాజిక, ఆర్థిక కులగణన నివేదికను రాజీనామాకు కొన్నిగంటల ముందు బుధవారం ఆమోదించడం ద్వారా సిద్దరామయ్య వ్యూహం ఎలా ఉండబోతుందనేది తెలుస్తోంది. అది రొటీన్‌గా జరగవలసిందే అయినా, రాజీనామాకు కొంచెం ముందు మాత్రమే చర్య తీసుకోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కులగణన నివేదిక నిజానికి గత యేడాదే వచ్చినా కొన్ని సామాజిక వర్గాలకు ఆగ్రహం తెప్పించడం ఇష్టం లేక దానిని పక్కన పెట్టారు. కానీ ఇప్పుడు హఠాత్తుగా ఆమోదించడం వెనుక రాజకీయకారణాలు ఉన్నాయనే భావిస్తున్నారు. గత తొమ్మిదేళ్లలో రెండు సార్లు కులగణన జరిగినా, ఆ నివేదికలు అమలు కాలేదు. ఇప్పుడు వాటిని అమలు చేస్తే ఎన్నికల్లో కొత్త సమస్యలు ఉత్పన్నమవుతాయి. తాను సిఎంగా కొనసాగి ఉంటే సిద్దరామయ్య ఆ నివేదికను ఆమోదించే వారు కాదేమో! కానీ చివరలో ఆమోదించి వెళ్తున్నారు గనుక దాని పర్యవసానాలు కొత్త ప్రభుత్వం ఎదుర్కొనవలసి వస్తుంది. లింగాయత్ సిఎం అయిన వీరేంద్ర పాటిల్‌ను 1990లో రాజీవ్ గాంధీ హఠాత్తుగా తొలగించినప్పటి నుంచి కాంగ్రెస్ ఆవర్గానికిదూరమైంది. పార్టీ తాజాచర్య కూడా మళ్లీ అటువంటి పరిణామాలకే దారి తీయవచ్చు. ఒక తుపాను వెలిసిందికానీ మరో తుపాను రాకుండా పార్టీ అధిష్ఠానం ఆపగలదా! చూడాలి. సిద్దరామయ్య తలుచుకొంటే 'అహిందా' బలంతో మరో ఉద్యమాన్ని సృష్టించగలరు. ఏం చేస్తారో మరి! ●

చైనా

# ఎడారిలో 'అణు' కాంప్లెక్స్!

**గన్ని మోహన్**

సరిహద్దుల్లో స్థావరాలు ఏర్పాటు చేయడం, తమ సొంతగ్రామాలుగా ఆక్రమిత స్థలాల్లో పాగాలు వేయడం డ్రాగన్‌కు అలవాటన్నది జగమెరిగిన సత్యమే. తనకు ఎదురయ్యే ముప్పులన్నింటినీ ఎదుర్కొనేందుకు వీలుగా ఏకంగా ఒకమిలిటరీ కాంప్లెక్స్‌నే నిర్మిస్తోంది చైనా. జిన్‌పింగ్ హయాంలో పెరుగుతున్న సామ్రాజ్య విస్తరణ కాంక్షకు తోడు ప్రత్యర్థుల మూకుమ్మడి దాడులు చేసినా ధీటుగా తట్టుకునేందుకు వీలుగా ఎప్పటికప్పుడు తన ఆయుధ సంపత్తిని, సైనిక స్థావరాలను మెరుగు పరచుకుంటూ వస్తోంది. తాజాగా చైనాలోని ఒక మారుమూల ఎడారిలో భారీ సైనిక సముదాయానికి రూపకల్పన చేస్తున్న డ్రాగన్ తన చుట్టూ పొంచి ఉన్న ముప్పును ముందే పసిగట్టినట్లుగా తెలుస్తోంది. ఇరాన్‌కు ఆయుధసాయం అందిస్తున్నదన్న భావన అమెరికాలో ఎప్పటి నుంచో ఉంది. మరోవైపు రష్యా, చైనా దోస్తీ సుతరామూ ఇష్టంలేదు. ఇక తైవాన్ తమదేనని ఇప్పటికీ చైనా చెపుతూనే ఉంది. దక్షిణచైనా సముద్రజలాలపై మాదే హక్కు అని చాటిచెపుతున్న సంగతి తెలిసిందే. వీటన్నింటితోపాటు నేపాల్ సరిహద్దుల్లోనే తమ చైనా భాషలో గ్రామాలు ఏర్పాటు చేస్తోంది. తద్వారా నేపాల్‌ను భారత్‌పైకి ఉసిగొలిపే చర్యలుచేపట్టింది. తాజాగా చైనా వద్ద ఉన్న అణ్వాయుధాలు అమెరికాలోని ఆనగరాన్ని లక్ష్యంగా చేసుకున్నా ఛేదిస్తాయి. అత్యంత సుదూర శ్రేణి క్షిపణులు కలిగి ఉన్న అణుస్థావరాల సమీపంలోనే బీజింగ్ ప్రయోగాలు, బంకర్లు, కమ్యూనికేషన్‌తో కూడిన విస్తారమైన కాంప్లెక్స్‌ను నిర్మిస్తోంది. చైనా రూపొందించిన సుదూర లక్ష్యంఉన్న క్షిపణి తలచుకుంటే అమెరికాను చుట్టుముట్టేసి రాగలదని ఇప్పటికే రూఢి అయింది. తన అణు పరిరక్షణ ప్రణాళికలో భాగంగా ఈ క్షిపణులున్న ప్రాంతంలో భారీగా రక్షణ కాంప్లెక్స్‌ను నిర్మిస్తోంది. అష్టభుజి ఆకారంలో నిర్మిస్తున్న ఈ కాంప్లెక్స్‌లలో అణు క్షిపణుల లాంచ్‌పాడ్స్‌కూడా ఒక అంతర్భాభాగం. అలాగే సంచార వైమానిక రక్షణరంగ క్షిపణుల లాంచ్‌పాడ్‌లు, ఎలక్ట్రానిక్ యుద్ధసామగ్రి నిల్వ కేంద్రాలు వంటివికూడా ఉన్నాయి. అమెరికా రక్షణరంగ నిపుణుల అంచనాలప్రకారం చూస్తే ఇంతభారీ ఎత్తున ఎడారి ప్రాంతంలో వాయవ్య ప్రాంతంలో ఈ భారీస్థావరాలు ఏర్పాటు చేస్తున్నందంటే ముప్పు ఉండబోదని చెప్పలేమని కూడా చేస్తున్న వ్యాఖ్యలు ప్రపంచ దేశాలు అప్రమత్తం కావాల్సిన అవసరాన్ని సూచిస్తోంది. ప్రత్యేకించి పొరుగుననే ఉన్న భారత్‌కు సైతం ఎప్పటికైనా ముప్పే. తమ భారీ అణుస్థావరాలను పరిరక్షిం చుకోవడంతో పాటు శత్రువుల నుంచి ఎలాంటి ముప్పు ఎదురైనా లిప్త పాటుకాలంలో అధిగమించే సామర్థ్యంతో ఈ నిర్మాణంసాగుతోంది. అంతేకాకుండా వేలాది చదరపు కిలోమీటర్లఎడారి ప్రాంతాన్ని కూడా కవర్ చేసు కుంటూ లక్ష్యాన్ని ఛేదించగలిగే క్షిపణులు చైనా సొంతం. చైనా సైన్యం, జలాంతర్గాములు, విమానాల నుంచి అణ్వాయుధాలను ప్రయోగించ


జిన్‌పింగ్

గలిగినప్పటికీ చైనాకు వాయవ్యంగా ఉన్న జిన్ జియాంగ్ ప్రాంతం, గాన్సు ప్రాదేశిక ప్రాంతంలోని సిలో క్షేత్రాలే ఇపుడున్న అణ్వాస్త్రాల భద్రతకు ప్రధాన కేంద్రంగా ఉంది. చైనా అభివృద్ధి చేస్తున్న అణుసామర్థ్యం కట్టడికి అమెరికాచేస్తున్న యత్నాలు ఎప్పటికప్పుడు విఫలం అవుతున్నాయి. ఇటీవలి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పర్యటనలోకూడా ప్రస్తావనకు వచ్చినా సఫలంకాలేదు. చైనా అభివృద్ధిచేస్తున్న ఈ అణుస్థావరాలు హామీ అణుక్షిపణి క్షేత్రాలకు నైరుతి దిశగా ఉన్నాయి. రెండు కేంద్రాలు ఎడారిప్రాంతంలోనే రూపుదిద్దుకోవడం చూస్తుంటే ఎప్పటికైనాఇరుగు పొరుగు దేశాలతోపాటు అమెరికాకు కూడా ముప్పుపొంచి ఉందనే చెప్పాలి. అంతేకాకుండా అణుక్షిపణుల లాంచ్‌పాడ్‌లు కూడా ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే ఉత్తర ఆక్టగాన్ చుట్టూ భారీ వాహనాలతో సైనిక, అణు విన్యాసాలు కూడా జరిగినట్లు నిఘా వర్గాలు చెపుతున్నాయి. రెండో ప్రపంచ యుద్ధం ముగిసి 80 ఏళ్లయిన సందర్భంగా చైనా ఇటీవల నిర్వహించిన ఆయుధ ప్రదర్శనలో అణుక్షిపణులను కూడా ప్రదర్శించింది. అంతేకాకుండా భారీ వాహనాల్లో ఖండాంతర అణుక్షిపణులను కూడా విన్యాసాల్లో ప్రదర్శించి చైనా ప్రపంచ దేశాలకు తన సత్తాచాటింది. చైనా రూపొందిస్తున్న ఈ మిలిటరీ కాంప్లెక్స్ తన ఆయుధ పరిరక్షణ, భవిష్యత్తు ప్రయోగాలకోసమేనని నిస్సందేహంగా చెప్పవచ్చు. అయితే చైనాకు ముప్పు ఎవరివైపు నుంచిఉంటుందన్నది ఇతిమిద్ధంగా చెప్పలేం. చైనా దురాక్రమణకు పాల్పడుతున్న దేశాలకు వత్తాసుపలికే దేశాల నుంచే ముప్పుఉంటుందని చైనాకుకూడాతెలుసు. అందుకోసమే సర్వసన్నద్ధంగా ఉండేందుకు ఈ భారీ అణుక్షిపణి కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేసుకుంటోంది. ఇప్పటికే సిక్కిం, భూటాన్ సరిహద్దుల్లోను, నేపాల్ సరిహద్దుల్లోను స్థావరాలు, గ్రామాలు ఏర్పాటుచేసు కున్న చైనా అమెరికా లక్ష్యంగా తన సురక్షిత స్థావరాలను ఏర్పాటు చేసుకుంటున్నదనే భావించాలి. అమెరికాతో ఉన్నవివాదమల్లా చైనాకు అటుతైవాన్, ఇటు దక్షిణ చైనా సముద్ర జలాలేనని చెప్పాలి. అమెరికాతోపాటు ఇపుడు భారత్, ఆస్ట్రేలియా, జపాన్, బ్రిటన్ మరికొన్ని ఇతర దేశాలు కూడా క్వాడ్‌తో కూడమి కట్టాయి. తైవాన్ తమదేనని చెప్పుకోడానికి కారణంకూడా దక్షిణచైనా సముద్రజలాల వివాదాలే. తమ దేశంలో అంతర్భాగంగా చేసుకుంటే ఈజలాలపై హక్కులు తమవే ఉంటాయన్నది చైనా వ్యూహంగా స్పష్టం అవుతోంది. అందుకోసమే ముందు అగ్రరాజ్యాన్ని ధీటుగా ఎదుర్కొనాలంటే అందుకు అనువైన స్థావరాలు, ఆయుధ సామగ్రిని ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఇరాన్‌కు కారుచౌక ఆయుధాలను చైనాయే సమకూరుస్తోందన్న అమెరికా ఇప్పటికీ అనుమానం వ్యక్తం చేస్తూనే ఉంది. అత్యంత ఆధునిక ఆయుధ సంపత్తి కలిగిన అమెరికాను ఎదుర్కొనేందుకు తమవద్దఉన్న అణు సంపత్తిని కూడా చైనా సిద్ధం చేసుకుంటోంది. ఈక్రమంలో పొరుగుదేశాలు అప్రమత్తం కావాల్సిన అవసరం కూడా ఎంతో ఉంది. ●

# కోట్లాది ప్రాణాలు హరిస్తున్న ధూమపానం

**రామ కిష్టయ్య సంగన భట్ల**

క్రీస్తు పూర్వం 1400ఏళ్ల నాడే పొగాకు వాడకం మొదలైంది. ఉత్తర, దక్షిణ అమెరికా ప్రాంతాల్లోని స్థానిక తెగల వారు పొగాకును దేవుని కానుకగా పరిగణించే వారు. వేడుకల్లో పొగ తాగేవారు. పొగాకు చుట్టల నుంచి వెలువడే ధూమమేఘాల ద్వారా తమ ప్రార్థనలు భగవంతుని చేరుకుంటాయని వారు నమ్మేవారు. సొలనేసి కుటుంబానికి చెందిన ఒక చిన్న మొక్క ద్వారా తయారీ వల్ల పొగ విడుదల అవుతున్నందు వలన దీనికి 'పొగాకు' అనే పేరు వచ్చింది. దీని ఆకుల నుండి సిగరెట్లు, చుట్టలు తయారు చేస్తారు. దీనిని కొన్ని రకాల తాంబూలాలలో కూడా ఉపయోగిస్తున్నారు. యూరోపియన్లు అమెరికాలో అడుగు పెట్టడం ప్రారంభమయ్యాక క్రీస్తుశకం 16వ శతాబ్దం నాటికి పొగాకు క్రమంగా యూరోపియన్ దేశాలకు, ఆ తర్వాత శరవేగంగా ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించింది. బ్రిటిష్ వారి ద్వారా పొగాకు భారత దేశానికి చేరుకుంది. పొగాకు పరిచయం కావడానికి ముందు భారత దేశంలో ఎక్కువగా గంజాయితోనే పొగ తాగేవారు. ఆధునిక వైద్య పద్ధతులు అందుబాటులోకి వచ్చిన తొలినాళ్లలో పొగాకును ఔషధంగా పరిగణించే వారు. సిగరెట్ల కంపెనీలు వైద్యులతో వ్యాపార ప్రకటనలు ప్రచారం చేసుకునేవి. 20వ శతాబ్దిలో సగానికి సగం కాలం ఇలాగే గడిచింది. పొగాకు వల్ల క్యాన్సర్ వంటి అనర్థాలు తలెత్తుతున్నట్లు గుర్తించిన తర్వాత పరిస్థితిలో మార్పు వచ్చింది. ప్రపంచ ఆరోగ్య సంస్థసహా పలు అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలు పొగాకు వ్యతిరేక ప్రచారం ప్రారంభించాయి. పలు ప్రభుత్వాలు కూడా పొగాకు వాడకంపై ఆంక్షలు అమలులోకి తెచ్చాయి. బొలీవియా, పెరూ పొగాకు జన్మస్థలంగా పరిగణించ బడతాయి. క్రిస్టోఫర్ కొలంబస్ యాత్రల ద్వారా ఐరోపాకు తీసుకు రాబడినట్లు, అలా పొగాకు సాగు క్రమంగా ఉత్తర అమెరికా, చైనా, భారతదేశం, పూర్వ యుఎస్ ఎస్ఆర్ భూభాగంలో, ట్రాన్స్‌కా కాసియా, ఉజ్బెకిస్తాన్, కజికిస్తాన్, మోల్డోవా, ఉక్రెయిన్, క్రిమియా, క్రాస్నోదర్ భూభాగంలో పెంచడం క్రమానుగతంగా జరిగాయి. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం మే 31న ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏటా నిర్వహిస్తారు. పొగాకు వినియోగం వల్ల ఎదురయ్యే అనర్థాలను వివరించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ 1988 నుంచి ఈ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా 110 కోట్ల మంది పొగ తాగుతున్నా రని, ఏటా పొగాకు కారణంగా 70లక్షల మంది మరణిస్తు న్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. 1987లో ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వహించిన సమావేశంలో 1988, ఏప్రిల్ 7న ధూమపాన రహిత దినోత్సవంగా పిలుపునిచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా పొగాకు వినియోగదారులను ఏప్రిల్ 7వ తేదీన 24 గంటలపాటు పొగాకు ఉత్పత్తులను వాడకుండా ఉండమని కోరింది. దానిని అనుసరించి 1988 లో జరిగిన సమావేశంలో ప్రతి సంవత్సరం మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం జరుపుకోవాలని ప్రకటించింది. ప్రపంచం లోనే అత్యధిక శాతం కిరిబాటి దీవిలో మూడులో రెండొంతుల మంది మగవాళ్లు ధూమపానానికి అలవాటు పడ్డారు. మూడొంతుల మంది ఆడవాళ్లు కూడా పొగ తాగుతున్నారు. యూరప్‌లోని మాంటెనెగ్రో దేశంలో 46శాతం మంది ప్రజలకు పొగతాగే అలవాటుంది. గ్రీస్‌లో 50శాతం మంది మగవాళ్లు, 35శాతం మంది ఆడవాళ్లు ధూమపానం చేస్తారు. ప్రపంచం లోనే అత్యధికంగా ఈస్ట్ తైమూర్‌లో 80శాతం మంది మగవాళ్లు పొగ తాగుతారు. కానీ 6శాతం మంది ఆడవాళ్లకుమాత్రమే ఆ అలవాటుంది. రష్యాలో 15ఏళ్ల పైబడిన మగవాళ్లలో 60శాతం మంది పొగ తాగుతున్నారు. 23శాతం మంది మహిళలకు ఆ అలవాటుంది. ఇక తక్కువగా పొగ తాగే వారు ఉండే దేశాలు ఏవంటే ఘనా, ఇథియోపియా, నైజీరియా, ఎరిత్రియా, పనామా. ఈ ఐదు దేశాలూ అతి




తక్కువగా పొగ తాగే దేశాల జాబితాలో ముందు వరుసలో ఉన్నాయి. ఆఫ్రికాలో 14శాతం మంది మాత్రమే పొగ తాగుతారని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. ఇటీవలి కాలంలో అవగాహన కార్యక్రమాల ఫలితంగా భారత దేశంలో పొగతాగే వారి సంఖ్య 33.8 శాతం నుంచి 23 శాతానికి తగ్గినట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి. సిగరెట్లు, బీడీలు, సిగార్లు, హుక్కా వంటి ధూమపానం, గుట్కా నమలడం కోసం పొగాకును వివిధ రకాలుగా విక్రయిస్తారు. నికోటిన్ అనేది పొగాకులో ఉండే ప్రధాన విష పదార్థం. ఇది ధూమపానం వ్యసనానికి దారితీస్తుంది. సిగరెట్లు, బీడీలు, గుట్కాలు, నసెం పొడులు, జర్దా, ఖైనీ, స్మోక్‌లెస్ టొబాకో లాంటి పలు రకాలైన పొగాకు ఉత్పత్తులు పలు ఆకర్షణీయ రూపాల్లో మనల్ని వశపరుచుకునేలా చేస్తాయి. వీటికి తోడుగా పొగతాగేవారితో తిరిగే స్నేహితులు, బంధువులు కూడా సెకండ్ హాండ్ స్మోకర్స్‌గా తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నారు. అవగాహనలేమి లేదా తెలిసి కూడా పొగాకు ఉత్పత్తుల వాడకంతో నిండుప్రాణాలు ప్రమాదం లో పడడం, చివరికి వైద్య ఖర్చులకు కుటుంబాలు బజారున పడతాయి. ఒక్కోసారి ప్రాణాలు కూడా పోతాయి. ప్రపంచ వ్యాప్తంగా పొగాకు దురలవాటుతో సాలీనా 8.7 మిలియన్ల ప్రాణాలు పోతున్నాయని, అనేక మిలియన్ల ప్రజలు అనారోగ్యాల పాలవుతు న్నారని గణాంక వివరాలు స్పష్టం చేస్తున్నాయి. 2026 ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం ఇతివృ త్తంగా అన్‌మాస్కింగ్ ది అప్పీల్ కౌంటరింగ్ నికోటిన్ అండ్‌టొబాగో అడిక్షన్ (పొగాకు కంపెనీలవిజ్ఞప్తుల గుట్టు విప్పడం నికోటిన్, పొగాకు వ్యసనాల్ని వ్యతిరేకిద్దాం)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు. పొగాకు ఉత్పత్తులను తయారు చేసే కంపెనీలు వాడే ప్రమాదకర సువాసనలను వెదజల్లే పదార్థాలను వాడడం, మార్కెటింగ్ విధానాల్లో అనైతిక పద్ధతులు వాడడం, ఆకర్షణీయ ప్యాకేజీలను వాడడం, ప్రము ఖులతో ప్రచార కార్యక్రమాలను నిర్వహించడం, ప్రమాదకర ఇతర పదార్థాలను వాడడం లాంటి పోకడలను వ్యతిరేకిం చడం జరుగుతున్నది. పొగాకు పరిశ్రమలు గుప్పించే ప్రకటనల విషవలయంలో చిక్కి 37 మిలియన్ల 13-15 ఏండ్ల పిల్లలు కూడా సతమతం అవుతున్నారు. పొగాకు, నికోటిన్ ఉత్పత్తుల పరిశ్రమలు దాదాపు 16,000 రకాల సువాసన కలిగిన రసాయన పదార్థాలను కలుపుతున్నట్లు తెలుస్తున్నది. పొగాకును ఏ రూపంలో తీసుకున్నా నష్టాలే అధికం. పొగాకు శరీర అవయవాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. ఊపిరి తిత్తులకు ముప్పు వాటిల్లి ఎంఫసియా, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ ఫల్మనరీ డిసీజ్ లాంటి ప్రమాదకరమైన వ్యాధులు సోకుతాయి. మెదడులో రక్త ప్రసరణకు అంతరాయం ఏర్పడుతుంది. గొంతు కేన్సర్, గుండెపోటు వచ్చే అవకాశంఉంది. అంతేకాకుండా పీల్చేవారికీ కూడా ప్రమాదమే. ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక మరణాలకు కారణమవుతున్న కేన్సర్‌లు, గుండె జబ్బులు, నాన్‌కమ్యూనికెబుల్ వ్యాధులు (ఎన్ సిడిలు) వంటి దీర్ఘకాల శ్వాసకోశ వ్యాధులు ధూమపానం వలనే సంభవిస్తాయి. పొగాకు తాగేవారు శ్వాస సంబంధిత సమస్యలను కలిగి ఉంటారు. ఎందుకంటే, పొగాకు ఊపిరితిత్తులను పూర్తిగా ప్రమాదానికి గురి చేస్తుంది. అంతేకాకుండా, వీరిలో అధిక శ్లేష్మంతో కూడిన దగ్గు కూడా వస్తుంది. 80 శాతం కంటే ఎక్కువ ఊపిరితిత్తుల క్యాన్సర్ మరణాలకు ధూమపానం కారణమని తెలింది. సిగరెట్లలో 70కిపైగా హానికరమైన క్యాన్సర్ కలిగించే రసాయనాలు ఉంటాయి. ప్రస్తుత కోవిడ్ మహమ్మారి విజృంభించిన నేపథ్యంలో పొగ త్రాగడం చాలా వరకు తగ్గింది. పొగ తాగడం వల్ల నేరుగా ఊపిరితిత్తులపై ప్రభావం చూపే విషయం వల్ల భయం ప్రధాన కారణం అయితే, లాక్‌డౌన్ కట్టుదిట్టమైన చర్యల వల్ల షాపులు ఎక్కువ సమయం మూసి ఉండడం, ఇళ్ల నుండి బయటికి వెళ్ళలేకపోవడం ధూమపానానికి ప్రతిబంధకాలుగా మారడం పొగాకు వాడకం తగ్గడానికి కొన్ని కారణాలు. పొగతాగడం మనేయండి, జీవితాన్ని కాపాడుకోండి. ●




# గ్రీన్‌కార్డుపై యుటర్న్

## నిబంధనలు సడలించిన అమెరికా

## వలసదారులు స్వదేశం నుంచి దరఖాస్తు చేయాలనే నిబంధనలో మార్పులు

**వాషింగ్టన్, మే 30:** అమెరికాలో శాశ్వత నివాస హక్కు (గ్రీన్‌కార్డు) నిబంధనల విషయంలో అమెరికా యూటర్న్ తీసుకుంది. గ్రీన్‌కార్డు దరఖాస్తు ప్రక్రియ జరుగుతోన్న సమయంలో వలసదారులు యుఎస్‌ను విడిచి వెళ్లాల్సిన అవసరం లేదని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ (డిహెచ్‌ఎస్) తాజాగా వెల్లడించింది. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. తాత్కాలిక వలసదారులు గ్రీన్‌కార్డు దరఖాస్తులు సమర్పించడానికి స్వదేశానికి వెళ్లాల్సి ఉంటుందని అమెరికా పౌరసత్వ, వలస సేవల సంస్థ (యుఎస్‌సిఐఎస్) ఈ నెల 21న చేసిన ప్రకటన గందరగోళానికి దారితీసిన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా డిహెచ్‌ఎస్ వివరణ ఇచ్చింది. తాజా ప్రకటనలో డిహెచ్‌ఎస్ స్పందిస్తూ.. ఇదేమీ విస్తృతస్థాయి విధాన మార్పేమీ కాదని వెల్లడించింది. దరఖాస్తుదారుడు గ్రీన్‌కార్డు ప్రక్రియను అమెరికాలో ఉండి పూర్తి చేయాలా? స్వదేశానికి వెళ్లాలా? అన్న దానిని ఇమిగ్రేషన్ అధికారి నిర్ణయిస్తారని తెలిపింది. ఇది ఎప్పటి నుంచో అమలులో ఉన్న నిబంధనే అని పేర్కొంది. ఇమిగ్రేషన్ అధికారులకు ఆ విచక్షణాధికారాన్ని గుర్తు చేయడమే మే 21న ఇచ్చిన మార్గదర్శకాల ఉద్దేశమని వివరించింది. శాశ్వత నివాసం కోరుతున్న వలసదారుల దరఖాస్తుల పరిశీలన జరుగుతున్న సమయంలో కూడా వారు యుఎస్‌లో ఉండేందుకు అనుమతి ఉంటుందని స్పష్టం చేసింది. వీసా ఓవర్‌స్టేలు, ఇమిగ్రేషన్‌కు సంబంధించిన ఇతర ఆందోళనలను మాత్రం తాము పరిగణనలోకి తీసుకుంటామని సూచనప్రాయంగా వెల్లడించింది. డిహెచ్‌ఎస్ వివరణ ఇచ్చినప్పటికీ.. ఎలాంటి పరిస్థితుల్లో గ్రీన్‌కార్డు దరఖాస్తుదారులు యుఎస్‌ను విడిచి వెళ్లాల్సిన అవసరం ఉంటుందో మాత్రం స్పష్టత ఇవ్వలేదు. దాంతో ఈ వ్యవహారంపై వలసదారుల్లో పలు ప్రశనలు మిగిలే ఉన్నాయి.

# 2.0 ఆపరేషన్ సిందూర్‌కు సైనిక బలగాలు సిద్ధం

## ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది



**న్యూఢిల్లీ,మే 30:** ఒకవేళ అవసరమైతే ఆపరేషన్ సింధూర్ 2.0 చేపట్టేందుకు సైనిక బలగాలు సిద్ధంగా ఉన్నట్లు ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది తెలిపారు. ఆధునిక యుద్ధ రీతుల్లో ఆరితేరేందుకు త్రివిధ దళాలు సన్నద్ధం అవుతున్నాయని ఆయన అన్నారు. భూమి, ఆకాశం, సముద్రంలో అత్యాధునిక రీతిలో సైనిక సామర్థ్యాన్ని పెంచుకుంటున్నట్లు చెప్పారు. పుణెలో జరిగిన నేషనల్ డిఫెన్స్ అకాడమీ పాసింగ్ ఔట్ పరేడ్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం ఉద్రిక్తల పరిస్థితులు తాత్కాలికంగా అదుపులో ఉన్నా కానీ రాబోయే దశకు చెందిన యుద్ధాన్ని ఎదుర్కొనేందుకు త్రివిధ దళాలు భీకరంగా రెడీ అవుతున్నట్లు ఆయన చెప్పారు. భవిష్యత్తులో జరగబోయే యుద్ధాలు కేవలం సంప్రదాయ రీతికే పరిమితం కావు అని, సైబర్ ఎలక్ట్రోమ్యాగ్నటిక్, కాగ్నిటివ్ డోమెయిన్లలోనూ యుద్ధ ప్రభావం ఉంటుందని ఆర్మీ చీఫ్ అన్నారు. ఆపరేషన్ సింధూర్ ద్వారా భారత్ తన సత్తా చాటిందన్నారు. సైనిక దళాలు చాలా కచ్చితత్వంతో అటాక్ చేయగలవని నిరూపించామన్నారు. యుద్ధ క్షేత్రంలో జరుగుతున్న మార్పుల పట్ల ఆర్మీ జాగృతతో ఉందని, భవిష్యత్తుకు తగ్గట్లుగా అన్ని దళాలు ఆధునిక విధానంలో సమాయత్తం అవుతున్నాయని అన్నారు. మార్పుల్లో భాగంగా దివ్యాస్త్ర బ్యాటరీలు, శక్తిమాన్ రెజిమెంట్స్, భారత్ బెటాలియన్స్‌తో పాటు ఇతర టెక్నాలజీ ఆధారిత సైన్యాన్ని రూపొందిస్తున్నట్లు ఆయన చెప్పారు. అన్ని అకాడమీల్లో డ్రోన్ల వినియోగంపై శిక్షణ జరుగుతోందన్నారు. ఎన్డీఏ శిక్షణా కేంద్రంలో భారీ డ్రోన్లు, సిములేటర్లతో ఎన్డీఏ క్యాడెట్లకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంశంలోనూ ముందంజలో ఉన్నట్లు జనరల్ ద్వివేది తెలిపారు. ఓడీఏ అబ్జర్వ్, ఓరియంట్, డిసైడ్, యాక్ట్ చక్రాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఏఐ ఆధారిత సేవల వినియోగాన్ని పెంచుతున్నట్లు చెప్పారు.

# విద్యుత్ బిల్లులపై పదిశాతం సర్‌ఛార్జి వసూలు

**రేపటి నుంచే అమలు**

**లక్నో, మే 30:** ఎండ తీవ్రతతో ఇప్పటికే భారీగా కరెంట్ బిల్లులు కడుతున్న సామాన్యుడి నెత్తిన ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం మరో పిడుగు వేసింది. జూన్ నెల నుంచి విద్యుత్ బిల్లులను కనీసం 10 శాతం పెంచుతున్నట్లు ప్రకటించింది. ఇంధన ధరల పెరుగుదల కారణంగా ఫ్యూయల్ సర్‌ఛార్జ్ భారం వినియోగదారులకు తప్పడంలేదని ఉత్తరప్రదేశ్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ శనివారం ఒక అధికారిక ప్రకటన విడుదలచేసింది. ఈ పెరిగిన ధరలు జూన్ నెలలో వచ్చే బిల్లింగ్ సైకిల్ నుండే నేరుగా వర్తిస్తాయని యూపీపీసీఎల్ స్పష్టం చేసింది. నిబంధనల ప్రకారం ఈ ఏడాది మార్చి నెలకు సంబంధించి లెక్కించిన ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ అడ్జస్ట్‌మెంట్ సర్‌ఛార్జ్ మొత్తాన్ని జూన్ నెల బిల్లుల్లో వసూలు చేయడం జరుగుతుంది. మార్చి నెలాఖరు నాటికి ఈ అదనపు భారం 10 శాతంగా తేలింది. దీన్ని అన్ని వర్గాల (గృహ, వాణిజ్య, పారిశ్రామిక) వినియోగదారుల బిల్లులకు అదనంగా చేర్చాలని ఆదేశాలు వచ్చాయని అధికారులు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ గతేడాది తీసుకొచ్చిన కొత్త నిబంధనల ప్రకారమే ఈ అదనపు సర్‌ఛార్జి ఉంటోందని రెగ్యులేటరీ అఫైర్స్ యూనిట్ చీఫ్ ఇంజనీర్ పంకజ్ సక్సేనా ఒక లేఖలో వివరించారు. ఈ కొత్త రూల్స్ ప్రకారం విద్యుత్ ఉత్పత్తి సంస్థలు కొనుగోలు చేసే బొగ్గు, గ్యాస్ వంటి ఇంధన ధరల్లో వచ్చే మార్పులు లేదా అదనపు ప్రసార ఖర్చుల భారాన్ని మూడు నెలల ఆలస్యం తర్వాత నేరుగా కస్టమర్ల అకౌంట్లలోకి బదిలీ చేసే వెసులుబాటు విద్యుత్ పంపిణీ సంస్థలకు (డిస్కమ్‌లకు) ఉంటుంది. అందువల్లే మార్చి నెలలో కంపెనీలకు అయిన అదనపు ఖర్చును, కరెక్ట్‌గా మూడు నెలల తర్వాత అంటే జూన్ బిల్లుల్లో 10 సర్‌ఛార్జ్ రూపంలో వసూలు చేస్తున్నారు. ఇప్పటికే దేశంలో ఇంధన ధరలు ఆకాశాన్ని తాకు తుండటంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పుడు కరెంట్ బిల్లులు కూడా 10 శాతం పెరగడం మధ్యతరగతి గృహాల నెలవారీ బడ్జెట్‌ను పూర్తిగా అస్తవ్యస్తం చేయనుంది.

# సంపూర్ణ ఆరోగ్యంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్!

**వాషింగ్టన్, మే 30:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్యంపై శ్వేతసౌధం ముఖ్య నివేదికను విడుదల చేసింది. ట్రంప్‌మంచి ఆరోగ్యంతో ఉన్నారని, కమాండర్ ఇన్ చీఫ్‌గా బాధ్యతలు నిర్వర్తించడానికి పూర్తిగా ఫిట్‌గా ఉన్నారని ఆ నివేదిక స్పష్టం చేసింది. మంగళవారం వాల్టర్ రీడ్ నేషనల్ మిలిటరీ మెడికల్ సెంటర్‌లో ట్రంప్‌కు వైద్య పరీక్షలు నిర్వహించగా, ఆయన వ్యక్తిగత వైద్యుడు డాక్టర్ సీన్ బార్బబెల్లా ఈ నివేదికను నిన్న విడుదల చేశారు. పరీక్షల అనంతరం ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్‌లో స్పందిస్తూ, ప్రతి ఆరు నెలలకు జరిగే తన సాధారణ వైద్య పరీక్షలు పూర్తయ్యాయని, అన్నీ పర్ఫెక్ట్‌గా ఉన్నాయని పేర్కొన్నారు. వైద్య సేవలు అందించిన డాక్టర్లు, సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సమగ్ర వైద్య పరీక్షల్లో భాగంగా 22 మంది నిపుణులు సీటీ స్కాన్, క్యాన్సర్ స్క్రీనింగ్‌లతో పాటు ఇతర పలు పరీక్షలు నిర్వహించినట్లు నివేదికలో పేర్కొన్నారు. నివేదిక ప్రకారం ట్రంప్ బరువు 108 కిలోగ్రాములుగా (238 పౌండ్లు) నమోదైంది. గత ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించిన పరీక్షలతో పోలిస్తే ఇది 6 కిలోలు ఎక్కువ. ఆయన బాడీ మాస్ ఇండెక్స్ 29.7గా ఉంది. వైద్యుల ప్రకారం బీఎంఐ 30 దాటితే ఊబకాయంగా పరిగణిస్తారు. ఈ నేపథ్యంలో ఆయన ఆహారం, శారీరక శ్రమ, బరువు తగ్గడంపై వైద్యులు కొన్ని సూచనలు చేశారు. అదే సమయంలో ఆయన మేధో, శారీరక పనితీరు అద్భుతంగా ఉందని నివేదిక స్పష్టం చేసింది. మేధోపరమైన సామర్థ్యాన్ని అంచనా వేసే మాంట్రియల్ కాగ్నిటివ్ అసెస్‌మెంట్‌లో ట్రంప్ 30కి 30 మార్కులు సాధించారు. 2018, 2025లో నిర్వహించిన పరీక్షల్లోనూ ఆయన ఇదే స్కోరు సాధించడం గమనార్హం. మందుల వాడకం వల్ల ఆయన కొలెస్ట్రాల్ స్థాయిలు గణనీయంగా మెరుగు పడ్డాయి. 2018లో 223గా ఉన్న టోటల్ కొలెస్ట్రాల్ తగ్గింది. చేతులపై ఉన్న గాయాలను తరచుగా కరచాలనం చేయడంవల్ల వైద్యులు పేర్కొన్నారు.

# లోయలో పడిన శరణార్థుల బస్సు

## - 22 మంది దుర్మరణం.. 36 మందికి గాయాలు - మృతుల్లో మహిళలు, చిన్నారులు అధికం - డ్రైవర్ నిద్రమత్తు వల్లే ఘోర ప్రమాదం

**కాబూల్, మే 30:** ఆఫ్ఘనిస్తాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదంచోటుచేసుకుంది. పాకిస్తాన్ నుంచి స్వదేశానికి ఆఫ్ఘన్ శరణార్థులతో ప్రయాణిస్తున్న ఓ ట్రక్కు బోల్తా పడటంతో కనీసం 22 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 36 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో మహిళలు, చిన్నారులే అధికంగా ఉండటం ఈ ఘటన తీవ్రతను మరింత పెంచింది. ఈ ప్రమాదం తూర్పు ఆఫ్ఘనిస్తాన్‌లోని లగ్మన్ ప్రావిన్స్ పరిధిలో కాబూల్‌నంగర్‌హార్ ప్రధాన రహదారిపై జరిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం, గంటల తరబడి నిరంతరంగా వాహనం నడిపిన డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో ట్రక్కు అదుపు తప్పి రహదారి పక్కనున్న లోతైన కాలువలోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన సమయంలో వాహనంలో భారీ సంఖ్యలో కుటుంబాలు ప్రయాణిస్తున్నట్లు అధికారులు తెలిపారు. లగ్మన్ ప్రావిన్స్ గవర్నర్ ప్రతినిధి అబ్దుల్ మాలిక్ నియాజాయ్ వెల్లడించిన వివరాల ప్రకారం మృతుల్లో 10 మంది చిన్నారులు, ఐదుగురు మహిళలు ఉన్నారు. పలువురు తీవ్ర గాయాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కొంతమంది పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్య వర్గాలు చెబుతున్నాయి. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అత్యవసర సహాయక బృందాలు, స్థానిక గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ట్రక్కులో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు గంటల పాటు శ్రమించాల్సి వచ్చింది. గాయపడిన వారిని నంగర్‌హార్, జలాలాబాద్ ప్రాంతాల్లోని వివిధ ఆసుపత్రులకు తరలించారు. ఈ ప్రమాదంలో చిక్కుకున్నవారంతా పాకిస్తాన్ నుంచి తిరిగి వస్తున్న ఆఫ్ఘన్ శరణార్థులేనని అధికారులు ధృవీకరించారు. 2023లో అక్రమ వలసదారులపై పాకిస్తాన్ ప్రభుత్వం కఠిన చర్యలు ప్రారంభించిన తర్వాత లక్షలాది మంది ఆఫ్ఘన్‌లు తమ స్వదేశానికి తిరిగి రావాల్సి వచ్చింది. దశాబ్దాలుగా పాకిస్తాన్‌లో నివసిస్తూ అక్కడే జీవనం సాగించిన కుటుంబాలు కూడా బలవంతంగా తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల ఇరాన్ కూడా ఆఫ్ఘన్ వలసదారులపై కఠిన చర్యలు చేపడుతుండటంతో వేలాది మంది స్వదేశానికి చేరుకుంటున్నారు. అయితే తిరిగి వచ్చిన వారికి సరైన నివాసాలు, ఉపాధి అవకాశాలు, రవాణా సదుపాయాలు లేకపోవడం వల్ల అనేక కష్టాలు ఎదురవుతున్నాయి. ఈ ప్రమాదం కూడా అలాంటి సంక్షోభ పరిస్థితుల్లోనే చోటుచేసుకున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఆఫ్ఘనిస్తాన్‌లో రోడ్డు ప్రమాదాలు సాధారణమవుతున్నాయి. దేశవ్యాప్తంగా పాడైపోయిన రహదారులు, సరైన భద్రతా ప్రమాణాల లేమి, వాహనాల అధిక లోడింగ్, డ్రైవర్ల అలసట, ట్రాఫిక్ నియమాల అమలులో నిర్లక్ష్యం వంటి కారణాల వల్ల ప్రతి సంవత్సరం వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ముఖ్యంగా పర్వత ప్రాంతాల్లోని ప్రమాదకర రహదారులు, లోతైన లోయలు ప్రయాణికులకు మరింత ముప్పుగా మారుతున్నాయి.



## ఒక్కపరీక్ష కూడా సవ్యంగా నిర్వహించలేకపోయారు!

### ప్రధాని మోడీపై రాహుల్ ధ్వజం

**న్యూఢిల్లీ, మే 30:** ఎన్డీయే హయాంలో ఒక్క పరీక్ష కూడా నిజాయితీగా నిర్వహించలేదని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సమస్త విద్యా వ్యవస్థను పూర్తిగా నాశనం చేశారని ఆరోపించారు. శనివారం దేశవ్యాప్తంగా పలు కేంద్రాల్లో కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహణలో ఆలస్యం జరిగింది. రాహుల్ గాంధీ దీనిపై స్పందించారు. నీట్, సీబీఎస్ఈ, ఎస్ఎస్‌సీ, ఇప్పుడు క్యూట్. నాలుగు పరీక్షలు. కోటి మంది విద్యార్థులు. ఒక్క పరీక్ష కూడా నిజాయితీగా నిర్వహించలేద్దు అని విమర్శించారు. విశ్వగురు అనే వాదనలను సవాల్ చేశారు. ప్రధాని మోడీ సమస్త విద్యా వ్యవస్థను పూర్తిగా నాశనం చేశారని ఆరోపించారు. మీరు ఏ తరం భవిష్యత్తును నాశనం చేస్తున్నారో, అదే తరం మిమ్మల్ని జవాబుదారీగా నిలబెడుతుంది అని ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. సీయూఈటీ ఆలస్యం జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో మరో వైఫల్యమని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు, ఢిల్లీ మాజీ సీఎం అతిషి విమర్శించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

# భారత్‌లో సందడిచేస్తున్న టిఫాని ట్రంప్!

**న్యూఢిల్లీ, మే 30:** అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుటుంబ సభ్యులు మరోసారి భారత దేశంలో సందడి చేస్తున్నారు. ట్రంప్ కుమార్తె టిఫానీ ట్రంప్ ప్రస్తుతం భారత్‌లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. పూర్తిగా వ్యక్తిగత పర్యటన నిమిత్తం ఇండియాకు వచ్చిన ఆమె ముందుగా భారతదేశ సంస్కృతి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచే ప్రఖ్యాత స్వామి నారాయణ్ అక్షరధామ్ ఆలయాన్ని సందర్శించారు. అక్షర్‌ధామ్ ఆలయ ప్రాంగణంలోకి అడుగు పెట్టిన టిఫానీ ట్రంప్‌కు అక్కడి నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. ఈక్రమంలోనే అక్కడి అద్భుత శిల్పకళను, భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే కట్టడాలను ఆమె అత్యంత ఆసక్తిగా తిలకించారు. ఇక్కడి కట్టడాల వైభవాన్ని చూసి ఆమె పూర్తిగా ఆశ్చర్య పోయారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో కొలువై ఉన్న 108 అడుగుల భారీ నీలకంఠ్ వర్ణి విగ్రహాన్ని ఆమె ప్రత్యేకంగా సందర్శించి అక్కడే కొంత సమయం గడిపారు. ఈ పర్యటనకు సంబంధించిన అందమైన ఫొటోలను టిఫానీ తన సోషల్ మీడియా ఖాతాల ద్వారా అభిమానులతో పంచుకోవడంతో ఈ హై ప్రొఫైల్ పర్యటన వెలుగులోకి వచ్చింది. ఢిల్లీ పర్యటన ముగించుకున్న తర్వాత టిఫానీ ఆగ్రా తాజ్‌మహల్‌ను కూడా సందర్శించారు. చారిత్రక కట్టడం ముందు కూర్చుని ఫొటోలు దిగారు. ఆగ్రా పర్యటన అనంతరం ఆమె రాజస్థాన్‌లోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన, ఎడారి నగరం జైసల్మేర్‌లో ఆమె పర్యటించి, అక్కడి కోటలను, సంస్కృతిని వీక్షించారు. ఇది పూర్తిగా టిఫానీ ట్రంప్ వ్యక్తిగత పర్యటన అయినప్పటికీ ఆమె అమెరికా అధ్యక్షుడి కుమార్తె కావడంతో భారత అధికార యంత్రాంగం అప్రమత్తం అయింది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కేంద్ర, రాష్ట్ర భద్రతా సంస్థలు ఆమె పర్యటించే ప్రాంతాల్లో అత్యంత కట్టుదిట్టమైన, భారీ భద్రతా ఏర్పాట్లను చేశాయి. ఆమె వెళ్లే మార్గాల్లో ప్రత్యేక నిఘా ఉంచారు. టిఫానీ ట్రంప్ భారత దేశానికి రావడం



ఇది మొదటి సారి కాదు. గతంలో 2018లో డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనూ ఆమె భారత్‌లో అధికారికంగా పర్యటించారు. ఆ సమయంలో తండ్రితో పాటు టిఫానీ కూడా భారత్‌కు విచ్చేసి ఇక్కడి విశేషాలను తిలకించారు.



## నేవీ వైస్ ఛీఫ్‌గా అజయ్‌కొచ్చర్ బాధ్యతల స్వీకరణ

**న్యూఢిల్లీ,మే30** ఆపరేషన్ సింధూర్ వ్యూహకర్త వైస్ అడ్మిరల్ అజయ్ కొచ్చర్ శుక్రవారం నాడు నేవీ వైస్ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం మిలిటరీలోని టాప్ నేతల మార్పులు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా అజయ్ కొచ్చర్ పదోన్నతి పొందారు. త్రివిధ దళాలు కొత్త చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాజా సుబ్రమణి, తదుపరి నేవీ చీఫ్ వైస్ అడ్మిరల్ కే స్వామినాథన్ ఆదివారం రోజున తమ కొత్త బాధ్యలు స్వీకరించనున్నారు. ఇక శుక్రవారం రోజున ముంబైలోని వెస్ట్రన్ నావెల్ కమాండ్‌కు కమాండర్‌గా వైస్ అడ్మిరల్ సంజయ్ వాత్సాయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుత సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్, నేవీ చీఫ్ అడ్మిరల్ డీకే త్రిపాఠి శని, ఆదివారాల్లో పదవీవిరమణ చేయనున్నారు. ఆర్మీ జనరల్ ఉపేంద్ర ద్వివేది జూన్ 30వ తేదీన ఆర్మీ చీఫ్‌గా రిటైర్ కానున్నారు. వైస్ అడ్మిరల్ కొచ్చర్‌ది హర్యానాలోని కర్నాల్. ఆయన తండ్రి హర్యానా ఇరిగేషన్ శాఖలో మాజీ ఇంజినీర్. శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన తర్వాత జాతీయ వార్ మెమోరియల్ వద్ద కొచ్చార్ పుష్పగుచ్ఛం ఉంచారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో నేవీకి చెందిన ప్లానింగ్‌ను అడ్మిరల్ కొచ్చార్ చేశారు. ముంబై నుంచి ఆయన ఆ ఆపరేషన్ నిర్వహించారు. పశ్చిమ సముద్ర ప్రాంతంలో ఉన్న శత్రు సమస్యను ఆయన తన ప్లానింగ్‌తో ఎదుర్కొన్నట్లు చెప్పారు. సాంప్రదాయ, సాంప్రదాయేతర శైలిలో వెస్ట్రన్ కమాండ్ ఆ సమయంలో రెస్పాండ్ అయ్యింది. వైస్ అడ్మిరల్ కొచ్చర్ 1988 జూలైలో నేవీలో చేరారు.

# అమరత్వానికి పుతిన్ యాంటీ ఏజింగ్ ప్రాజెక్టు

## 26 బిలియన్ రూబుళ్లతో ప్రణాళిక

## 3-డి ప్రింటింగ్‌తో జీవకణాల రూపకల్పన, అభివృద్ధి

## మినీపిగ్స్‌లో మానవ అవయవాల పెంపు

**మాస్కో, మే 30:** గత కొన్నేళ్లుగా రష్యా అధ్యక్షుడు పుతిన్ అమరత్వం గురించి మాట్లాడుతున్నారు. 73 యేళ్ల వయసున్న పుతిన్ చావును ఎదురించి ఎక్కువ కాలం రష్యా అధ్యక్షుడిగా పనిచేయాలని ఆరాటపడుతున్నారు. ఇప్పటికే మనుషుల అవయవాలపై రష్యా సైంటిస్టులు ఎన్నో ప్రయోగాలు చేస్తున్నారు. ఇప్పుడు చావును జయించేందుకు 26 బిలియన్ల రూబుల్స్ ఖర్చుతో 'యాంటీ-ఏజింగ్' ప్రాజెక్టును మొదలుపెట్టారు. 3-డి ప్రింటింగ్ ద్వారా జీవకణాలను సృష్టించి వాటిని డెవలప్ చేస్తారు. ఆ తర్వాత మినీపిగ్స్‌లో మానవ అవయవాలను పెంచుతారు. రాబోయే రోజుల్లో మనుషుల పూర్తి అవయవాలను కూడా మార్చేందుకు ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుందట. ఇలా మార్చడం ద్వారా మనుషుల మరణాన్ని వాయిదా వేసుకోవచ్చనేది పుతిన్ ఆలోచన.

**పుతిన్ కూతురు నేతృత్వంలో..**

ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు పుతిన్ కూతురు మరియా, ప్రముఖ సైంటిస్టు మైఖేల్ కోవాచుక్ నేతృత్వం వహిస్తున్నారు. ఈ ప్రాజెక్టు విజయవంతం అయిన తర్వాత అవసరమైతే మనుషుల పూర్తి అవయవాలను మినీపిగ్స్‌లో పెంచే అవయవాలతో రీప్లేస్ చేయొచ్చని కోవాచుక్ మీడియాతో తెలిపారు. అయితే ఈ ప్రాజెక్టుపై రష్యాలో బయోప్రింటింగ్ వ్యవస్థ సృష్టించిన ప్రముఖ సైంటిస్ట్ అలెగ్జాండర్ ఓస్ట్రోవ్‌స్కీ అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు కేవలం కోరికల స్థాయిలోనే ఉందని.. కార్యరూపం దాల్చలేదన్నారు.

# మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై రాళ్లదాడి



**కోల్‌కత్తా, మే 30:** పశ్చిమ బెంగాల్‌లోని సోనార్‌పూర్‌లో శనివారం మమతా బెనర్జీ మేనల్లుడు, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ బెనర్జీపై దాడి జరిగింది. ఎన్నికల అనంతర హింసాకాండ బాధితుల కుటుంబాలను పరామర్శించడానికి వెళ్లిన సందర్భంగా ఆయనపై గుడ్లు, రాళ్లు విసిరారు. ఇదే సమయంలో బీజేపీ కార్యకర్తలు ఆయనకు వ్యతిరేకంగా దొంగ దొంగ అని నినాదాలు చేశారు. ఈ దాడి నుంచి అభిషేక్‌కు కాపాడేందుకు భద్రత సిబ్బంది తమ హెల్మెట్ ఇచ్చి రక్షణగా నిలిచారు. బీజేపీ కార్యకర్తలే దాడి చేశారని టీఎంసీ ఆరోపించింది. అక్కడ ఉద్రిక్తతలు చోటుచేసుకోవడంతో భద్రతా సిబ్బంది ఆయనను చుట్టుముట్టి రక్షణగా నిలుస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ఘటన అనంతరం అభిషేక్ బెనర్జీ మీడియాతో మాట్లాడుతూ ఈ దాడిని బీజేపీయే ప్రోత్సహించిందని ఆరోపించారు. ఇదంతా బీజేపీయే ప్రోత్సహించింది. వాళ్లు ఏం చేశారో చూడండి. ఇదేనా వాళ్ల ప్రజాస్వామ్యానికి ఉదాహరణ. నెల కూడా కాలేదు, పోలీసులు ఎక్కడా కనిపించడం లేదని ఆయన అన్నారు. దాడి చేసినవారు తనను చంపడానికే వచ్చారని ఆరోపించిన బెనర్జీ ఈ ఘటన మొత్తం కెమెరాలో రికార్డయిందని పేర్కొన్నారు. వారు నన్ను చంపాలనుకున్నారు. ఈ ఘటన మొత్తం కెమెరాలో రికార్డ్ అయింది. మేము ఈ విషయాన్ని హైకోర్టు దృష్టికి తప్పకుండా తీసుకువస్తాం గవర్నర్‌కు కూడా తెలియజేస్తాం. నేను తప్పకుండా కోర్టును ఆశ్రయిస్తానని ఆయన అన్నారు. తాను తృటిలో తీవ్ర గాయాల నుంచి తప్పించుకున్నానని చెప్పారు. తలకు గాయంకాకుండా తప్పించుకున్నారు అదృష్టవశాత్తు, నేను హెల్మెట్ ధరించాను వారు నా బట్టలు చించి, నా కళ్లజోడు పగలగొట్టారని తెలిపారు. ఘటనా స్థలంలో పోలీసుల ఉనికి లేదు. వారు మమ్మల్ని చంపాలనుకుంటున్నారు. చంపనివ్వండి నేను చావనైనా చస్తాను కానీ ఇక్కడ నుంచి కదలనని అన్నారు. తగిన భద్రతా ఏర్పాట్లు చేసే వరకు తాను వెళ్లబోనని తేల్చిచెప్పారు.

# సంక్షిప్తంగా..

## సోనియాగాంధీకి కంటి శస్త్రచికిత్స



**న్యూఢిల్లీ, మే 30:** కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, పార్టీ పార్లమెంటరీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ కంటికి శస్త్ర చికిత్స జరిగింది. ఈ సర్జరీ నుంచి కోలుకున్న సోనియా గాంధీ తాజాగా ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. న్యూఢిల్లీలోని తన నివాసమైన10 జన్‌పథ్‌కు చేరుకున్నారు. కొద్ది రోజులుగా సోనియా అనారోగ్యంపై చాలా ప్రచారం జరిగింది. ఆమెకు ఏమైంది అనే విషయంలో ఎలాంటి ప్రకటనా రాలేదు. ఇదే సమయంలో ఇటీవల న్యూఢిల్లీలోని గంగారాం ఆస్పత్రిలో చేరినట్లు ప్రచారం జరిగింది. ఆమె తనయుడు రాహుల్ గాంధీ కూడా సోనియా గాంధీని ఆస్పత్రిలో కలిసి వచ్చారు. అయితే, సోనియా గాంధీకి కంటి ఆపరేషన్ జరిగినట్లు తాజాగా వెల్లడైంది.

## రాజస్థాన్‌లో ఇసుక తుఫాను బీభత్సం



**జైపూర్, మే 30:** రాజస్థాన్‌లో ఇసుక తుపాను బీభత్సం సృష్టించింది. రాష్ట్రంలోని చురు, శ్రీగంగానగర్, బికనీర్, సీకర్ తదితర ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం భీకర గాలులు వణికించాయి. దట్టమైన మేఘాల రూపంలో ఇసుక ఆవరించడంతో ఒక్కసారిగా చిమ్మచీకట్లు కమ్ముకున్నాయి. అనంతరం ఆయా ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఇసుక తుపాను కారణంగా వాహనదారులు, స్థానికులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. దట్టమైన ఇసుక తుపానుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియా లో వైరల్‌గా మారాయి. అంతకుముందు జైపూర్‌లోనూ శుక్రవారం ఇదే విధమైన వాతావరణం కనిపించింది. ఇసుక తుపానుతోపాటు భీకర గాలులు వీచాయి. ధోల్‌పుర్ జిల్లాలో అత్యధికంగా 5.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

## భూతగాదాల్లో కాల్పులు - ఒకే కుటుంబంలో ఆరుగురి దారుణ హత్య

**బెంగళూరు, మే 30:** భూ వివాదం నేపథ్యం లో ఒక కుటుంబానికి చెందిన ఆరుగురు వ్యక్తులపై ప్రత్యర్థులు కాల్పులు జరిపారు. ఆ తర్వాత వారిని దారుణంగా నరికి చంపారు. ఈ సంఘటన ఆ ప్రాంతంలో కలకలం రేపింది. కర్ణాటకలోని విజయపుర జిల్లాలో ఈ సంఘటన జరిగింది. గోవిందపూర్ గ్రామానికి చెందిన నిరాలే, గోలగి కుటుంబాల మధ్య చాలా కాలంగా భూవివాదం కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో నిరాలే కుటుంబ సభ్యులపై గోలగి కుటుంబ సభ్యులు దాడి చేశారు. ఆరుగురిపై తొలుత కాల్పులు జరిపారు. ఆ తర్వాత వారందరినీ దారుణంగా నరికి చంపారు. ఈ సమాచారం తెలుస్తున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతులను చందు నిరాలే, దుండప్ప నిరాలే, శివపుత్ర నిరాలే, రాహుల్ నిరాలే, సమర్థ నిరాలే, షబ్బీర్ నదాఫ్‌గా గుర్తించారు.

## కారును ఢీకొట్టి అరకిలోమీటరు ఈడ్చుకెళ్లిన ట్రక్కు




**భువనేశ్వర్, మే 30:** ఒడిశా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో ఓ తండ్రి, కుమార్తె త్రుటిలో పెను ప్రమాదం నుంచి బయటపడ్డారు. శుక్రవారం అర్ధరాత్రి వారు ప్రయాణిస్తున్న కారును ఓ ట్రక్కు ఢీకొట్టింది. ఆపై ఓ అరకిలోమీటర్ వరకు ఈడ్చుకెళ్లింది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. భువనేశ్వర్‌లోని పలాసునీ బ్రిడ్జిపై ఈ ఘటన చోటుచేసుకుంది. తండ్రీకూతుళ్లు కారులో వంతెన దాటుతుండగా వెనుక నుంచి వచ్చిన ఒక భారీ ట్రక్కు దాన్ని బలంగా ఢీకొట్టింది. ఆ తర్వాత కూడా ట్రక్కు డ్రైవర్ తన వాహనాన్ని ఆపకుండా కారును రోడ్డుపై అరకిలోమీటర్‌కుపైగా ఈడ్చుకెళ్లాడు. దాంతో కారులో ఉన్నవారితోపాటు, రోడ్డుపై ఉన్న ప్రయాణికులు కూడా తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

# సెక్యులర్ ఓటర్లే లక్ష్యంగా ఓట్ల తొలగింపు 'సర్' ధ్యేయం

**బిజెపి విజయానికి జరిగే కుట్రలను అడ్డుకొందాం**

**వారానికొకసారి ఓటర్ల జాబితా, పార్టీ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించనున్న మంత్రులు**

**పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్**

**హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త:** సెక్యులర్ ఓటర్లను లక్ష్యంగా చేసుకొని ఓట్ల తొలగింపు కోసం 'సర్' చేపట్టారని, బూత్ లెవల్ ఏజెంట్లు ,సోషల్ సెక్యూరిటీ అసిసెట్టంట్లు అప్రమత్తంగా ఉండాలని, అదేవిధంగా బిఎల్ఒతో సమన్వయం చేసుకొంటూ ప్రతి ఓటరును చైతన్యంచేసి వారి పేరు జాబితాలో తొలగి పోకుం డా చూసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఇందిరాభవన్‌లో మీనాక్షినటరాజన్, మహేష్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో బూత్ లెవల్ ఏజెంట్లు, సోషల్ సెక్యూరిటీ అసిస్టెంట్లులతో శనివారం సమీక్ష సమా వేశాలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రతి మూడు పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా జరిగిన ఈ సమావేశాలకు ఎఐసిసి కార్య దర్శి సచిన్ సావంత్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎస్ఎస్ఏ కోఆర్డినేటర్లు, రాష్ట్ర స్థాయి ఎస్ఎస్ఏ కోఆర్డినేటర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని ఇక్కడ ఏ మాత్రం పొరపాటు జరిగినా దేశంలో ప్రజాస్వామ్యం మనుగడకు ప్రమాదం జరుగుతోందని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా సెక్యులర్ ఓటర్లను లక్ష్యంగా చేసుకుని ఓట్ల తొలగింపు ప్రక్రియ జరుగుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. పశ్చిమబెంగాల్ విధానం దేశంపై ఆచరించి బిజెపి దొడ్డిదారిన రాజ్యా ధికారంలోకి రావడాని కుట్రుల చేస్తోందని వివరించారు. పశ్చిమబెంగాల్‌లో రాష్ట్రంలో 90 లక్షలకు పైగా ఓట్లను తొలగించి, కేవలం 30 లక్షల కొత్త ఓట్లను మాత్రమే జాబితాలో చేర్చి విజయావకాశాలు బిజెపి పెంచుకొందని ఆయన గుర్తుచేశారు. పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఎన్నికల్లో బిజెపి విజయానికి ఓటర్ల తొలగింపు ప్రక్రియ కూడా ఒక కారణమని ఆరోపించారు. బిజెపి తదుపరి లక్ష్యంగా పంజాబ్, తెలంగాణ రాష్ట్రాలను ఎంచుకుందని మహేష్ కుమార్ గౌడ్ కార్యకర్తలను అప్రమత్తం చేశారు. ఈ నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై తెలంగాణ కాంగ్రెస్ ప్రత్యేక నిఘా ఉంచుతుందని తెలిపారు. ప్రతి వారం మంత్రులు తమ తమ నియోజకవర్గాల్లో పర్యటిస్తూ పార్టీ నిర్మాణం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ఓటర్ల జాబితా పరిశీలన వంటి అంశాలపై దృష్టి సారిస్తారని ఆయన వెల్లడించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బూత్ స్థాయి నుంచి పార్టీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, ఓటర్ల జాబితాలో అక్రమాలకు తావులేకుండా చర్యలు చేపట్టడం లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఈ సమీక్ష సమావేశాలను నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివచరణ్ ఒడ్డి, ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు వెంకటస్వామి, మహిళ కాంగ్రెస్ చైర్మన్ స్వర్ణ, సేవాదళ్ చైర్మన్ జితేందర్ పాల్గొన్నారు.



డిజిపి కార్యాలయంలో దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన వీల్‌చైర్ ర్యాంప్.

## డిజిపి ఆఫీసులో దివ్యాంగుల కోసం వీల్‌చైర్ ర్యాంప్ ఏర్పాటు

**హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త:** డిజిపి కార్యాలయంలో డిజిపి సహా ఇతర ఉన్నతాధికారులను కలిసేందుకు వచ్చే దివ్యాంగుల కోసం ప్రత్యే కంగా ర్యాంప్ ఏర్పాటు చేశారు. అఖిల భారత దివ్యాంగుల హక్కుల ఫోరం విజ్ఞప్తి మేరకు ఈ ర్యాంప్ ఏర్పాటు చేశారు. ఫోరం అధ్యక్షుడు కొ ల్లి నాగేశ్వరరావు ఇటీవల డిజిపి సి.వి ఆనంద్‌ను కలిసిన సమయంలో దివ్యాంగులు, ముఖ్యంగా వీల్ చైర్‌పై వచ్చే వారికోసం ర్యాంప్ ఏర్పాటు చేయాలని కోరా రు. దీనిపై స్పందించిన డిజిపి ఆనంద్ ఉన్నతాధికారులకు దీనిపై ఆదేశాలు జారీ చేశారు. డిజిపి ఆదేశాల మేరకు డిజిపి కార్యాలయంలో స్టాఫ్ లిఫ్ట్ సమీపంలో వీల్‌చైర్ ర్యాంప్‌ను ఏర్పాటు చేశారు.

## సుమన్ వ్యాఖ్యల వెనక కెసిఆర్ కుట్ర

**ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్**

**హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త:** సుమన్ వ్యాఖ్యల వెనక కెసిఆర్ కుట్ర ఉందని, ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే ప్రజా ప్రభుత్వం చూస్తూ ఊరుకోదనీ బాల్క సుమన్ అరెస్ట్ కావడానికి ఆయన మాటలే కారణమనీ ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ తెలిపారు. గాంధీభవన్ లో ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ మీడియాతో మాట్లాడుతూ మీకు కోపం ఉంటే మాపై దాడి చేయండి. సామాన్య ప్రజలు తిరిగే రైళ్లపై మీకు ఎందుకు అంత అక్కసు అని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైళ్లలో తిరిగేది ఎస్సి,ఎస్‌టి,బిసి మైనార్టీ, పేదలే. మీకు ఓట్లేయలేదని పేదలపై కోపమా? అని నిలదీశారు. అరాచక శక్తులుగా మారిన కొందరు బిఆర్ఎస్ నేతలతో శాంతి భద్రతలకు విఘాతం కలిగించడానికి ఫామ్ హౌస్ నుంచి వచ్చే డైరెక్షన్ తోనే పథకం ప్రకారం రెచ్చ గొడుతున్నారని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నేనూ నిరసన కార్యక్రమాలు చేశాను కానీ మేం ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు చేశామనీ అని వెంకట్ గుర్తుచేసుకొన్నారు. కెసిఆర్ ఒకయానికి డ్రగ్ శాఖ ఇచ్చాడు. మరొకరికి పిచ్చోడిలా వాగే శాఖ ఇచ్చాడు. సుమన్‌కి రైలు పట్టాలు కోసే శాఖ ఇచ్చాడు. బిఆర్ఎస్ పార్టీని ఎవరూ పట్టించుకోవడం లేదు. తెలంగాణలో శాంతి భద్రతలకు విఘాతం కల్పించాలని కెసిఆర్ కుట్ర చేస్తున్నారనీ ఆరోపించారు. ప్రజలు, ప్రభుత్వ ఆస్తులపై ఇంకోసారి ఎవరూ ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా బాల్క సుమన్‌ను కఠినంగా శిక్షించాలనీ అవసరమైతే, పిడి యాక్ట్ పెట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యమ సమయంలోనూ యువకులను రెచ్చగొట్టి, వారి ప్రాణాలను పణంగా పెట్టారనీ బాల్క సుమన్ అరెస్ట్‌పై బిఆర్ఎస్ నేతలు విమర్శలు చేయడం సిగ్గుచేటు అని అన్నారు. అతనేదో ప్రజల కోసం పోరాటం చేసి అరెస్ట్ ఐనట్లు ఫోజులు ఇస్తున్నారనీ దుయ్యబట్టారు. బిఆర్ఎస్ నేతల్లో రెండేళ్లకే అసహనం పెరిగిపోయిందనీ విమర్శించారు. బిఆర్ఎస్‌కు ప్రజలు, రైతులు, సింగరేణి కార్మికులు, ఇలా ఎవరి మద్దతు లేకుండా పోయిందనీ అందుకే ఫామ్ హౌస్ నుంచి ప్లాన్ చేసి, దాడులు, చేసేందుకు కుట్ర చేశారనీ బిఆర్ఎస్ నేతలు తీరు మార్చుకోకపోతే ఈసారి తెలంగాణలో ఆ పార్టీని ప్రజలు బొంద పెట్టడం ఖాయమనీ జోస్యం చెప్పారు.



ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ కోదండరాం

## ఫార్మాసిటీ జిఒ 31ని రద్దు చేయాలి

**ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ డిమాండ్**

**హైదరాబాద్ (ధర్నాచౌక్), మే 30, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ మానిఫెస్టోలో హామీ ఇచ్చిన ప్రకారం ఫార్మా సిటీ జీవో 31ని తక్షణమే రద్దు చేయాలని ఫార్మా సిటీ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్‌లు సరస్వతి కవుల, కన్నెగంటి రవి డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో అక్రమ భూసేకరణకు వ్యతి రేకంగా ఫార్మా సిటీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా యాచారం మండల ప్రజల సామూహిక ధర్నా నిర్వహించారు.

ఈ ధర్నానుద్దేశించి వారు మాట్లాడుతూ అక్రమ భూసేకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర హైకోర్టు స్టే ఇచ్చిన భూముల్లో ప్రభుత్వం తక్షణమే పనులను మానుకోవాలని డిమాండ్ చేశారు. అభయహస్తం మానిఫెస్టోలో అసైన్డ్ భూములకు శాశ్వత పట్టా హక్కులు కల్పిస్తామని, ఆన్‌లైన్‌లో తొలగించిన రైతుల పేర్లను మళ్లీ ఎక్కిస్తామని, గత ప్రభుత్వ హయాంలో అసైన్డ్ రైతులకు తక్కువ నష్టపరిహారం చెల్లించినందున తిరిగి నష్ట పరిహారం పెంచి ఇస్తామని, భూసేకరణలో భూమి కోల్పోయిన రైతులకు ఎకరానికి 120 గజాల చొప్పున ఇంటి స్థలాలు ఇస్తామంటూ చెప్పిన హామీలన్నా వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు.

గ్రీన్ ఎక్స్‌ప్రెస్ హైవే, రీజనల్‌రింగ్‌రోడ్డు పేరుతో ఫ్యూచర్ సిటీ పేరుతో రైతుల భూములను కొల్లగొట్టటం మానుకోవాలని, పర్యావరణాన్ని దెబ్బతీసే ఫార్మాసిటీ, ఫ్యూచర్‌సిటీల ప్రాజెక్టులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాకు మద్దతు తెలిపిన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ ఫార్మసిటీ భూసేకరణపై సమీక్షిస్తామని, భూసేకరణ వల్ల ఎవరికీ నష్టం కలుగకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు.

ఈ ధర్నా కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నేతలు పీవోడబ్ల్యూ సంధ్య, డాక్టర్ బాబురావు, మట్టి మనిషి పాండురంగారావు, సజయ, దళిత బహుజన ఫ్రంట్ శంకర్, ఆమాద్మీ హేమ జిల్లోజు, తెలంగాణ విఠల్, నిరుద్యోగుల జేఏసీ రెడపాక రవి, రచయిత పశునూరి మురళి, టిఆర్ఎస్ ఎం. విజయ్‌కిరణ్‌రెడ్డి, టిపిజెఏసీ ఆర్. వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కసిగా పనిచేసి రెండోసారి గెలిస్తేనే రాజకీయ భవిష్యత్

**మైనంపల్లి రోహిత్‌తో జగ్గారెడ్డి వ్యాఖ్యలు**

**హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త:** కసిగా పనిచేసి రెండో పర్యాయం ఎమ్మెల్యేగా గెలిస్తేనే రాజకీయ భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే రోహిత్‌కు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి హితవు చెప్పారు. శనివారం గాంధీ భవన్‌లో అనుకోకుండా జగ్గారెడ్డికి మైనంపల్లి హన్మంతరావు ,ఎమ్మెల్యే రోహిత్ తరసపడటంతో వారితో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మైనంపల్లి రోహిత్ ను ఉద్దేశించి జగ్గారెడ్డి మాట్లాడుతూ ఫస్ట్ టైం గెలుపు ను మర్చిపోండి, సెకండ్ టైం గెలిస్తేనే రాజకీయాల్లో నిలబడుతారు అనిచెప్పారు.. సెకండ్ టైం ఎమ్మెల్యే గా పోటీ ని ఫస్ట్ టైం ఎన్నిక గా భావించాలని అన్నారు. కసితో పనిచేయాలలనీ అప్పడే రెండడో సారి గెలిస్తే అదే పెద్ద బ్రేక్ అవుతోందనీ వివరించారు. రాజకీయాల్లో భవిష్యత్ దృష్టిలో పెట్టుకొని పనిచేయాలని జగ్గారెడ్డి సూచించారు. ఒకరోజు మా ఇంటికి రావాలని రోహిత్‌ను జగ్గారెడ్డి కోరారు.

## ఉద్యమకారుల గుర్తింపునకు 4న అఖిలపక్ష సమావేశం

**తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ కేశవరావు**



**హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం జూన్ 4న అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఉద్యమకారుల గుర్తింపు కోసం ప్రభుత్వం నియమించిన కమిటీ శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు అధ్యక్షతన సమావేశమైంది. కమిటీ సభ్యులు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డిలు ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఉద్యమకారుల గుర్తింపు కోసం విధి విధానాలు, ఉద్యమకారుల సమాచార సేకరణ అంశాలపై చర్చించారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం ప్రభుత్వం ఈ నెల 15న ఏర్పాటైన కమిటీ సచివాలయంలో మొదటి సారి శనివారం సమావేశమైంది. జూన్ 4వ తేదీన అన్ని పార్టీల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి తగు సూచనలు, సలహాలు స్వీకరించాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనాడు ఉద్యమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న వారందరిని గుర్తించి ప్రభుత్వం సముచితంగా గౌరవించడమే ప్రభుత్వ లక్ష్యమని కమిటీ చైర్మన్ కె. కేశవరావు తెలిపారు.

అమరవీరుల కుటుంబాలు, తెలంగాణ ఉద్యమం తొలి, మలి దశ లలో క్షేత్రస్థాయిలో ఉద్యమంలో పాల్గొన్న వారి వివరాలు సేకరించి పారదర్శకంగా అర్హుల జాబితా తయారీకి తగు కార్యాచరణ రూపొందించాలని అధికారులను కమిటీ ఆదేశించింది. ఉద్యమకారుల గుర్తింపు ప్రమాణాలు, జైలు శిక్షలు అనుభవించిన వారు, పలు పోలీస్ కేసుల నమోదు, ఉద్యమంలో పాల్గొన్న మేధావులు, కళాకారులు, రచయితలు, ఉద్యోగులు, జర్నలిస్టులు, అడ్వకేట్‌లు, విద్యార్థులు, ఆర్.టి.సి కార్మికులు, సింగరేణి కార్మికులు, వారందరిని గుర్తించి, సముచితంగా గౌరవించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో విశేష కృషి చేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం తరఫున తగిన గౌరవం, గుర్తింపు అందేలా సిఫార్సులు చేయాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని, సమాచార సేకరణలో ఎటువంటి విమర్శలకు తావు లేకుండా ఉద్యమంలో పాల్గొన్న వారందరిని గుర్తించి సముచితంగా గౌరవించాలని ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు.

సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్, హోం శాఖ ముఖ్యకార్యదర్శి శిఖా గోయల్, జి.ఎ.డి కార్యదర్శి రఘునందన్ రావు, జి.ఎ.డి ప్రోటోకాల్ డైరెక్టర్ హరీష్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, న్యాయ శాఖ కార్యదర్శి పాపిరెడ్డి పాల్గొన్నారు.

## త్వరలో మహిళా వర్సిటీ బైఫర్‌కేషన్ కోసం ఉత్తర్వులు!

**జీవో వెలువడిన అనంతరం ఆప్షన్ల సేకరణ**

**అనంతరం బోధన, బోధనేతర సిబ్బంది విభజన**

**హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఏర్పాటైన వీరనారీ చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయానికి సంబంధించిన సిబ్బంది బైఫర్‌కేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించిన జీవోను ప్రభుత్వం వారం, పది రోజుల్లో చేసే అవకాశం ఉన్నట్టు తెలిసింది. ప్రభుత్వం జీవో జారీ చేసిన అనంతరం ప్రస్తుతం మహిళా వర్సిటీలోని బోధన, బోధనేతర సిబ్బంది విభజన ప్రక్రియ పూర్తి కానుంది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం 2014 జూన్ 2న ఏర్పడిన తరువాత 2022లో రాష్ట్రంలో ప్రత్యేకంగా మహిళా యూనివర్సిటీని ఏర్పాటు చేస్తూ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

మహిళా వర్సిటీలో అడ్మిషన్లు తీసుకున్నప్పటికీ 2024లో యూనివర్సిటీ సవరణ చట్టం చేసేంత వరకు మహిళా వర్సిటీని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యుజిసి) గుర్తించ లేదు. 2023 డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఆ తరువాత మహిళా వర్సిటీ ఏర్పాటుకు సంబంధించిన యూనివర్సిటీ చట్ట సవరణ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన అనంతరం యుజీసీ యూనివర్సిటీకి గుర్తింపునిచ్చింది. దీంతో 2025-26 విద్యా సంవత్సరం నుంచి వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీగా కొనసాగుతూ అడ్మిషన్లను చేపట్టింది.

మహిళా వర్సిటీ ఇప్పటికే కొనసాగుతున్న ఉస్మానియా యూనివర్సిటీలోని కోఠి మహిళా కాలేజీని యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేసింది. ఈ నేపథ్యంలో కోఠి ఉమెన్స్ కాలేజీలోని బోధన, బోధనేతర సిబ్బంది విభజనకు సంబంధించి ఓయూ, మహిళా వర్సిటీల అధికారులు రెండు దఫాలుగా సమావేశాలు నిర్వహించారు. మహిళా వర్సిటీ బైఫర్‌కేషన్ కోసం ఏర్పాటు చేసిన కమిటీ సైతం ప్రత్యేకంగా సమావేశమై నెల క్రితమే తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కమిటీ నివేదికను పరిశీలించి విభజన కోసం జీవోను జారీ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం జీవో జారీ చేసిన అనంతరం ప్రస్తుతం ఉస్మానియా వర్సిటీ పరిధిలోని కోఠి ఉమెన్స్ కాలేజీలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది తమ అంగీకారాన్ని తెలుపుతూ పత్రాలను ఓయూకి సమర్పించాల్సి ఉంటుంది. బోధన, బోధనేతర సిబ్బంది తమ ఆప్షన్లను ఇచ్చినప్పటికీ వెంటనే వారికి యూనివర్సిటీలను కేటాయిస్తారు. అయితే ప్రస్తుతం కొనసాగుతున్న కోఠి ఉమెన్స్ కాలేజీలోని బోధన, బోధనేతర సిబ్బంది తాము ఉస్మానియా యూనివర్సిటీలోనే కొనసాగుతామని చెప్పినప్పటికీ వారికి అలాంటి అనుమతిని ఇవ్వబోరని.. నిబంధనల మేరకు మరో 5 సంవత్సరాలపాటు కొత్తగా ఏర్పడిన మహిళా వర్సిటీ డైరక్ట్‌గా నియామకాలు చేపట్టే వరకు వారు అక్కడే కొనసాగాల్సి ఉంటుంది. ఒకవేళ యూనివర్సిటీ 5 సంవత్సరాల వరకు డైరక్ట్ నియామకాలను చేపట్టలేకపోతే.. ఓయూకి ఆప్షన్ ఇచ్చినప్పటికీ బోధన, బోధనేతర సిబ్బంది తప్పకుండా మహిళా వర్సిటీలోనే పనిచేయాల్సి ఉంటుందనే నిబంధనలు ఉన్నాయని ఓయూకి చెందిన సీనియర్ ప్రొఫెసర్ చెబుతున్నారు.

## రైల్వే అసిస్టెంట్ లోకోపైలట్ ఉద్యోగాలకు టి-శాట్ డిజిటల్ కంటెంట్

**జూన్ 1 నుంచి సెప్టెంబర్ వరకు ప్రసారాలు**

**హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త:** రైల్వే అసిస్టెంట్ లోకో పైలెట్ ఉద్యోగాలకు టిసాట్ డిజిటల్ కంటెంట్ ప్రసారాలను చేయనుంది. జూన్ 1 నుంచి సెప్టెంబర్ వరకు ప్రసారాలు చేపట్టనున్నట్టు టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే రిక్రూట్ మెంట్ బోర్డు త్వరలో భర్తీ చేసే అసిస్టెంట్ లోకో పైలెట్ ఉద్యోగాల కోసం ప్రిపేర్ అయ్యే అభ్యర్థులకు టి-సాట్ డిజిటిల్ కంటెంట్ అందించనుందని సీఈవో తెలిపారు. రైల్వే రిక్రూట్ మెంట్ బోర్డు 11,127 అసిస్టెంట్ లోకో పైలెట్ ఉద్యోగాల భర్తీ కోసం ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేసిందని వాటిలో సికింద్రాబాద్, ఈస్ట్ కోస్టు రైల్వే డివిజన్ పరిధిలో 1,420 పోస్టులు భర్తీ చేయనున్నట్టు రైల్వే శాఖ స్పష్టం చేసిందన్నారు. మన రాష్ట్ర యువతకు ఉద్యోగాలు సాధించేందుకు వీలుగా పరీక్షకు సంబంధించిన కంటెంట్‌ను డిజిటల్ లెసన్స్ ద్వారా అందించాలని నిర్ణయించామన్నారు. మాథమెటిక్స్, మెంటల్ ఎబిలిటీ అండ్ జనరల్ సైన్స్‌కు సంబంధించిన సబ్జెక్టులలో సుమారు 300 గంటల కంటెంట్ రోజుకు రెండు గంటల చొప్పున ప్రసారం చేయాలని నిర్ణయించామన్నారు.

టి-సాట్ విద్య ఛానల్‌లో ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు ప్రసారమవుతాయన్నారు. అవే పాఠ్యాంశాలు నిపుణ ఛానల్‌లో రాత్రి 9 గంటల నుండి 11 గంటల వరకు రెండు గంటల పాటు ప్రసారమవుతాయని వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. పదవ తరగతి, ఐటిఐ తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి 18 నుండి 30 సంవత్సరాల వయస్సు కలిగి పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు డిజిటల్ కంటెంట్ ఉపయోగపడుతుందన్నారు. రైల్వే అసిస్టెంట్ లోకో పైలట్ ఉద్యోగాలకు అక్టోబర్‌లో నిర్వహించే పరీక్ష కోసం సెప్టెంబర్ వరకు డిజిటల్ లెసన్స్ ప్రసారమవుతాయని వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.

## ఎబోలాను ఎదుర్కోవడానికి గాంధీలో ఏర్పాట్లు పూర్తి

**ప్రత్యేక బెడ్‌లు, వైద్య పరికాలు సిద్ధం**

**హైదరాబాద్ (సికిందరాబాద్), మే 30, ప్రభాతవార్త:** కొన్ని రోజులుగా విస్తరిస్తూ ప్రజలను భయపెడుతున్న ఎబోలా వైరస్‌ను ముప్పును తప్పించుకునేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తోంది. ఏర్పాట్లలో తలమునకలై ఉంది. వైరస్ వల్ల ప్రజలకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా అన్ని ఏర్పాట్లు జరుపుతోంది. రాష్ట్రంలో పెద్దాసుపత్రైన సికిందరాబాద్ గాంధీ ఆస్పత్రిని రాష్ట్ర నోడల్ కేంద్రంగా సిద్ధం చేసింది. గాంధీ ఆస్పత్రి 7వ అంతస్తులో ఎనిమిది ప్రత్యేక గదులతో 25 బెడ్లతో కూడిన 10 ఐసోలేషన్, 15 క్వారంటైన్ వార్డును అధికారులు సిద్ధం చేశారు. ఎబోలా వైరస్ సోకినవారికి వైద్య సేవలందించే సిబ్బంది కోసం పీపీఈ కిట్లను రెడీ చేశారు. ఇప్పటి వరకూ దేశంలో ఎక్కడా కూడా ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. కాని సోకే అవకాశాలను కాదనలేమని వైద్యులు చెబుతున్నారు. వైరస్ దేశంలోకి రాకుండానే నివారించడానికి అనేక రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. మధ్య ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే ప్రయా ణికులకు శంషాబాద్ విమానా శ్రయంలో స్క్రీనింగ్ టెస్టులు నిర్వహిస్తు న్నట్లు సమాచారం. ఈ వైరస్ వ్యాప్తికి ప్రధాన కారణమైన వాటి విషయంలో వైద్యులు ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాగే వైరస్ సోకినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్త లను కూడా అవగాహన కల్పిస్తున్నారు. తీవ్రమైన జ్వరం, డయేరియా, గొంతునొప్పి, అంతర్గత రక్తస్రావం వంటి లక్షణాలు కలిగి ఉంటా యని వివరిస్తున్నారు. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వారికి ఆర్టీపీసీఆర్, ఎలిషా పరీక్షలు చేసి, నమూనాలను నిర్ధారణ కోసం పుణేలోని ఎన్ఐవీ ల్యాబ్‌కు పంపనున్నారు. ఎబోలా వైరస్ సోకిన వారు కూడా 21 రోజులపాటు హోం ఐసోలేషన్‌లో ఉం డాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణి తెలిపారు.




గాంధీ ఆస్పత్రి భవనం

### సెంట్రల్ టీమ్ ఎబోలా వార్డుల సందర్శన

సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలోని ఎబోలా వార్డులను నేషనల్ సెంటర్ ఫర్ డిజీస్ కంట్రోల్ (ఎన్సీడీసీ) సెంట్రల్ కమిటీ ప్రతినిధులు సందర్శించారు. ఎబో లా వైరస్ సోకిన రోగులకు అందజేసే వైద్యం, తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి వసతులు, వైద్య సౌకర్యాలపై పలు చూచనలు కూడా చేసింది.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

## విద్య, వైద్య రంగాల అభివృద్ధికి సిఎస్ఆర్ నిధులు

**ప్రజా సంక్షేమానికి సమర్థవంతంగా వినియోగించాలి: మంత్రి దామోదర రాజనర్సింహ**

**సంగారెడ్డి బ్యూరో, మే 30, ప్రభాతవార్త:** కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ ఆర్) నిధులను ప్రజల అవసరాలకు అనుగుణంగా, పారదర్శకంగా వినియోగించి సామాజిక అభివృద్ధికి దోహదపడే విధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, దామోదర రాజనర్సింహ అధికారులను ఆదే శించారు. శనివారం కలెక్టరేట్ సమావేశమందిరంలో సంబంధిత శాఖల అధికా రులు, వివిధ పరిశ్రమలు, కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన సీఎస్ఆర్ సమీక్ష సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి జిల్లాకు ఆయా పరిశ్రమల నుండి సిఎస్ఆర్ కింద ఎన్ని నిధులు వచ్చాయి, ఎంత ఖర్చు చేశాం, ఈ సంవత్సరం ప్రతిపాదనలు గురించి ఆరా తీశారు. ఈ సందర్భం గా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో విద్య, వైద్యం, తాగునీరు, పారిశుధ్యం, మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వైద్య సంస్థల మౌలిక సదుపాయాల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులను ప్రాధాన్యతతో కేటాయించాలని సూచించారు. జిల్లాలోని పరిశ్రమలు తమ సామాజిక బాధ్యతలో భాగంగా ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకొని ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగే అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. జిల్లాలోని ఆయా అవసరాలను గుర్తించి, కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో వాష్ రూమ్స్ , కాంపౌండ్ వాల్స్ , కిచెన్ షేడ్స్, డైనింగ్ హాల్,డార్మెంటరీ , బెడ్స్, అదనపు క్లాస్‌రూమ్‌ల నిర్మాణం, ఫర్నిచర్, తాగునీటి సౌకర్యాలు, పారిశుధ్య వసతుల కల్పనకు సీఎస్ఆర్ నిధులను ప్రాధాన్యతగా వినియోగించాలని మంత్రి తెలిపారు. సీఎస్ఆర్ ప్రతిపాదనల అమలు, పురోగతిపై సంబంధిత అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టి, ప్రతిపాదిత పనులు సకాలంలో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. జిల్లాలోని పరిశ్రమలు సామాజిక అభివృద్ధిలో భాగస్వాములై ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. సీఎస్ఆర్ కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై మంత్రి వారికి పలు సూచనలు చేసారు.

## ఉద్యోగుల ఆరోగ్య పథకానికి పెన్షనర్ల వివరాలు అవసరం లేదు: ఆర్థిక శాఖ

**హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త:** ఉద్యోగుల ఆరోగ్య పథకాని (ఈహెచ్ఎస్)కి సంబంధించి రాష్ట్రంలోని పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లు తమ వివరాలను అందించాల్సిన అవసరం లేదని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్ అంతర్గత ఉత్తర్వులను జారీ చేశారు. ఈ ఆరోగ్య పథకం కోసం ఉద్యోగులు, పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లు తమ వివరాలను ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టం (ఐఎఫ్ఎంఐఎస్‌హెచ్ఆర్) పోర్టల్‌లో అప్‌లేడ్ చేయాలని దాదాపు నాలుగు రోజుల కింద ఆర్థిక శాఖ సూచించింది. అయితే కుటుంబ వివరాలను అప్‌లోడ్ చేయడంలో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్న డేటాను వినియోగించుకోవాలంటూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం కోరింది.



ధర్నాలో అభివాదం చేస్తున్న అసోసియేషన్ నాయకులు

## విద్యా శాఖలోని ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

**స్టేట్ గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్ నేతల డిమాండ్**

**హైదరాబాద్ (ముషీరాబాద్), మే 30, ప్రభాతవార్త:** విద్యాశాఖలో ఖాళీగా ఉన్న డిప్యూటి ఈఓ, ఎంఈఓ, డైట్ లెక్చరర్స్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని తెలంగాణ స్టేట్ గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రాజ గంగారెడ్డి, కోశాధికారి తుకారం, ప్రధాన కార్యదర్శి గిరిధర్‌గౌడ్‌లు డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ స్టేట్ గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2018లో ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ప్రకారం లోకల్ క్యాడర్ వ్యవస్థీకరణ చేయటం జరిగిందని, 23 సంవత్స రాలుగా ప్రభుత్వ ఉపాధ్యాయులను, పంచాయితీరాజ్ ఉపాధ్యాయులను ఏకీకృత సర్వీస్ రూల్స్ పేరుతో ఎలాంటి ప్రమోషన్స్ కల్పించకుండా తాత్సారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, గ్రేడ్ 2 హెడ్ మాస్టర్లకు ఎంఈఓలకు తదుపరి ప్రమోషన్‌లు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈధర్నాకు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం హాజరై మద్దతు తెలిపి మాట్లాడుతూ విద్యాశాఖలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ ధర్నా కార్యక్రమంకు వివిధ జిల్లాల నుంచి తరలి వచ్చిన హెడ్మాస్టర్లు, వివిధ ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.



శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

## రైతుల జీవితాల్లో ఆశించిన మార్పు కనిపించడం లేదు

### వారి సమస్యలను పరిష్కరించడంలో సర్కారు పూర్తిగా విఫలం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మార్పు పేరుతో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్ల పాలన పూర్తి చేసుకున్నా, తెలంగాణ రైతుల జీవితాల్లో ఆశించిన మార్పు కనిపించడం లేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రైతాంగం పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానంలోనూ ఎలాంటి మార్పు కనిపించడం లేదు. అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ రైతుల పట్ల తీవ్ర నిరక్ష్యంతో వ్యవహరిస్తుందన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో ప్రభుత్వం, రైస్ మిల్లర్లు, అధికారులు, దళారీల మధ్య రైతులు నలిగిపోతున్నారని, రైతు ప్రయోజనాలు పక్కనపడి వ్యవస్థ మొత్తం ఇతర ప్రయోజనాల చుట్టూ తిరుగుతుందన్నారు. బిజెపి ఎమ్మెల్యేలు, ఎంపిలు, ఎమ్మెల్సీలు రైతుల గోస – బిజెపి భరోసా యాత్ర చేపట్టే వరకు కూడా కాంగ్రెస్ మంత్రులు కార్యాలయాల్లోనే పరిమితమయ్యారని, కొనుగోలు కేంద్రాల్లో ఎదురవుతున్న సమస్యలపై ప్రభుత్వం స్పందించకుండా కేవలం ప్రకటనలకే పరిమితమైందన్నారు. ధాన్యం కొనుగోళ్లు కేంద్ర ప్రభుత్వం చేయడం లేదని ముఖ్యమంత్రి, మంత్రులు విమర్శలు చేస్తున్నారు. అయితే ధాన్యం సేకరణ కేంద్రాల నిర్వహణ, కొనుగోళ్లు, రైస్ మిల్లులకు తరలింపు వంటి బాధ్యతలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు పంపాలి. మిల్లులు బియ్యంగా మార్చి ఎఫ్‌సిఐకి అందించాలని, ప్రతి పంట సీజన్‌కు ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సమావేశమై ఉత్పత్తి అంచనాలు, కొనుగోలు పరిమాణం, నిల్వ సదుపాయాలు, వ్యయభారం తదితర అంశాలపై చర్చించి లక్ష్యాలను నిర్ణయిస్తారన్నారు. రైతుల అవసరాల కంటే కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్లు, కాంట్రాక్టులు, రియల్ ఎస్టేట్ వ్యాపారం, భూవ్యవహారాలపైనే ఎక్కువ దృష్టి పెడుతుందన్నారు. హామీలు, గ్యారంటీల అమలుపై శ్రద్ధ కనిపించడం లేదు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆ సందేశం రైతులకు చేరడం లేదు. ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సారి వైఫల్యం చెందుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది. తెలంగాణలో ఉచిత రేషన్ బియ్యం పంపిణీలో ప్రతి కిలోకు కేంద్ర ప్రభుత్వం రూ.41.73 ఖర్చు చేస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.15.69 మాత్రమే ఖర్చు చేస్తోంది. మొత్తం వ్యయంలో 72.67 శాతం కేంద్ర ప్రభుత్వం భరిస్తోంది. అయినప్పటికీ పంపిణీ కేంద్రాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫొటో లేకుండా, కేవలం ముఖ్యమంత్రి, మంత్రుల ఫొటోలతో ప్రచారం చేసుకోవడం సరైంది కాదన్నారు. పేదలకు మూడు నెలల ఉచిత రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయడం ద్వారా గోదాముల్లో స్థలం కల్పించే ప్రయత్నం చేసింది. అలాగే రవాణా వ్యయాన్ని కూడా తగ్గించిందన్నారు. రైతుల్లో అవగాహన పెంచి, నాణ్యమైన ఉత్పత్తిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

## మార్గం లేని గమ్యంలా ఏకీకృత సర్వీసులు

### లోకల్ కేడర్ గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్

**హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త:** విద్యాశాఖలో ఖాళీగా ఉన్న విద్యాధికారుల పోస్టులకు అర్హత కలిగిన ప్రభుత్వ ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇచ్చి విద్యాశాఖ అధోగతి పాలు కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని లోకల్ క్యాడర్ ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం అంది. శనివారం సంఘ కార్యాలయంలో నిర్వహించిన అత్యవసర సమావేశంలో సంఘం అధ్యక్షులు యం. వీరాచారి మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గౌరవ అధ్యక్షులు కే యాదగిరి, మహిళా సెక్రెటరీ, ఫైనాన్స్ సెక్రటరీ కే సుకన్య, అడిషనల్ సెక్రటరీ గోపాల్ దాసు పాల్గొన్నారు. దశాబ్దాలుగా ప్రభుత్వ విద్యా వ్యవస్థను నీరుగార్చే నినాదంగా ఏకీకృత సర్వీసుల వివాదం నలుగుతున్నప్పటికీ రాజ్యాంగబద్ధంగా వ్యవహరించని ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రభుత్వ ఉద్యోగుల్లో అధిక సంఖ్యలో ఉన్న ఉపాధ్యాయులను ఓటు బ్యాంకుగా చూస్తున్న ప్రభుత్వాలు రాజ్యాంగ విరుద్ధమైన ఏకీకృత సర్వీసుల నినాదాన్ని కాపాడుతూ వస్తున్నాయన్నారు. చట్ట ప్రకారం తమకు చెందని పోస్టులకు ప్రమోషన్లు కోరగా ఉన్నత న్యాయస్థానం తీర్పును ఉటంకిస్తూ ఇటీవలే పాఠశాల విద్యా డైరెక్టర్ ఇచ్చిన స్పీకింగ్ ఉత్తర్వుల ప్రకారం.. విద్యాశాఖలోని పర్యవేక్షణ పరమైన ఉద్యోగాలలో పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వడం కుదరదని నిరాకరించినప్పటికీ పంచాయతీరాజ్ ప్రధానోపాధ్యాయులు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడం దురదృష్టకరమన్నారు.

పంచాయతీ రాజ్ యాజమాన్యంలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు ధర్నా చేయడం 73వ రాజ్యాంగ సవరణ, ఆర్టికల్ 243 (జి ), 371(డి) ఆర్టికల్‌కు విరుద్ధమన్నారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం జిల్లా పరిషత్ పాఠశాలలను వెంటనే ఆయా జిల్లాల జిల్లా పరిషత్‌లకు అప్పగించాలని, ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న పంచాయతీరాజ్ ఉపాధ్యాయులను వెంటనే జిల్లా పరిషత్ పాఠశాలలకు రిపోర్టియేషన్ చేయాలని డిమాండ్ చేశారు.

విద్యాశాఖ లో పూర్తిస్థాయి పర్యవేక్షణ అధికారులు లేకపోవడం వల్ల విద్యా పరిపాలన కుంటుపడుతున్నదన్న విషయం వాస్తవమని భావిస్తే అధికారులు గతంలో రాష్ట్ర హైకోర్టు, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుల ప్రకారం న్యాయబద్ధంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు వెంటనే మండల విద్యాధికారులుగా, జిల్లా ఉప విద్యాశాఖ అధికారులుగా, డైట్ కళాశాల అధ్యాపకులుగా అర్హులైన వారికి వెంటనే ప్రమోషన్లు ఇచ్చి అన్ని శాఖల మాదిరిగానే పాఠశాల విద్యాశాఖను కూడా పటిష్టంగా నిర్వహించాలని వీరాచారి డిమాండ్ చేశారు.

# భవిష్యత్‌లో టాస్ మెమో 'మీ సేవ'తో అందుబాటులోకి!

**ఓపెన్ స్కూల్ టెన్త్‌లో 72 శాతం ఉత్తీర్ణత.. ఇంటర్‌లో 68.70 శాతం పాస్**

**జూన్ 2 నుంచి 7 వరకు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ దరఖాస్తులకు అవకాశం : పాఠశాల విద్యాడైరెక్టర్ నవీన్‌నికోలస్**

**హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ మెమోలను భవిష్యత్‌లో మీసేవా కేంద్రాల ద్వారా ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నట్టు పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. ఫలితాలను పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్ శనివారం విడుదల చేశారు. టెన్త్‌లో 72 శాతం ఉత్తీర్ణత రాగా, ఇంటర్‌లో 68.70 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. ఎప్రిల్ 20 నుంచి 27 వరకు ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన ఫలితాలను శనివారం తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ పివి శ్రీహరి, అడిషనల్ డైరెక్టర్ సోమిరెడ్డితో కలిసి పాఠశాల విద్య డైరెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్ మీడియాతో మాట్లాడుతూ.. ఓపెన్ స్కూల్ టెన్త్ ఫలితాల్లో గత యేడాది 57.60 శాతం ఉత్తీర్ణత సాధించగా.. ఈ ఏడాది 72 శాతం పాసయ్యారని తెలిపారు. అలాగే ఇంటర్‌లో గత ఏడాది 59.77 శాతం పాస్ పర్సంటేజ్ ఉండగా.. ఈ ఏడాది అదికాస్త 68.70 శాతానికి పెరిగిందన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూల్స్, మోడల్ స్కూల్స్, కేజీబీవీల్లో చదువుతున్న టెన్త్, ఇంటర్ పిల్లల్లో ఫెయిలైన వారికోసం ప్రత్యేకంగా నెలరోజులపాటు స్పెషల్ క్లాసులను నిర్వహిస్తున్నామన్నారు. వారు తిరిగి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో పాసయ్యేలాగా వారికి శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఏ విద్యార్థిని కూడా డ్రాపౌట్ కాకుండా చూస్తున్నామని డైరెక్టర్ స్పష్టం చేశారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో ఫెయిలైనప్పటికీ వారిని ఓపెన్ స్కూల్ ద్వారా కొనసాగించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఫీజు నియంత్రణ చట్టం రూపకల్పనకు సంబంధించిన డ్రాఫ్ట్ సిద్ధమైందని.. న్యాయ సలహాలు తీసుకుంటున్నట్టు తెలిపారు. తెలంగాణ విద్యా విధానం వస్తే అందులో ఉండే మార్గదర్శకాల మేరకు వ్యవహరించాల్సి ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో గత ఏడాది 1300 స్కూల్స్‌లో ప్రీప్రైమరీ క్లాసులను ప్రారంభించామని, ఈ ఏడాది మరో 2769 పాఠశాలల్లో ప్రీప్రైమరీ క్లాసులను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. రూమ్స్ అందుబాటులో ఉన్న వాటిల్లో ప్రారంభించామని.. భవిష్యత్‌లో రాష్ట్రంలో ఉన్న 12వేల గ్రామపంచాయతీల్లో ప్రీప్రైమరీ క్లాసును ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్టు నవీన్ నికోలస్ తెలిపారు. టెన్త్‌లో 36,863 మంది పరీక్షలకు హాజరు కాగా వారిలో 26,542 మంది పాసయ్యారు. పరీక్షకు హాజరైన వారిలో 72 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్మీడియట్‌లో 54,679 మంది పరీక్షలకు హాజరైతే వారిలో 37,562 మంది ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. ఇంటర్‌లో 68.70 శాతం పాసయ్యారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కి జూన్ 2 నుంచి 7 వరకు ఫీజు చెల్లించడానికి అవకాశం కల్పించినట్టు డైరెక్టర్ తెలిపారు. రీకౌంటింగ్ కోసం ఇంటర్‌లో సబ్జెక్టుకు రూ. 400, ఎస్ఎస్‌సికి రూ. 350, రీవెరిఫికేషన్ కోసం సబ్జెక్టుకి ఇంటర్‌లో రూ.1200, ఎస్ఎస్‌సిలోనూ రూ. 1200గా నిర్ణయించారు.

# చదువే ప్రపంచాన్ని మార్చే ఆయుధం

### మహిళా, శిశు సంక్షేమ మంత్రి సీతక్క



**హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త:** చదువే ప్రపంచాన్ని మార్చే శక్తివంతమైన ఆయుధమని మహిళా, శిశు సంక్షేమ మంత్రి సీతక్క అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో శనివారం మహిళా వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన స్నేహ సంఘాల మాక్ పార్లమెంట్ అమ్మకు అక్షరమాల, అంగన్వాడీ యూనిఫార్ముల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొనిన మాట్లాడుతూ ప్రపంచాన్ని, జీవితాన్ని మార్చే శక్తి చదువుతోనే సాధ్యమవుతుందనానరు. ఒకవేళ జీవితంలో అన్నీ కోల్పోయినా చదువు ఉంటే మళ్లీ నిలబడగలుగుతామని పేర్కొన్నారు. బాలికలు కార్పొరేటర్లు, మేయర్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు కావాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. స్నేహ సంఘాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా లక్ష మంది టీనేజీ బాలికలను పది వేలకు పైగా స్నేహ గ్రూపులుగా ఏర్పాటుచేసి భద్రత, ఆరోగ్యం, పోషకాహారం, విద్య, సాధికారత అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మొబైల్ ఫోన్లకు బానిసలు కాకుండా వాటిని విద్య, వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాల అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అంగన్వాడీ సేవలను దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దు తోంద న్నారు. గర్భ ధారణ దశ నుంచి మూడేళ్ల వయస్సు వరకు పిల్లల పోషకాహార అవసరాలను దృష్టిలో ఉంచుకుని అంగన్వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. గతంలో లేని యూనిఫారాలు, 57 రకాల విద్యా, ఆట వస్తువులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అలాగే తొలి ముద్ద కార్యక్రమం ద్వారా అల్పాహారం, పాలు, గుడ్లు, పోషకాహారం అందిస్తున్నామని వివరించారు. "ప్రైవేట్ నర్సరీల్లో అన్నం, పాలు, గుడ్లు ఇవ్వరు. కానీ ప్రభుత్వ అంగన్వాడీల్లో పిల్లల సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వ పథకాలపై సంబంధిత అధికారులు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ సభ్యురాలు సదాలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా, సీఈఓ దివ్య దేవరాజన్ తదితరులు పాల్గొన్నారు.

# అభిప్రాయభేదాలు కాంగ్రెస్‌లో సహజం, నేను ఎవరిపైనా ఫిర్యాదు చేయలేదు

### మీనాక్షినటరాజన్‌తో భేటీపై క్లారిటీ ఇచ్చిన జగ్గారెడ్డి

**హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త:** కాంగ్రెస్‌లో అభిప్రాయ భేదాలు ఉండటం అసాధారణం కాదని ఐతే తాను తెలంగాణ వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్‌కు ఎవరిపై ఫిర్యాదు చేయలేదని ఫిర్యాదు చేసే మనస్తత్వం తనది కాదని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తెలిపారు. తెలంగాణ వ్యవహారాల ఎఐసిసి ఇంచార్జీ మీనాక్షి నటరాజన్‌తో సమావేశం కావడం అనవసర రాజకీయ అర్థాలు తీయవద్దని జగ్గారెడ్డి కోరారు. మీనాక్షి నటరాజన్‌తో జగ్గారెడ్డిదాదాపు 6,7 నెలల తర్వాత ఎఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌ను కలిశాననీ తెలిపారు. నేను స్వయంగా ఫోన్ చేసి అపాయింట్‌మెంట్ కోరగా, ఆమె సమయం ఇచ్చారు. దాదాపు 10 నిమిషాల పాటు మాత్రమే భేటీ జరిగిందనీ ఆయన తెలిపారు. ఈ సమావేశానికి ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదని స్పష్టం చేశారు. మీడియాలో వస్తున్న ఊహాగానాలకు ఎలాంటి ఆధారం లేదు. ఏదైనా నిర్ణయం తీసుకోవడం కోసం లేదా ఫిర్యాదులు చేయడం కోసం నేను వెళ్లలేదనీ ఆయన చెప్పారు. పార్టీ సీనియర్ నాయకుడిగా ఇన్‌చార్జ్‌ను మర్యాదపూర్వకంగా కలవాలనే ఉద్దేశంతో వెళ్లాను అని వివరించారు. గ్రామ స్థాయి నుంచి హైదరాబాద్ వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలందరినీ ఒక టీమ్‌గా సమన్వయం చేయాల్సిన అవసరం ఉందని సూచించాను. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని చర్చించాం. తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ చేపడుతున్న కార్యక్రమాలకు అదనపు బలం చేకూర్చేలా పని చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డాను. రాబోయే 6 నెలల నుంచి ఏడాది కాలం పార్టీకి అత్యంత కీలకమని చెప్పాను.

ఎన్నికల సంవత్సరం సమీపిస్తున్నందున ఇప్పటి నుంచే మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించాను. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఎవరైనా పార్టీ వ్యవస్థలో మిస్ అయ్యుంటే వారిని గుర్తించి కలుపుకుపోవాలని కోరాను. చాలామందికి పదవులు వచ్చినప్పటికీ కొందరు కార్యకర్తలు, నాయకులు ఇంకా గుర్తింపు కోసం ఎదురుచూస్తున్నారని చెప్పాను. కార్పొరేషన్ చైర్మన్ పదవులు, ఇతర నామినేటెడ్ పోస్టులు ఇచ్చిన తర్వాత కూడా కొందరు పార్టీ కార్యకర్తలు వ్యవస్థకు దూరంగా ఉన్నారని ప్రస్తావించాను. నేను వ్యక్తులపై ఫిర్యాదులు చేసే అలవాటు లేని వ్యక్తినిఎవరిపైనా వ్యక్తిగతంగా ఫిర్యాదు చేయలేదు, ఎవరి పేర్లు కూడా ప్రస్తావించలేదు.. నాకు అవసరం లేదు అని స్పష్టం చేశారు. ఇది పూర్తిగా సాధారణ పార్టీ వ్యవహారాలపై జరిగిన చర్చ మాత్రమే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌లో విభేదాలు, చర్చలు, వాదోపవాదాలు సహజమని పేర్కొన్నాను.

కాంగ్రెస్‌లో నాయకులు ప్రజల సమస్యలు, తమ వర్గాల ప్రతినిధిత్వం కోసం మాట్లాడతారని చెప్పాను. కాంగ్రెస్ పార్టీ సంస్కృతి చర్చలు, భిన్నాభిప్రాయాలకు అవకాశం ఇవ్వడమేనని వివరించాను.

# ఎస్ఐఆర్ అనేది కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టే ప్రక్రియ

### బిజెపికి ఎలాంటి సంబంధం లేదు

### పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త:** ఎస్ఐఆర్ అనేది భారత ఎన్నికల సంఘం చేపట్టే ప్రక్రియ అని, దీనికి కేంద్ర ప్రభుత్వానికి గానీ, భారతీయ జనతా పార్టీకి గానీ ఎలాంటి సంబంధం లేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. గతంలో కూడా పలుమార్లు ఎస్ఐఆర్ నిర్వహించబడిందని, ఎస్ఐఆర్ అంటే ఓటరు జాబితా ప్రక్షాళన. 2002లో జరిగిన సమగ్ర ప్రక్షాళన తర్వాత, ప్రస్తుతం 2025లో కొన్ని రాష్ట్రాల్లో, 2026లో మరికొన్ని రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ చేపడుతున్నారు.

ఇప్పటివరకు దేశవ్యాప్తంగా సుమారు 57 కోట్ల మంది ఓటర్ల వివరాల ప్రక్షాళన పూర్తయింది. ప్రస్తుతం మరో 37 కోట్ల మంది ఓటర్ల జాబితాను పరిశీలించే ప్రక్రియ కొనసాగు తుందన్నారు.

తెలంగాణ రాష్ట్రం కూడా ఈ ప్రక్రియలో భాగమే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎస్ఐఆర్‌పై అనవసర ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. ఎన్నికల ప్రక్రియలో అన్ని రాజకీయ పార్టీలు తమ తమ బూత్ స్థాయి ప్రతినిధులను నియమిస్తాయని, ఓటరు జాబితాల పరిశీలనలో వారు కూడా భాగస్వాములవుతారు. కాబట్టి ఈ ప్రక్రియ ఏకపక్షంగా జరుగుతుందని చెప్పడం వాస్తవాలకు విరుద్ధం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌లో బిజెపి విజయాలకు ఎస్ఐఆర్ కారణమని వ్యాఖ్యానించడం సరికాదు. అదే ప్రమాణాన్ని తీసుకుంటే ఇతర రాష్ట్రాల్లో వివిధ పార్టీలు సాధించిన విజయాలను ఎలా సమర్థిస్తారు? ఇటువంటి వ్యాఖ్యలు రాజకీయ దురుద్దేశంతో చేసినవే అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఓడిపోయినప్పుడు ఎస్ఐఆర్, ఈవిఎంలు, ఎన్నికల వ్యవస్థపై ఆరోపణలు చేస్తుంది.

కానీ గెలిచినప్పుడు మాత్రం వాటి గురించి మాట్లాడదు. ఇటువంటి బ్లేమ్ గేమ్ ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ఎస్ఐఆర్ అనేది భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో జరిగే చట్టబద్ధమైన, రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ. దీనిపై సుప్రీంకోర్టు కూడా స్పష్టత ఇచ్చింది. ఈ ప్రక్రియను అడ్డుకోబోమని పేర్కొన్నది. కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారాలు, నిరాధార ఆరోపణలు మానుకుని ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు ఆపాలన్నారు.

## ఉద్యోగాలకు ఎంపికైన వారికి హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త:** తెలంగాణలో నాలుగేళ్ల క్రితం అసిస్టెంట్ ఇంజినీర్ (ఎఇ) ఉద్యోగాల్లో చేరిన వారికి హైకోర్టు షాకిస్తూ వారందరికి నోటీసులు జారీ చేసింది. 2022లో ఇచ్చిన నోటిఫికేషన్ ద్వారా ఇంజినీర్లుగా ఉద్యోగాలకు బీటెక్, బీఈ అభ్యర్థుల్ని ఎంపిక చేయడంపై హైకోర్టులు పిటిషన్ దాఖలైంది. ఈ అంశంపై పలువురు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె శరత్ విచారణ జరిపారు. 2022 నోటిఫికేషన్‌కు సంబంధించి మొత్తం 787 తాత్కాలికంగా ఎంపికయ్యారని పిటిషనర్ల తరఫు లాయర్ కోర్టుకు వివరించారు. ఉద్యోగాల భర్తీలో 173 మందికి నిర్దేశించిన డిప్లొమా ఇన్ ఇంజినీరింగ్ అర్హత ఉందన్నారు. మిగిలిన 614 మంది కనీస అర్హత లేకుండా 6 ఇంజినీరింగ్ శాఖల్లో ఉన్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వివిధ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌లలో భర్తీ చేయగా, ఈ ఉద్యోగాలకు ఎంపికైన అసిస్టెంట్ ఇంజినీరు, మున్సిపల్ ఏఈ, టెక్నికల్ ఆఫీసర్, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్‌లు కనీస అర్హత అయిన డిప్లొమా ఇన్ ఇంజినీరింగ్ లేకుండా బీటెక్, బీఈ డిగ్రీలు లేవన్నారు. అయితే హైకోర్టు ఇచ్చే ఉత్తర్వులు 614 మందికి వర్తింపజేయాల్సి ఉందన్నారు. ఇప్పటికే వీరందరి ఎంపిక పూర్తయింది.

ఈ కేసులో కోర్టు ఇచ్చే ఉత్తర్వులు ఎంపికైన అభ్యర్థులపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో వారి వాదనలు వినకుండా ఉత్తర్వులు ఇవ్వలేమని అని న్యాయమూర్తి చెప్పారు. అయితే 65 మందిని ప్రతివాదులుగా చేర్చడానికి అనుమతించారు. ఈ మేరకు 614 మంది తరఫున ఆయా శాఖల్లో ఉన్న 65 మందికి తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీచేసింది. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను జూన్ 25కు వాయిదా వేశారు.




## సిబిఎస్ఇ పోర్టల్‌పై సైబర్ దాడి!

**న్యూఢిల్లీ, మే 30:** సిబిఎస్ఇ రీవాల్యుయేషన్ పోర్టల్ పేమెంట్ సిస్టమ్‌పై సైబర్ దాడి జరిగినట్లు తెలుస్తోంది. దాదాపు 50 మంది విద్యార్థులు పోర్టల్‌లోకి అనధికారికంగా లాగిన్ అయినట్లు సమాచారం. ఈ మేరకు హ్యాకింగ్ గురించి ప్రభుత్వ వర్గాలు మీడియాకు వెల్లడించాయి. సిబిఎస్ఇ 12వ తరగతిలో కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ పద్ధతి కారణంగా తమ సమాధాన పత్రాలు తారుమారయ్యారంటూ కొందరు విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన బోర్డు విద్యార్థులకు జవాబు పత్రాల స్కానింగ్ కాపీలను అందిస్తామని, వాటిని సరిచూసుకుని రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. ఈ రీవాల్యుయేషన్ కోసం చెల్లించాల్సిన పేమెంట్ పోర్టల్‌పైనే తాజాగా సైబర్ దాడి జరిగిందని అధికార వర్గాలు వెల్లడించాయి. దీంతో చెల్లింపుల్లో హెచ్చుతగ్గులు కనిపించినట్లు తెలిపాయి. ఒక్కో విద్యార్థికి చెల్లించాల్సిన మొత్తం సొమ్ము నుంచి దాదాపు రూ.68 వేల మధ్య వేర్వేరుగా చూపిస్తోందని పేర్కొన్నాయి. అయితే హెచ్‌డిఎఫ్‌సి చెల్లింపులకు సంబంధించి గేట్‌వేలో మాత్రమే ఈ సమస్యలు ఎదురైనట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ సైబర్ దాడిపై అధికారులు అప్రమత్తమయ్యారు. ఐఐటి మద్రాస్, ఐఐటి కాన్పూర్‌కు చెందిన సాంకేతిక నిపుణులు రంగంలోకి దిగి సమస్యను పరిష్కరిస్తున్నారు. ఒఎస్ఎం పద్ధతి నేపథ్యంలో తమ జవాబు పత్రాలు మారిపోయాయని సిబిఎస్ఇకి పలువురు విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వచ్చిన సంగతి తెలిసిందే. మొత్తం 20 జవాబుపత్రాలు తారుమారైనట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఆయా విద్యార్థులను సంప్రదించి వారికి సరైన జవాబు పత్రాలు కూడా అందించినట్లు తెలిపాయి. కాగా 98 లక్షలకు పైగా జవాబు పత్రాలకు సంబంధించి దాదాపు 40 కోట్ల పేజీలను ఒఎస్ఎం పద్ధతి ద్వారా తాము స్కాన్ చేశామని పేర్కొన్నాయి. అందులో 68 వేల పత్రాల్లో నాణ్యత సమస్యలు తలెత్తడంతో వాటిని రీస్కాన్ చేసినట్లు వెల్లడించాయి.

## ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోన్న ప్రభుత్వం

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు

**హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త:** కాంగ్రెస్ నాయకులు ముందుగా రైతుల వద్దకు వెళ్లి వారి గోసలు, సమస్యలు ఏమిటో తెలుసుకోవాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. కాంగ్రెస్ నాయకులు జిల్లాల బాట పడుతున్నామని చెబుతున్నారు. అయితే వారు చేసిన తప్పిదాలు, నిరక్ష్యానికి సమాధానం చెప్పకుండా ఏ బాట పట్టినా అది చివరకు అవినీతి బాటగానే మిగిలిపోతుందని, ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం ముందుగా కేంద్ర ప్రభుత్వానికి ఇండెంట్ పంపించాలన్నారు. తాము ఎంత ధాన్యం సేకరించనున్నామో, దానికి ఎంత రీయింబర్స్‌మెంట్ అవసరమో తెలియజేయడం విధి విధానాల్లో భాగం అన్నారు. సాధారణంగా పంట కోతకు ముందే కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులు పంట ఉత్పత్తిపై అంచనాలు రూపొందించి కేంద్రానికి ఇండెంట్ పంపిస్తారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రక్రియను నిరక్ష్యం చేసిందని, చివరి వరకు సరైన అంచనాలు రూపొందించకపోవడమే కాకుండా, కేంద్రానికి ఇండెంట్ కూడా సకాలంలో పంపలేదన్నారు. వాస్తవానికి మార్చి 23 నుంచే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కావాల్సి ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 25 నుంచి మాత్రమే కొనుగోళ్లు ప్రారంభించిందని, ఈ జాప్యం కారణంగా లారీల కొరత, గన్నీ బ్యాగుల సరఫరాలో లోపాలు ఏర్పడ్డాయి. అకాల వర్షాల సమయంలో రైతులు ఐకేపీ కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి వేచి ఉండాల్సి వచ్చిందని, సరైన ఏర్పాట్లు లేకపోవడంతో వర్షాలకు ధాన్యం తడిసి రైతులు తీవ్రంగా నష్టపోయారని, ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా రీయింబర్స్ చేస్తుందన్నారు. కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత. తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడంలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు కేంద్రంపై నెపం నెట్టడం సరికాదన్నారు.

## ఇరువర్గాల మధ్య కీలక ఒప్పందం

## పెద్ది సినిమాకు లైన్‌క్లియర్

## మెగాస్టార్ పెద్దన్న పాత్రతో చిత్ర పరిశ్రమకు ఊరట

# నిర్మాతలు, ఎగ్జిబిటర్ల వివాదానికి తెర

**హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త:** టాలీవుడ్‌లో గత కొన్ని రోజులుగా చిత్ర నిర్మాతలు (ప్రొడ్యూసర్స్), థియేటర్ల యాజమాన్యాల (ఎగ్జిబిటర్లు) మధ్య నడుస్తున్న పర్సంటేజీ వివాదానికి ఎట్టకేలకు శుభం కార్డు పడింది. చిత్ర పరిశ్రమలో మరోసారి పెద్దన్న పాత్ర పోషించిన మెగాస్టార్ చిరంజీవి రంగంలోకి దిగి, ఇరు వర్గాలకు నచ్చజెప్పడంతో ఈ వివాదం సద్దుమణిగింది. మెగాస్టార్ చొరవతో తెలంగాణ ఎగ్జిబిటర్లు తమ పట్టును వీడి వెనక్కి తగ్గారు. దీంతో రామచరణ్ హీరోగా నటిస్తున్న పెద్ది సినిమా విడుదలకు మార్గం సుగమమైంది. కాగా నిర్మాతలకు, థియేటర్ల యాజమాన్యాలకు మధ్య సినిమా వసూళ్ల షేరింగ్ (పర్సంటేజ్) విషయంలో గత కొన్ని రోజులుగా తీవ్రమైన విభేదాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలోనే తెలంగాణ ఎగ్జిబిటర్ల అసోసియేషన్ ప్రతినిధులు ఒక కీలక నిర్ణయానికి వచ్చారు. జూన్ 30 తర్వాత విడుదలయ్యే అన్ని సినిమాలను కేవలం పర్సంటేజీ పద్ధతిలోనే ప్రదర్శించాలని, పాత రెంటల్ విధానాన్ని పక్కన పెట్టనున్నట్లు ప్రకటించారు. ఇదే విషయాన్ని వివరిస్తూ ఎగ్జిబిటర్ల అసోసియేషన్ ప్రతినిధులు తాజాగా మెగాస్టార్ చిరంజీవిని కలిశారు.

దీంతో నిర్మాతలను, థియేటర్ల యాజమాన్యాలను సమన్వయం చేస్తూ మెగాస్టార్ చిరంజీవి వరుసగా రెండు రోజుల పాటు సుదీర్ఘ భేటీలు నిర్వహించారు. ఎగ్జిబిటర్లు చెప్పిన సమస్యలను ఓపిగ్గా విన్న చిరంజీవి, పరిశ్రమ హితాన్ని కోరి కీలక సలహా ఇచ్చారు. ప్రస్తుతం ఫిలిం చాంబర్ కమిటీ ఇచ్చిన నివేదిక, అందులోని మార్గదర్శకాల ప్రకారమే నడుచుకోవాలని ఎగ్జిబిటర్స్ అసోసియేషన్‌కు స్పష్టం చేశారు. అలాగే జూన్ 30 లోపు ఈ పర్సంటేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని ఆయన హామీ ఇచ్చారు. చిత్ర పరిశ్రమ బాగుండాలంటే ఇరు వర్గాలు కలిసికట్టుగా వెళ్లాలని, ప్రస్తుతానికి ఫిలిం చాంబర్ కమిటీ గైడ్‌లైన్స్ పాటించడం అందరికీ శ్రేయస్కరమని ఇరు వర్గాలకు నచ్చచెప్పారు. చిరంజీవి ఇచ్చిన సలహాతో ఏకీభవించిన తెలంగాణ ఎగ్జిబిటర్లు తమ పట్టుదలను వీడి, నిర్ణయాన్ని మార్చుకున్నారు.

ఈ రాజీ ఫార్ములాతో టాలీవుడ్‌లో కొన్ని కీలక ఒప్పందాలు కుదిరాయి. తాజాగా విడుదల కాబోతున్న గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటించిన పెద్ది మూవీ ప్రదర్శనను యథావిధిగా పాత పద్ధతి అయిన రెంటల్ విధానంలోనే కొనసాగించేందుకు ఎగ్జిబిటర్లు అంగీకరించారు. భవిష్యత్తులో ఏదైనా పెద్ద సినిమాకు ప్రభుత్వం టికెట్ ధరలు పెంచితే ఆ పెంచిన మొత్తంలో 7.5 వాటాను ఎగ్జిబిటర్లకు అదనంగా చెల్లించేలా ఇరు వర్గాల మధ్య ఒప్పందం కుదిరింది.

**చిరంజీవి మాటకు కట్టుబడి ఉంటాం: తెలంగాణ ఫిలిం చాంబర్**

చిరంజీవితో భేటీ అనంతరం తెలంగాణ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ శ్రీధర్ మీడియాతో మాట్లాడుతూ ఇరువర్గాల మధ్య జరిగిన ఒప్పందం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. చిరంజీవి పెద్దన్నగా మా సమస్యలను విన్నారని, వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆయన మాటకు మేము కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. పెద్ద సినిమాలకు టికెట్ రేటు పెంచినప్పుడు ఆ పెరిగిన మొత్తంలో రెంట్‌తో పాటు, తమకు 7.5 శాతం వాటా ఇస్తామన్నారని వెల్లడించారు. మెగాస్టార్ చిరంజీవి సమయస్ఫూర్తితో వ్యవహరించి, పరిశ్రమలో తలెత్తిన ఒక పెద్ద సంక్షోభాన్ని నివారించడం పట్ల అటు నిర్మాతలు, ఇటు ఎగ్జిబిటర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనితో రాబోయే భారీ చిత్రాల విడుదలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా మార్గం సుగమమైంది.

# నిజమైన ఉద్యమకారులను గుర్తిస్తాం

## జూన్ 4న ప్రత్యేక సమావేశం - గత పదేళ్ల నిరంకుశ పాలనలో ఉద్యమకారులను పట్టించుకోలేదు: ప్రొఫెసర్ కోదండరామ్




ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ కోదండరాం, చిత్రంలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కాచం సత్యనారాయణ గుప్తా తదితరులు

**చిక్కడపల్లి మే 30 ( ప్రభాతవార్త ) :** తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించిన నిజమైన ఉద్యమకారులను గుర్తించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు కమిటీని ఏర్పాటు చేసిందని ఎమ్మెల్సీ, కమిటీ సభ్యుడు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ఆయన పేర్కొన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కాచం సత్యనారాయణ గుప్తా అధ్యక్షతన ఉద్యమకారుల గుర్తింపు, సంక్షేమం అనే అంశంపై చర్చాగోష్టి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోదండరామ్‌తో పాటు కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి, పల్లె వినయ్, గంధం రాములు, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ నిరంకుశ పాలనలో ఉద్యమకారులను పూర్తిగా విస్మరించారని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం ఉద్యమకారుల సంక్షేమానికి పటిష్ట చర్యలు తీసుకుంటోందని, అందులో భాగంగానే అందరికీ అందుబాటులో ఉండేలా ఉద్యమకారుల కమిటీ కార్యాలయాన్ని అమర జ్యోతి చిహ్నం వద్దనే కార్యాలయం ఏర్పాటు చేయడం జరిగింది అని అన్నారు. కమిటీ సభ్యులు రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి మాట్లాడుతూ... అర్హులైన ఉద్యమకారులను గుర్తించి, వారికి న్యాయం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జూన్ 4వ తేదీన దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసిందని,

ఆ సమావేశంలో ఉద్యమకారుల నుంచి నేరుగా అభిప్రాయాలను సేకరించి తగిన నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడించారు. సంఘం అధ్యక్షుడు డాక్టర్ కాచం సత్యనారాయణ గుప్తా మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాడిన ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. ప్రతి ఉద్యమకారుడికి ప్రభుత్వ గుర్తింపు కార్డుతో పాటు 250 గజాల స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు.

### మరో భారీ బాంబు పరీక్షకు

# సిద్ధమైన డీఆర్‌డీవో

**పంచకుల, మే 30:** దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మక రక్షణ రంగ సంస్థ డీఆర్‌డీవో (డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్) సంస్థ మరో భారీ బాంబు పరీక్షకు సిద్ధమైంది. హరియాణాలోని పంచకుల జిల్లాలోని టెర్మినల్ బాలిస్టిక్స్ రీసెర్చ్ ల్యాబొరేటరీ (టీబీఆర్ఎల్) అనే ల్యాబ్ పరిధిలో ఈ ప్రయోగం జరగనుంది. ఇది బాంబులు, ఆయుధాలు తయారు చేసి పరీక్షించే ప్రత్యేక కేంద్రం. ఇక్కడ ఆదివారం ఒక అధునాతన, భారీ బాంబును డీఆర్‌డీవో ప్రయోగించనుంది. ఇందుకోసం స్థానికులకు డీఆర్‌డీవో కీలక హెచ్చరిక జారీ చేసింది. స్థానిక ప్రజలెవరూ బాంబు ప్రయోగం సమయంలో ఇండ్లలోంచి బయటకు రావొద్దని సూచించింది. ముందు జాగ్రత్త చర్యగా ఈ ల్యాబ్‌కు సమీప గ్రామల్లోని ప్రజలంతా ఇండ్లలోనే ఉండాలని సూచించింది. ప్రయోగం జరిగే సమయంలో బయట ఉండకపోవడమే మంచిదని సూచించింది. ఇదే సమయంలో ఈ బాంబు ప్రయోగం గురించి అతిగా ఆందోళన చెందాల్సిన అవసరం కూడా లేదని చెప్పింది. ఇది సాధారణ పరీక్షల్లో భాగమే అని, ప్రజలు భయాందోళనకు గురి కావాల్సిన పని లేదని సూచించింది. దీనిపై జరిగే దుష్ప్రచారాల్ని నమ్మొద్దని కూడా స్పష్టం చేసింది. డీఆర్‌డీవో జారీ చేసే జాగ్రత్త చర్యలు పాటిస్తే మేలని చెప్పింది. ఇప్పుడు చేపట్టబోయేది భారీ బాంబు పరీక్ష. పేలుడు తర్వాత దీని ప్రభావం గాలిలో 1.5 కిలోమీటర్ల వరకు ఉంటుందని, దీన్ని డేంజర్ జోన్‌గా పిలుస్తారని వెల్లడించింది. ప్రజల సంరక్షణార్థం ఇక్కడికి స్థానికులను, సందర్శకులను అనుమతించడం లేదన్నారు. పూర్తి జాగ్రత్తలు, ప్రోటోకాల్ మధ్య ఈ పరీక్ష నిర్వహించనున్నారు. స్థానికులకు హాని కలగకుండా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ కూడా పరిస్థితిని పర్యవేక్షించనుంది.



ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న కేటీఆర్

# బడుగు బలహీన వర్గాలకు కాంట్రాక్టులు దక్కేవరకు పోరాడుతాం

### కాంట్రాక్టుల్లో రిజర్వేషన్లు ఇస్తామని దగా చేసిన కాంగ్రెస్

### ఎస్సీ ఎస్టీ బిసీ మైనారిటీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ మహాధర్నాలో ప్రసంగిస్తున్న కెటిఆర్

**ధర్నాచౌక్, మే 30, ప్రభాతవార్త:** చిన్న కాంట్రాక్టర్లను రోడ్లపైకి తెచ్చిన జీవో నెంబర్ 17ను రద్దు చేసి, బడుగు బలహీన వర్గాలకు కాంట్రాక్టులు దక్కేవరకు పోరాడుదామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి.ఆర్. పిలుపునిచ్చారు. శనివారం ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (జేఏసీ) ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిధిగా హాజరై కేటీఆర్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు 13 డిక్లరేషన్లు, 6 గ్యారంటీలు, 420 హామీలతో మాయమాటలు చెప్పి, గద్దెనెక్కిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలను నట్టేట ముంచిందని ధ్వజమెత్తారు. కాంట్రాక్టుల్లో రిజర్వేషన్లు ఇస్తామని దగా చేసిన కాంగ్రెస్‌ను బొంద పెట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నెంబర్ 17ను తీసుకువచ్చి, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ కాంట్రాక్టర్లను దోడ్లపైకి తెచ్చి, అన్ని టెండర్లు పెద్ద కార్పోరేట్ సంస్థలకు కట్టబెట్టే కుట్రలకు పాల్పడుతోందని మండిపడ్డారు. ఈరోజు రాష్ట్రంలో కాంట్రాక్టులు కేవలం ఇద్దరికే దక్కుతున్నాయని, ఒకరు రేవంత్‌రెడ్డి బామ్మర్ది, మరొకరు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కొడుకు అని, వారి ఇద్దరికే అన్ని కాంట్రాక్టులు ఇస్తున్నారని ఆరోపించారు. చిన్న కాంట్రాక్టర్లకు విడుదల చేసిన నిధులు మరియు చేసిన అప్పులపై శ్వేతపత్రం విడుదల చేసే దమ్ము రేవంత్ సర్కార్‌కు ఉందా అని సవాల్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేమెంట్ కోటాలో గద్దెనెక్కారని, ఆయన కేవలం రెన్యువల్ సీఎం మాత్రమేనని, ప్రతినెలా ఢిల్లీ కాంగ్రెస్ హైకమాండ్‌కు కప్పం కడుతూ, తన కుర్చీని కాపాడుకుంటున్నారని ఎద్దేవా చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చిన్న కాంట్రాక్టర్లను ఆదుకుని, గౌరవంగా నిలబెట్టారని, కేసీఆర్ అప్పులు చేసి, 1000కి పైగా గురుకులాలు కట్టారని, కార్పోరేట్ స్థాయి ఉచిత విద్యను అందించారని, కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని, జిల్లాకో మెడికల్ కాలేజి, రైతు బందు వంటి అనేక సంక్షేమ పథకాలు అమలుచేసిన కేసీఆర్‌పై అప్పులు చేశాడని అవాకులు, చెవాకులు పేలుతున్నారని మండిపడ్డారు.

# ఎడారి ప్రాంతంలో అణు మౌలిక కాంప్లెక్స్!



**బీజింగ్, మే 30:** రక్షణ రంగంలో చైనా రోజురోజుకూ మరింతగా బలపడుతోంది. కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ ఎప్పటికప్పుడు తన అమ్ములపొదిలో ఆయుధాలను పెంచుకుంటోంది. తాజాగా చైనాలోని జిన్జియాంగ్ తూర్పు ప్రాంతం, గాన్సుప్రావిన్స్‌లోని ఎడారి ప్రాంతంలో చైనా భారీ ఎత్తున సైనికమౌలిక సదుపాయాలు నిర్మిస్తోంది. ఇందుకు సంబంధించిన శాటిలైట్ చిత్రాలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారాయి. వేల చదరపు కిలోమీటర్ల పరిధిలో ఈ కాంక్రీట్ ప్యాడ్ లు విస్తరించి ఉన్నాయి. వీటిని చైనాకు చెందిన రోడ్ మొబైల్ ఇంటర్ కాంటినెంటల్ బాలిస్టిక్ మిసైల్ లాంచర్లు, వైమానిక రక్షణ బ్యాటరీలు, ఎలక్ట్రిక్ వార్ ఫేర్ నోడ్స్ కోసం ఉపయోగించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇక గత ఆరేళ్ల నుంచి నిర్మిస్తున్న ఆక్టాగాన్ షేప్ సైనిక కేంద్రాల చుట్టూ ఈ మౌలిక సదుపాయాలు కేంద్రీకృతమై ఉన్నాయి. ఇవి నివాస గృహాలు, వైమానిక క్షేత్రాలు, రైల్వే లైన్లు, భారీ సైనిక వాహనాలకు వసతి కల్పించే కేంద్ర కమాండ్ సెంటర్లుగా పనిచేస్తాయి. ఈ అష్టభుజి ఆకృతిలో ఉన్న సైనిక కేంద్రాల చుట్టూ రోడ్లు, ఆర్మ్ డ్ బంకర్లు, ఆయుధ నిల్వ కేంద్రాలు, లాంచ్ సైట్లు, శాటిలైట్ డిష్ లతో కూడిన హైటెక్ మైక్రోవేవ్, స్పేస్ కమ్యూనికేషన్స్ టవర్స్ ఉన్నాయి. ఈ మౌలిక సదుపాయాల విస్తృతి.. శత్రువుల దాడి నుంచి తమను తాము రక్షించుకోవడానికి ఉద్దేశించినదని రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. చైనా తన అణ్వాయుధాల విషయంలో నో ఫస్ట్ యూజ్ అనే కఠిన సిద్ధాంతాన్ని అనుసరిస్తోంది. అంటే శత్రువులు మొదట దాడి చేసినా.. దానిని తట్టుకుని నిలబడి ఆ తర్వాత ప్రతిదాడి చేయడంపైనే చైనా వ్యూహం ఆధారపడి ఉంటుంది. ఒకవేళ అమెరికా లాంటి దేశాలు చైనా భూగర్భ క్షిపణి సైలోలపై ముందస్తు దాడికి ప్రయత్నిస్తే వాటిని రక్షించడానికి దీటుగా ప్రతిఘటించడానికి ఈ భారీ మొబైల్ లాంచ్ ప్యాడ్ లు, ఎయిర్ డిఫెన్స్ షీల్డ్ లు చైనాకు ఎంతో సాయపడతాయి. ఇక అమెరికా రక్షణ వ్యవస్థ పెంటగాన్ అంచనా ప్రకారం చైనా తన ప్రధాన సైలో ఫీల్డ్ లలో ఇప్పటికే దాదాపు 100 ఐసీబీఎంలను సిద్ధం చేసింది. 2030 నాటికి 1000 కార్యాచరణ అణు వార్ హెడ్ లను మోహరించే దిశగా చైనా ప్రయత్నాలు చేస్తోంది. తైవాన్ సార్వభౌమాధికారం, సముద్ర వివాదాలపై అమెరికా చైనా మధ్య ఘర్షణలు తీవ్రతరం అవుతున్న తరుణంలో ఈ శాటిలైట్ చిత్రాలు ఆందోళన కలిగిస్తున్నాయి.

# క్యూబాలో అధికార మార్పిడి అనివార్యం

### మాజీ అధ్యక్షుడు ఫైడెల్ క్యాస్ట్రో కుమార్తె అలీనా ఫెర్నాండెజ్

**మయామి, మే 30:** క్యూబా వీధుల్లో వేలాది మంది ప్రజలు అమెరికాకు వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహిస్తూ, తమ విప్లవ నాయకుడి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్న అమెరికా చర్యలను ఖండిస్తున్నారు. అదే సమయంలో అమెరికాలోని మయామి నగరంలో నివసిస్తున్న క్యూబా మాజీ అధ్యక్షుడు ఫిడేల్‌క్యాస్ట్రో కుమార్తె అలీసా ఫెర్నాండెజ్ భిన్న వ్యాఖ్యలుచేసారు. క్యూబా విప్లవానికి ప్రతీకగా నిలిచిన ఫిడెల్ కాస్ట్రో కుమార్తె అయిన ఆమె సాహసోపేతమైన వ్యాఖ్యలుచేసారు. క్యూబాలో అధికార మార్పిడి అనివార్యం అవుతోందని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం కమ్యూనిస్టు పాలనకు వ్యతిరేకంగా బహిరంగంగా మాట్లాడుతున్న ప్రముఖ కార్యకర్తగా ఆమె నిలుస్తున్నారు. అమెరికా ప్రభుత్వం క్యూబా మాజీ రక్షణ మంత్రి, మాజీ అధ్యక్షుడు రౌల్ కాస్ట్రోపై సంచలన అభియోగాలు మోపింది. మూడు దశాబ్దాల క్రితం రెండు పౌర విమానాలను కూల్చివేసిన ఘటనకు సంబంధించి ఆయన బాధ్యత వహించాలని అమెరికా ఆరోపిస్తోంది. ఇప్పుడు 94 ఏళ్ల వయసులో ఉన్న రౌల్ కాస్ట్రోపై చర్యలు తీసుకునేందుకు వాషింగ్టన్ సిద్ధమవుతుండటంతో క్యూబాలో తీవ్ర ఆందోళన నెలకొంది. క్యూబాపై కూడా ఇంధన సరఫరాలపై ఒత్తిడి పెరిగింది. విద్యుత్ కోతలు, ఆహార కొరత, ఆర్థిక సంక్షోభం మరింత తీవ్రమయ్యాయి. ఈ పరిస్థితుల్లో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో చేసిన వ్యాఖ్యలు ప్రపంచ దృష్టిని ఆకర్షించాయి. క్యూబాను అసమర్థ కమ్యూనిస్టులు నడుపుతున్నారని, అమెరికా తీరాలకు కేవలం 90 మైళ్ల దూరంలో విఫలమైన దేశం ఉండటం తమ జాతీయ భద్రతకు ముప్పు అని ఆయన వ్యాఖ్యానించారు. ఆ వ్యాఖ్యలను ఆశ్చర్యకరంగా సమర్థించిన వ్యక్తి అలీనా ఫెర్నాండెజ్. క్యూబా విప్లవ వారసత్వంలో పుట్టి పెరిగిన ఆమె, ఇప్పుడు అదే వ్యవస్థపై తీవ్రమైన విమర్శలు చేస్తోంది. క్యూబా పరిస్థితిని మార్చాలంటే గరిష్ట స్థాయిలో అంతర్జాతీయ ఒత్తిడి అవసరమని ఆమె భావిస్తోంది. అమెరికాలో స్థిరపడిన వేలాది మంది క్యూబన్ అమెరికన్లు తిరిగి తమ దేశానికి వెళ్లి పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉన్నారని, కానీ అందుకు ముందుగా వ్యవస్థ మారాలని ఆమె చెబుతోంది. దశాబ్దాలుగా క్యూబా తనను చిన్న దేశంగా, అమెరికాను మహా శక్తిగా చూపిస్తూ ఒక అపోహనునిర్మించుకుందని చెపుతోంది. రౌల్ కాస్ట్రోను అమెరికా సైన్యం అరెస్టు చేసే అవకాశం గురించి మాట్లాడినప్పుడు కూడా ఆమె స్పందన ఆసక్తికరంగానే ఉంది. దాదాపు 95 ఏళ్ల వయసున్న వ్యక్తిని బలవంతంగా పట్టుకురావడం వాస్తవికంగా లేదని, రాజకీయ ఒత్తిడి సృష్టించే ప్రయత్నంగానే భావిస్తున్నానని ఆమె చెప్పింది.




ప్రజల కథే-నా ఆత్మకథ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

# రాజకీయాలు సమాజం, దేశ శ్రేయస్సు కోసమే చేయాలి

### బెంగాల్ తరహాలోనే తెలంగాణలోనూ బిజెపి అధికారంలోకి రావాలి

### హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

**నస్పూర్, మే 30, ప్రభాతవార్త** రాజకీయాలు సమాజం, దేశ శ్రేయస్సు కోసం మాత్రమే చేయాలని, వ్యక్తిగత అవసరాలకు, పేరు ప్రతిష్టల కోసం చేయరాదని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లా నస్పూర్ మండల కేంద్రంలోని సింగరేణి అతిథి గృహంలో శనివారం ఆయన ప్రజల కథే - నా ఆత్మకథ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ నైతిక విలువలు, నీతి నిజాయితీ, సిద్ధాంతాల కోసం కష్టపడి పనిచేసే వారు మాత్రమే రాజకీయాల్లోకి రావాలని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం రాజకీయం కమిషన్లు, డబ్బు సంపాదించుకోవడానికి ఒక వృత్తిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి కోసం పనిచేయాలని సూచించారు. బెంగాల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ భారీ ఆధిక్యంతో అధికారంలోకి రావడం శుభపరిణామన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలోనూ ఇలాంటి ఫలితాలే రావాలని ఆకాంక్షించారు. ఇందుకు భాజపా శ్రేణులు, నాయకులు ఇప్పటి నుంచే తీవ్రంగా కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. రాజకీయ నేపథ్యం లేని సామాన్య కుటుంబం నుంచి తాను వచ్చానని, తన తల్లి ఈశ్వరమ్మ ఎంతో కష్టపడి తనను పెంచిందని బండారు దత్తాత్రేయ గుర్తు చేసుకున్నారు. ఒక సామాన్య కార్యకర్త స్థాయి నుంచి తాను ఈ స్థాయికి ఎదగడానికి ఆర్ఎస్ఎస్, బీజేపీ కార్యకర్తలే కారణమన్నారు. ఏ స్థాయిలో ఉన్నప్పటికీ ఎవరూ తమ మూలాలను మర్చిపోవద్దని హితవు పలికారు. భారతీయ జనతా పార్టీలో అతి సామాన్యుడిగా ఉన్న నరేంద్ర మోడీ అంచెలంచెలుగా ఎదిగి గుజరాత్ ముఖ్య మంత్రిగా, భారతదేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారని గుర్తు చేశారు. వికసిత్ భారత్ సాధనే లక్ష్యంగా ప్రధాని మోడీ పనిచేస్తున్నారని కొనియాడారు. తెలంగాణలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ చూస్తుంటే బాధగా ఉందని బండారు దత్తాత్రేయ ఆందోళన వ్యక్తం చేశారు. రైస్ మిల్లర్లు, రాష్ట్ర ప్రభుత్వం కుమ్మక్కై రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రైతులు పడుతున్న ఇబ్బందులను తొలగించడానికి కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ శ్రేణులు క్షేత్రస్థాయిలో రైతులకు అండగా నిలవాలని సూచించారు. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు చట్టప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని ఈ సందర్భంగా యాజమాన్యాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా బీజేపీ అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, సీనియర్ నాయకులు గోనె శ్యాంసుందర్ రావు, దుర్గం అశోక్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు రామాంజనేయులు, పార్టీ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫీజుల రీయింబర్స్‌మెంట్ పథకాన్ని యథాతథంగా అమలు చేయాలి

## అఖిలపక్ష సమావేశం



అభివాదం చేస్తున్న కత్తి వెంకటస్వామి, డాక్టర్ ర్యాగ అరుణ్‌కుమార్, గుజ్జ సత్యం, మధుసూదనాచారి, ఆర్.కృష్ణయ్య, వంశీమోహన్‌యాదవ్, నీల వెంకటేష్, నారగోని, మేకల రాములుయాదవ్ తదితరులు

**సైఫాబాద్, మే 30 ప్రభాతవార్త:** ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకాన్ని యథాతథంగా అమలు చేయకపోతే ప్రభుత్వానికి తగిన బుద్ధి చెపుతామని అఖిల పక్షాల సమావేశం హెచ్చరించింది. బిసిలు చదుకుంటే సిఎం రేవంత్‌రెడ్డి ఓర్చుకోలేక పోతున్నారని, ఈ పద్ధతిని మార్చుకోకపోతే పతనం తప్పదని సమావేశం సూచించింది. తక్షణమే జివో నెంబరు 7ను రద్దు చేసి గత 18 ఏళ్ళుగా ప్రతి ఏడాది లక్షలాది మంది విద్యార్థులకు కొనసాగుతున్న ఫీజురీయర్స్‌మెంట్ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం బేషరుతుగా అమలు చేయాలని రాజ్యసభ సభ్యుడు జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. లేని పక్షంలో సిఎం రేవంత్‌రెడ్డి నిద్రలేని రాత్రులు గడపవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఇప్పటి వరకు ఈ పథకాన్ని అనేక మంది సిఎంలు అమలు చేసి విద్యార్థులు, ప్రజల మన్నలు పొందారని, ఈ పథకాన్ని రద్దు చేసేందుకు ప్రయత్నిస్తే రాష్ట్రం రావణకాష్టగా మారుతుందని, సిఎం పదవికే ప్రమాదం వస్తుందన్నారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ బిసి సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ ర్యాగ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకంపై జరిగిన అఖిల పక్ష సమావేశంలో ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 33 నెలలు కావస్తున్నదని, ఇంత వరకు ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకానికి నిధులు కేటాయించకుండా ఈ పథకాన్ని ఎత్తివేసేందుకు సిఎం కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. మద్యం ద్వారా 50 వేల కోట్ల రూపాయలు ఆదాయం వస్తున్నదని, పేద విద్యార్థులు చదువుకోవడానికి ఏడాది 2 వేల కోట్ల రూపాయలు కేటాయించడం ఏమంత భారం కాదన్నారు. ఈ పథకం ద్వారా ప్రతి ఏడాది 14 లక్షల మంది విద్యార్థులు చదువుకుని విజ్ఞానవంతులు, చైతన్యవంతులు అవుతున్నారని కాని పేద విద్యార్థులు చదువుకోవడం సిఎంకు ఇష్టం లేదన్నారు. ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి ఈ పథకాన్ని కాపాడుకుంటామని ఆయన హెచ్చరించారు. రాష్ట్ర శాసన మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ప్రసంగిస్తూ ప్రజాస్వామ్య ముసుగులో ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకానికి నిధులు కేటాయించకపోవడం వెనుక కుట్ర దాగి ఉందని ఆరోపించారు. అలాగే బిసిలు 50, 60 కోట్లు ఖర్చు చేసి ఎన్నికల్లో నిలబడనీయకుండా చేయడం, రాజ్యాధికారానికి రానీయకుండా కుట్ర జరుగుతున్నదని ఆయన విమర్శించారు.

# తొలి విడతగా లక్ష ఇందిరమ్మ ఇళ్లు

### - మలి విడత మరో లక్ష ఇళ్ల నిర్మాణం - ఇది దొరల ప్రభుత్వం కాదు.. పేదోడి ప్రభుత్వం:మంత్రి పొంగులేటి



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి, చిత్రంలో మంత్రులు అజారుద్దీన్, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు

**జూబ్లీహిల్స్, మే 30, ప్రభాతవార్త:** పట్టణ పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా వారు నివసించే ప్రాంతాల పరిధిలోనే అధునాతనమైన ఇందిరమ్మ ఇళ్లను కట్టిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామినాచ్చారు. త్వరలో క్యూర్ పరిధిలో తొలివిడతగా మంజూరు చేసిన లక్ష ఇళ్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయడమేగాక ఏడాది తిరిగిలోగా వాటి నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లో నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సముదాయానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వల్లాల నవీన్ యాదవ్, టిపిసిసి కార్యదర్శి విజయారెడ్డిలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ బీఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలు ఒకచోట, వారికి అందించే ఇళ్లు 3040 కిలోమీటర్ల అవతల ఉన్నాయన్నారు. తాము అలా చేయబోమని , ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్ గా తీసుకొని ఏ నియోజకవర్గ ప్రజలకు ఆ నియోజకవర్గంలోనే ఇళ్లు నిర్మిస్తామని ఇది పేదలకు పెద్దన్న , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కానుకగా అందిస్తామన్నారు. రాష్ట్రంలో పేదవాని గుమ్మం వద్దకే ప్రజా ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామన్నారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ , సర్వే తదితర శాఖలు ఒకే చోట అందుబాటులోకి తెచ్చేలా ఈ సమీకృత భవనాల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. తమ ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలలో భాగంగా మూడు కార్పొరేషన్ల పరిధిలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటు రంగానికి ధీటుగా కార్పొరేట్ తరహాలో అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. అంతేగాక ప్రభుత్వానిపై ఈ నిధుల భారం పడకుండా రియల్ ఎస్టేట్ నిర్మాణరంగంలో ప్రసిద్ధమైన సంస్థలకు నిర్మించే బాధ్యత అప్పగిస్తున్నామన్నారు.మరి కొద్ది నెలల్లో ఇక్కడ ఫినిక్స్ సంస్థ 30వేల చదరపు అడుగుల్లో ఈ భవనాన్ని పూర్తి చేసి ఇస్తుందని వెల్లడించారు. బంజారాహిల్స్ సమీకృత భవనంలో ఎస్.ఆర్. నగర్, బంజారాహిల్స్, గోల్కొండ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు , డిఐజి కార్యాలయం, రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ గోల్కొండ కార్యాలయాలు వస్తాయని వీటివలన ఈ ప్రాంత ప్రజలకు మరిన్ని ఉద్యోగ, వ్యాపార సౌకర్యాలు కలుగుతాయన్నారు. వందలాది సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో నమాజ్‌చేసుకుంటున్న ముస్లిం సోదరులకు ఏటా రెండు సార్లు నమాజు కార్యక్రమం నిర్వహించుకునేలా అధికారులను ఆదేశించామని ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# యువతిపై లైంగిక దాడి.. వీడియోలతో బ్లాక్‌మెయిల్

### - డబ్బులు ఇవ్వాలని వేధింపులు - నిందితుడి అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

**మేడ్చల్, మే 30. ప్రభాతవార్త :** యువతిపై లైంగిక దాడికి పాల్పడటమే కాకుండా నగ్న విడియోలతో బ్లాక్‌మేయిల్ చేస్తూ డబ్బులు కావాలని బెదిరింపులకు పాల్పడి వేదిస్తున్న ఓ యువకుడిని మేడ్చల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మెదక్ జిల్లా తూప్రాన్‌కు చెందిన సాధనాల సంతోష్ కుమార్ (20) మేడ్చల్ సమీపంలోని కండ్లకోయలో గల ఓ కళాశాలలో ఫార్మసీ చదువుతున్నాడు. అతను సహ విద్యార్థినీతో స్నేహం పెంచుకుని ప్రేమ, పెళ్లి పేరుతో దగ్గరై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఇలా పలుమార్లు లైంగిక వేదింపులకు పాల్పడడమే కాకుండా, విడియో కాల్ సమయంలో నగ్న విడియోలు తీసి వాటి ద్వారా తర్వాత బ్లాక్‌మేయిల్‌కు దిగాడు. అంతే కాకుండా తన వద్ద ఉన్న వీడియోలు, ఫోటోలను బయటపెడతానంటూ బాధితురాలిని బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. డబ్బులు ఇవ్వకపోతే వీడియోలను సోషల్ మీడియా వేదికల్లో ప్రచారం చేస్తానని హెచ్చరిస్తూ పలుమార్లు వేధించినట్లు తెలిపారు. బాధితురాలిని మరింత భయాందోళనలకు గురిచేసేందుకు, ఆమె కుటుంబ సభ్యులకూ ఫోటోలను పంపిస్తాని బెదిరించి ఈ క్రమంలో బాధితురాలి సోదరునికి కూడా వీడియోలు పంపినట్లు సమాచారం. దీంతో తీవ్ర మానసిక వేదనకు గురై ఈ నెల 28న బాధితురాలు జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరగడంతో అక్కడి పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును మేడ్చల్ పోలీసులకు బదిలీ చేశారు. అనంతరం మేడ్చల్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి సీఐ సత్యనారాయణ పర్యవేక్షణలో దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని ఈ నెల 29న అదుపులోకి తీసుకుని అతను ఉపయోగించిన ఒపో మొబైల్ ఫోన్‌తో పాటు రెండు ట్యాబ్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిలోని సమాచారాన్ని విశ్లేషిస్తూ కేసుకు సంబంధించిన కీలక ఆధారాలను సేకరిస్తున్నారు. బాధితురాలి వాగ్మూలాన్ని మహిళా ఎస్ఐ తీసుకునానరు. అనంతరం ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

# మహిళతో అసభ్య ప్రవర్తన తాగుబోతులకు వారం రోజుల జైలు శిక్ష

**హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త:** భర్తతో కలిసి బైక్‌పై వెళుతున్న ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించి, వెకిలి చేష్టలకు దిగిన ఐదుగురు తాగుబోతులకు నాంపల్లి మనోరంజన్ కోర్టు శుక్రవారం నాడు వారం రోజుల జైలు శిక్ష విధించింది. వివరాలు ఇలావున్నాయి. ఈ నెల 27వ తేదీన సాయంత్రం ఆరున్నర గంటల సమయంలో నిజాం కాలేజి వద్ద ఓ మహిళ తన భర్తతో కలిసి బైక్‌పై వెళుతుండగా అదే సమయంలో అక్కడే మద్యం మత్తులో వున్న నేపాల్‌కు చెందిన సునీల్ (23) ఉమేష్ (22) లక్ష్మణ్ (23), పురుషోత్తం (22) రాం (23)లు అసభ్యంగా ప్రవర్తించి వెకి లి చేష్టలకు దిగారు. దీనిపై బాధిత మహిళ ఆమె భర్త కేకలు వేయగా స్థానికులు గమనించి ఐదుగురిని పారిపోతుంటే వెంబడించి పట్టుకున్నారు . అనంతరం దీనిపై బాధిత మహిళ తన భర్తతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేయగా అబిడ్స్ పోలీసులు వెంటనే స్పందించి ఐదుగురు మందు బాబులను అరెస్టు చేసి, వారిపై ఈపెట్టి కేసు నమోదు చేశారు. నేపాల్‌కు చెందిన వీరు కొంతకాలంగా హైదరాబాద్‌లో వుంటూ చిన్నా చితక ప నులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని పోలీసుల విచారణలో తేలింది. కాగా నిందితులను అబిడ్స్ పోలీసులు నాంపల్లి మనోరంజన్ కోర్టు లో హాజరు పరిచారు.

# రుచి మామిడితో రుచులు

మామిడిని మటన్‌తో మిక్స్‌చేసి మజారుచులను . రొయ్యలతో కలిపి వండి అదిరిందిరయో అనిపిస్తారు. ఇలా ఒక్కటికాదు..జిహ్వకు పనిచేపే రుచులు మేళాలే జరుపుకొంటారు అందులో ఇవీ కొన్ని....

## మటన్ కర్రీ



**కావాల్సినవి :** మామిడికాయ-ఒకటి, ఎముకతీసివేసి మటన్-అరకేజీ, ఆమ్‌చూర్‌పొడి-టీస్పూన్, పెరుగు-ముప్పావుకప్పు, పసుపు- టీస్పూన్, నూనె-నాలుగు టేబుల్ స్పూన్లు, ఆవాలు-టీస్పూన్, జీలకర్ర- టీస్పూన్, కరివేపాకు రెబ్బలు-పది, లవంగాలు-అయిదు, దాల్చిన చెక్క-చిన్నముక్క, పెద్ద ఉల్లిపాయలు-రెండు, అల్లం పేస్టు-టేబుల్‌స్పూన్, ధనియాల పొడి-టేబుల్‌స్పూన్, కారం-టేబుల్‌స్పూన్, గరంమసాలా-టీస్పూన్, ఉప్పు-తగినంత.

**తయారీ :** మటన్ ముక్కలకు పెరుగు, ఆమ్‌చూర్‌పొడి, పసుపు పట్టించి ఫ్రిజ్‌లోపెట్టాలి. మందపాటి గిన్నెలో నూనె పోసి వేడిచేసి ఆవాలు, జీలకర్ర, కరివేపాకు, లవంగాలు, దాల్చినచెక్క వేయాలి. ఆవాలు చిటపటలాడాక ఉల్లిపాయలు వేసి గోధుమ రంగులోకి వచ్చేంతవరకు వేయించాలి. ఇప్పుడు మటన్ ముక్కలు, అల్లం పేస్టు వేయాలి. స్టవ్ మంట బాగా పెంచి బాగా వేయించాలి. తర్వాత ధనియాల పొడి, కారం, గరంమసాలా పొడి, మామిడికాయ ముక్కలు వేయాలి. వీటిని బాగా కలుపుతూ కొన్ని నిమిషాలు వేయించాలి. తర్వాత రెండు కప్పుల నీళ్లు పోసి మరిగించాలి. ఇప్పుడు మంట తగ్గించి, మూత పెట్టి అరగంటపాటు లేదా మటన్ ముక్కలు మెత్తగా అయ్యేంతవరకు ఉడికించాలి. ఉప్పువేసి సన్నటి మంట మీద కూడ దగ్గరకు అయ్యేంతవరకు ఉంచాలి.

ఈ కూర అన్నం చపాతీల్లోకి బాగుంటుంది.

## రొయ్యల వేపుడు

**కావాల్సినవి :** రొయ్యలు-అరకేజీ, తురిమిన మామిడికా-ఒకటి,ఉల్లిపాయలు-రెండు, పచ్చిమిర్చి- నాలుగు, కారం-రెండు టేబుల్‌స్పూన్లు, గరంమసాలా పొడి-టీస్పూన్, ధనియాల పొడిటీస్పూన్, పసుపు-టీస్పూన్, నూనె-మూడు టేబుల్ స్పూన్లు,ఉప్పు- సరిపడా.

**తయారీ :** రొయ్యలను శుభ్రంగా కడిగి పెట్టుకోవాలి. కడాయిలో నూనె పోసి వేడిచేసి ఉల్లిపాయ ముక్కలు వేసి గోధుమ రంగులోకి వచ్చేంత వరకు వేయించాలి. ఇప్పుడు రొయ్యలు వేసి ఎర్రగా



వేయించాలి. తర్వాత పసుపు, కారం, ధనియాల పొడి, గరంమసాలా వేసి కాసేపు వేయించాలి. ఇందులో మామిడికాయ తురుము వేసి బాగా కలిపి పావుగంట సేపు ఉడికించాలి లేదా నూనె పైకి తేలేంతవరకు ఉంచాలి.



## చికెన్ కూర

**కావాల్సినవి :** స్కిన్‌లెస్ చికెన్-కేజీ, ఉడికించిన మామిడికా గుజ్జు-కప్పు, పసుపు-టీస్పూన్, కారం-రెండు టేబుల్‌స్పూన్లు, ధనియాల పొడి6టీస్పూన్, జీలకర్ర పొడి టీస్పూన్, నూనె-నాలుగు టేబుల్ స్పూన్లు, పచ్చిమిర్చి-ఆరు, చిన్న ముక్కలుగా కోసిన ఉల్లిపాయలు-రెండు, అల్లం వెల్లుల్లి పేస్టు- టేబుల్ స్పూన్, గరంమసాలా పొడి- టీస్పూన్, ఆమ్‌చూర్ పొడి-టీస్పూన్, ఉప్పు-తగినంత, కొత్తిమీర తురుము-టేబుల్‌స్పూన్.

**తయారీ :** గిన్నెలో మామిడికాయ గుజ్జు, పసుపు, కారం, జీలకర్ర, ధనియాల పొడి, గరంమసాలా పొడి, టేబుల్ స్పూన్ నూనె వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని చికెన్ ముక్కలకు బాగా పట్టించి రెండు గంటలపాటు పక్కన పెట్టాలి. మందపాటి గిన్నెలో మిగిలిన నూనె పోసి వేడిచేసి పచ్చిమిర్చి, ఉల్లిపాయ ముక్కలు వేసి రంగు మారేంతవరకు వేయించాలి. తర్వాత అల్లంవెల్లులి పేస్టు, మసాలా పట్టించిన చికెన్ వేసి మూతపెట్టి మధ్యస్థంగా ఉండే మంట ఈద పది నిమిసాల పాటు ఉడికించాలి. ఇప్పుడు అరకప్పు నీళ్లు పోసి ఇరవై నిమిషాల పాటు ఉడికించి నూనెపైకి తేలిన తర్వాత స్టవ్ కట్టేయాలి. చివరగా కొత్తిమీర తురుము వేయాలి. అన్నం చపాతీల్లోకి ఈ కూర చాలా బాగుంటుంది.

## పెసర పచ్చడి



**కావాల్సినవి :** మామిడికాయ ముక్కలు-ముప్పావు కప్పు, పెసరపప్పు-అరకప్పు, ఎండుమిర్చి-ఎనిమిది, జీలకర్ర-టీస్పూన్, బెల్లం-అర టీస్పూన్, ఉప్పు తగినంత. తాలింపు కోసం: ఆవాలు-అర టీస్పూన్, మినపప్పు-అర టీస్పూన్, ఎండుమిర్చి-రెండు, ఇంగువ - చిటికెడు, కరివేపాకురెబ్బ- ఒకటి, నూనె టేబుల్ స్పూన్.

**తయారీ :** పెసరపప్పును తక్కువ మంట మీద ఎర్రగా వేయించి చల్లార్చుకోవాలి. అలాగే జీలకర్ర, ఎండుమిర్చిలను కూడా వేయించి,చల్లార్చాలి. ఇప్పుడు పెసరపప్పు; జీలకర్ర, ఎండుమిర్చిలను మిక్సీలో వేసి పొడి చేయాలి. తర్వాత మామిడికాయ ముక్కలు, ఉప్పు, బెల్లం వేసి కొద్దిగా నీళ్లు పోసి మిశ్రమంలా తయారుచేసుకుని పక్కన పెట్టాలి. ఇప్పుడు కడాయిలో నూనె పోసి ఆవాలు, మినపప్పు వేసి కాస్త వేగాక ఎండుమిర్చి, కరివేపాకు, ఇంగువ వేసి కొనినన సెకన్లపాటు వేయించి స్టవ్ కట్టేయాలి. ఈ తాలింపును పచ్చడిలో వేయాలి. ఈ మామిడికాయ, పెసర పచ్చడి అన్నం, రోటీల్లోకే కాకుండా దోసెల్లోకీ బాగుంటుంది. □

## చిట్కా

✦ కొబ్బరి కాయను ఖచ్చితంగా మధ్యకు పగుల కొట్టాలంటే కాయను కాసేపు నీళ్ళలో వుంచి ఆ తర్వాత కొట్టి చూడండి.

✦ అరటిపండును మెత్తగాచేసి కాలిన ప్రాంతంలో లేదా గాయమైన ప్రాంతములో అద్దుటవలన బాధ త్వరగా తగ్గుతుంది. ✦ ఉదయాన్నే అరటిపండు తినుటవలన సుఖవిరోచనం అవుతుంది. ✦ అరటిపండు గుజ్జు పంచదార తేనె కలిపితింటే గుండెదడ తగ్గును. ✦ జామ ఆకులను మెత్తగా నూరి ముఖానికి రాసుకుంటే మొటిమలు పోతాయి. ✦ జామాకులను మెత్తగానూరి కట్టుటవలన కీళ్ళనొప్పులు తగ్గుతాయి. ✦ అల్లపు రసము పుచ్చుకొనిన కడుపునొప్పి తగ్గును □

# ముఖ వర్చస్సుకే ఫేస్‌పీల్స్'!



చర్మం ప్రకాశ వంతంగా మారడానికి.. ముఖవర్చస్సు మరింతగా ఇనుమడించడానికి ఫేషియల్స్ వేసుకోవడం సహజం అయితే వాటితో పాటు అప్పుడప్పుడూ ఫేస్ పీల్స్ కూడా వేసుకుంటూ ఉండాలి. అయితే ఫేస్ పీల్స్ అనగానే.. పార్లర్‌కే వెళ్లక్కర్లేదు. ఇంట్లో లభ్యమయ్యే పదార్థాలను ఉపయోగించే అద్భుతమైన ఫేస్ పీల్స్ తయారుచేసుకుని, ముఖానికి వేసుకోవచ్చు. మరి, ఆ పదార్థాలేమిటో చూద్దాం.

**కీరాదోస..** అరకప్పు కీరాదోస గుజ్జు తీసుకుని అందులో కోడిగుడ్డులోని తెల్లసొన, చెంచా నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి ప్యాక్‌లా వేసుకుని 20 నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత గోరువెచ్చని నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇందులో ఉన్న కీరాదోస.. పిగ్మెంటేషన్ సమస్యను తగ్గించడంతో పాటు ముడతలు, సన్నని గీతలు వంటివి కూడా తగ్గుముఖం పట్టేలా చేస్తుంది.

**పైనాపిల్ /బొప్పాయి..** అరకప్పు పైనాపిల్ ముక్కలు, పావు కప్పు బొప్పాయి ముక్కలు తీసుకుని మెత్తని పేస్టులా చేసుకోవాలి. తర్వాత అందులో అరచెంచా ఆర్గానిక్ తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి మాస్క్‌లా వేసుకుని 20 నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత గోరువెచ్చని నీటితో ఓసారి, చల్లని నీటితో మరో సారి ముఖాన్ని శుభ్రం చేసుకుని పొడి వస్త్రంతో తుడుచు కోవాలి.



**ఆవకాడోతో..** బాగా గిలక్కొట్టిన కోడిగుడ్డులోని తెల్లసొనలో మెత్తగా చేసుకున్న అరచెంచా అవ కాడో, రెండు చెంచాల తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి ప్యాక్‌లా అప్లై చేయాలి. 20 నిమిసాలు ఆరనిచ్చి తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ మాస్క్ చర్మంలోని తేమని అధిక సమయ నిలిపి ఉంచడానికి బాగా తోడ్పడుతుంది. ఫేస్ పీల్స్ వేసుకున్న తర్వాత ఎండలోకి వెళ్లే ముందు సన్‌స్క్రీన్ లోషన్ రాసుకోవాలి. లేదంటే ట్యాన్ సమస్య బారిన పడే అవకాశాలు ఎక్కువ. □

# అంతర్వాణి

## ప్రభువు ప్రేమకు చేరువగా ..!

ఓ పట్టణంలో జరుగుతున్న సంతకు మారుమూల గ్రామం నుంచి ఓ రైతు వచ్చాడు. ఆ సంతలో తను ఏదైన ఒక వస్తువును కొనాలనుకున్నాడు. అంతే కాదు ఆ వస్తువు తన గ్రామంలో ఎప్పుడూ, ఎవరూ చూడ నిదిగాను, వాడనిదిగా ఉండాలని అనుకొన్నాడు. ఆ సంతలో ఒక గొడుగుల దుకాణానికి వెళ్లాడు. ఆ రైతు గొడుగులను ఎప్పుడూ చూడలేదు. అతని గ్రామంలో కూడా ఎవరూ దాన్ని వాడలేదు. దాని గురించి తెలుసుకునేందుకు దుకాణం యజమానిని అడిగాడు 'ఇది ఏమిటి?' అని. షాపు యజమాని 'దీన్ని గొడుగు అని అంటారని.. ఇది వర్షానికి తడవకుండా సాయం చేస్తుంది'అని చెప్పాడు. బాగుందని చెప్పి రైతు ఓ గొడుగును కొన్నాడు. రాత్రికి తన గ్రామానికి వెళ్లాడు. మరుసటిరోజు ఉదయం గ్రామస్తులు అడిగారు ఆ వస్తువు ఏమిటని?. అందుకు రైతు 'ఇది గొడుగు, వర్షానికి తడవకుండా సాయం చేస్తుంది' అని చెప్పాడు. అందరూ దాన్ని చూసి ఆనందించారు. ఒకరోజు వర్షం రానేవచ్చింది. రైతు గొడుగును చంకలో పెట్టుకుని, వర్షంలో తడుస్తూనే ఇంటికి వచ్చాడు. అప్పుడు గ్రామస్తులు 'గొడుగు ఉంది కదా? ఎందుకు తడిసిపోయి వచ్చావు?' అని ప్రశ్నించారు. అందుకు రైతు ఇలా అన్నాడు.. గొడుగు వర్షంలో మనం తడవకుండా సాయం చేస్తుంది అని షాపు యజమాని చెప్పాడు. కానీ దాన్ని ఎలా వాడాలో చెప్పలేదన్నాడు. రైతుకు గొడుగు వాడకం తెలుసని షాపు యజమాని భావించి, దాన్ని ఎలా వాడాలో చెప్పలేదు అని అంటాడు. దీన్ని చదివి మనం నవ్వు కుంటాం కానీ దేవుడు కూడా మనల్ని చూసి ఇలాగే నవ్వుకుంటాడు. ఎందుకంటే క్రైస్తవులు 'యేసు క్రీస్తు' గొప్ప వాడు అని అంటారు కానీ తమకు మాత్రం కాదని భావిస్తారు. ఎందుకంటే వారు దేవుడి ప్రేమను అనుభవ పూర్వకంగా గ్రహించ లేదు. అందుకే దేవుడి వాక్యం ఇలాగ సెలవిస్తున్నది 'యెహోవా ఉత్తముడని రుచిచూచి తెలిసికొనుడి, ఆయనను ఆశ్రయించునరుడు ధన్యుడు' (కీర్తనలు 34:8). దేవుడు అనంతుడు, సర్వశక్తి మంతుడు అంటారు. కానీ వ్యక్తిగతంగా మనకు నిజంగా శక్తి మంతుడు అనే అనుభవం ఉందా? అంటే దేవుడి ప్రేమను మాటల్లో కాదు చెప్పాల్సింది అను భవించి, గ్రహించాలి. ప్రతి ఒక్కరూ దేవుడి ప్రేమను అనుభవించాలి. అప్పుడే ప్రభువును మనస్ఫూర్తిగా ఆరాధించగలం.

**- పి.వాణిపుష్ప**

# 'మన డాక్టర్ బాబే' టీజర్ లాంచ్

'మన డాక్టర్ బాబే' కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌లా ఉంటుంది టీజర్



లాంచ్ ఈవెంట్‌లో హీరో శ్రీ స్కంద.. శరణ్యసుధీక్ష సమర్పణలో స్కంద ఫిల్మ్స్ బ్యానర్ మీద 'మన డాక్టర్ బాబే' అనే సినిమాని కృతాక్షి నిర్మిస్తున్నారు. ఈ మూవీతో శ్రీ స్కంద హీరోగా పరిచయం అవుతున్నారు. ఈ సినిమాకి చలపతి కుమార్ పువ్వల స్టోరీ, స్క్రీన్ ప్లే అందిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. వీఎన్ ఆదిత్య మాట్లాడుతూ.. 'మన డాక్టర్ బాబే' టీజర్ ఆద్యంతం వినోదభరితంగా ఉంది. ఇలాంటి మంచి కామెడీ సినిమాలు రావాలి. టైటిల్‌లో డాక్టర్, మన అని పదాలు అంటే కచ్చితంగా హిట్ అవుతుంటాయి. శ్రీ స్కంద మాట్లాడుతూ.. ..'మన డాక్టర్ బాబే' టీజర్ లాంచ్ ఈవెంట్‌కు వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. ఈ మూవీలోని ప్రతీ ఒక్కరూ మన సినిమా అని అనుకుని ఎంతో సపోర్ట్ చేశారు. నటుడు అలీ మాట్లాడుతూ.. .'మన డాక్టర్ బాబే' సినిమాలో స్కంద చాలా చక్కగా నటించారు. చలపతి అందరి నుంచి మంచి నటనను రాబట్టుకున్నారు. ఈ సినిమా మంచి విజయం సాధించాలి. దర్శకుడు చలపతి కుమార్ మాట్లాడుతూ.. 'మన డాక్టర్ బాబే' టీజర్ లాంచ్ ఈవెంట్‌కు వచ్చిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు. వీఎన్ ఆదిత్యతో నాకు ఎన్నో ఏళ్ల నుంచి అనుబంధం ఉంది. ప్రభు, సురేష్ గారు నన్ను ఎంతగానో సపోర్ట్ చేస్తుంటారు. నిర్మాత కృతాక్షి మాట్లాడుతూ.. 'మన డాక్టర్ బాబే' టీజర్ లాంచ్ ఈవెంట్‌కు వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మా సినిమాకి అందరూ సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాన్న అని అన్నారు.విశ్వ కార్తికేయ మాట్లాడుతూ.. .. చలపతి నన్ను సోలో హీరోగా లాంచ్ చేశారు.'మన డాక్టర్ బాబే' కథ నాకు తెలుసు. ఈ చిత్రం ఆద్యంతం వినోదభరితంగా ఉంటుంది.

# 'చెన్నై లవ్ స్టోరీ' జూలైలో రిలీజ్



'చెన్నై లవ్ స్టోరీ' జూలైలో రిలీజ్'చెన్నై లవ్ స్టోరీ" మూవీ సాంగ్స్, జూలైలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్న సినిమా హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా 'కలర్ ఫొటో', 'బేబి' వంటి కల్ట్ క్లాసిక్ మూవీస్ ప్రేక్షకులకు అందించిన మేకర్స్ ఎస్ కేఎన్, సాయి రాజేశ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'చెన్నై లవ్ స్టోరీ'. ఈ చిత్రాన్ని అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై ఎస్ కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్నారు. సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. మెలోడీ బ్రహ్మ మణిశర్మ 'చెన్నై లవ్ స్టోరీ' సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన సాంగ్స్ మ్యూజిక్ లవర్స్ ఆదరణతో ఛాట్ బస్టర్స్‌గా మారుతున్నాయి. ఫస్ట్ సింగిల్ 'తొలి ప్రేమేం తోపు కాదే..' ఇప్పటికే హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకోగా, రీసెంట్‌గా ఆస్కార్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి చేతుల మీదుగా రిలీజ్ చేసిన సెకండ్ సింగిల్ 'వదలనే..'పాట కూడా ఇన్ స్టంట్‌గా సక్సెస్ అయ్యింది. ఇలా రిలీజ్ చేసిన ప్రతి పాట ప్రేక్షకుల ఆదరణ పొందుతూ 'చెన్నై లవ్ స్టోరీ' సినిమా మ్యూజికల్‌గా బ్లాక్ బస్టర్ జర్నీ చేస్తోంది. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్య క్రమాలు ఫుల్ స్వింగ్‌లో జరుగు తున్నాయి. జూలైలో ఈ చిత్రాన్ని గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొచ్చేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

# తెర

## 'రిస్క్' ట్రైలర్ లాంచ్



సంపంగి,16 వంటి చిత్రాలకు చార్ట్ బస్టర్ మ్యూజిక్ అందించిన ఘంటాడి కృష్ణ స్వీయ సంగీత దర్శక నిర్మాణంలో రూపొందిన చిత్రం ఖిరిస్క్ఖి. సందీప్ అశ్వ, సన్యా ఠాకూర్ ప్రధాన పాత్రలు పోషించారు. ఇప్పటికే విడుదలైన పాటలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. జూన్ రెండో వారంలో ఈ సినిమా రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఎమ్మెల్సీ మధుసూదనాచారి మాట్లా డుతూ.. రిస్క్.. టైటిల్ చాలా బాగుంది. హీరో సందీప్ మాట్లాడుతూ.. నాకు చిన్నప్పటి నుంచి సినిమాలంటే చాలా ఇష్టం. యాక్టింగ్ అంటే ప్యాషన్. చిన్న చిన్న మ్యూజిక్ వీడియోలు, షార్ట్ ఫిల్మ్స్ చేస్తూ ఇక్కడి వరకు వచ్చాను. వెండితెరపై నన్ను నేను చూసుకోవడానికి దాదాపు పదేళ్ల పట్టింది. దర్శకుడు ఘంటాడి కృష్ణ మాట్లాడుతూ.. నా ఆశ నా శ్వాస సంగీతం. 16మ సంపంగి వంటి చిత్రాల్లో నా పాటలతో ఎంతో మందికి దగ్గరయ్యాను. ఆ పాటల ద్వారానే ప్రేక్షకులు నన్ను గుర్తిస్తున్నారు. ఆ ప్రేమ నాకు చాలానే. దర్శకుడిగా ఇది నా తొలి చిత్రం. 30 ఇయర్స్ పృథ్వి మాట్లాడుతూ.. ఘంటాడి కృష్ణ ఎన్నో ఎవర్‌గ్రీన్ పాటలు అందించిన మ్యూజిక్ డైరెక్టర్. ఆయన పాటలు ఇప్పటికీ ప్రేక్షకులు వింటూనే ఉన్నారు. ట్రైలర్ చాలా అద్భుతంగా ఉంది. .మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ.. ఘంటాడి కృష్ణ మ్యూజిక్ డైరెక్టర్‌గా ఎన్నో మంచి పాటలతో మనందరినీ అలరించారు. ఇప్పుడు దర్శకుడిగా వస్తున్నారు. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను. ఆషు రెడ్డి మాట్లాడుతూ.. ఈ ట్రైలర్ చాలా క్యూరియాసిటీని కలిగించింది.

# 'టీఎఫ్‌సీసీ' షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్



'టీఎఫ్‌సీసీ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్ - 2026' నిర్వహిస్తున్నాం : టీఎఫ్‌సీసీ ఛైర్మన్ డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ జూన్ 13 వరకు ఉచితంగా ఎంట్రీలు పంపే అవకాశం జూన్ 21న హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో అవార్డుల ప్రధానోత్సవం చిత్ర పరిశ్రమలో కొత్త ప్రతిభను ప్రోత్సహించేం దుకు తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్‌సీసీ) ముందుకొచ్చింది. తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్స వాన్ని పురస్కరించుకుని టీఎఫ్‌సీసీ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ వార్డ్స్ - 2026ను టీఎఫ్‌సీసీ ఛైర్మన్ డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ ప్రకటించారు.ఈ ఫెస్టివల్‌లో పాల్గొనేందుకు ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదు. 5 నుంచి 25 నిమిషాల నిడివి గల షార్ట్ ఫిలింలను ఔత్సాహిక దర్శకులు, నటీనటులు, సాంకేతిక నిపుణులు పంపవచ్చు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్నామని, ఇకపై ప్రతి ఏడాది దీన్ని నిర్వహిస్తామని తెలిపారు. ప్రస్తుతం సినీ పరిశ్రమలో గుర్తింపు పొందిన పలువురు హీరోలు, దర్శకులు షార్ట్ ఫిలింల నుంచే తమ ప్రయాణాన్ని ప్రారంభించారని పేర్కొన్నారు.టీఎఫ్‌సీసీ వైస్ ఛైర్మన్ గురురాజ్ మాట్లాడుతూ, కొత్త టాలెంట్‌ను వెలుగులోకి తీసుకురావడంలో డా.రామకృష్ణ గౌడ్ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు ఛైర్మన్ అల్లా భక్షు మాట్లాడుతూ, ఇతర ఫెస్టివల్స్ భారీ ఎంట్రీ ఫీజులు వసూలు చేస్తున్న నేపథ్యంలో ఉచితంగా అవకాశం కల్పించడం విశేషమని తెలిపారు.

# 'నేనెవరు?' అద్భుతమైన ప్రేక్షకాదరణ!

నటకిరీటి డా. రాజేంద్ర ప్రసాద్ ప్రధాన పాత్రలో, సాయికిరణ్, జోగిని శ్యామల ముఖ్య పాత్రల్లో యువ దర్శకుడు చిరంజీవి తన్నీరు రూపొందించిన సందేశాత్మక వినోదాత్మక చిత్రం'నేనెవరు?' మే 29న ప్రపంచవ్యాప్తంగా విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతోందని చిత్ర నిర్మాతలు అండేకర్ జగదీష్ బాబు, సకినాన భూలక్ష్మి తెలిపారు. సినిమా విడుదలైన అన్ని ప్రాంతాల్లో ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోందని, అనేక కేంద్రాల్లో హౌస్‌ఫుల్ షోలతో ప్రదర్శిత మవుతోందని వారు వెల్లడించారు. ప్రేక్షకుల నుంచి వస్తున్న పాజిటివ్ టాక్‌తో రోజురోజుకూ థియేటర్ల సంఖ్య పెరుగుతోందని, మరిన్ని కేంద్రాల్లో చిత్రాన్ని ప్రదర్శించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా నటకిరీటి డా. రాజేంద్ర ప్రసాద్ చిత్ర యూనిట్‌ను అభినందించారు. 'నేనెవరు?' చిత్రానికి ప్రేక్షకులు ఇంత గొప్ప ఆదరణ అందించడం చాలా ఆనందంగా ఉందని, మంచి కథతో తెరకెక్కిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తుండటం సంతోషకరమని అన్నారు. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులు సినిమాను ఆదరించడం తనకు మరింత ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. చిత్ర దర్శకుడు చిరంజీవి తన్నీరు, నిర్మాతలు అండేకర్ జగదీష్ బాబు, సకినాన భూలక్ష్మి, చిత్ర బృందంలోని ప్రతి ఒక్కరికీ ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. అలాగే సాయికిరణ్, జోగిని శ్యామల తమ పాత్రలతో ప్రేక్షకులను



ఆకట్టుకుంటున్నారని, సినిమాలోని భావోద్వేగాలు, సందేశాత్మక అంశాలు, కోర్టు సన్నివేశాలు ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటున్నాయని చిత్ర యూనిట్ పేర్కొంది. దర్శకుడు చిరంజీవి తన్నీరు రూపొందించిన కథనం, చిన్నికృష్ణ అందించిన సంగీతం, నాయుడు ప్రసాద్ కొల్లి సినిమాటోగ్రఫీ, నందమూరి హరి తారకరామా రావు ఎడిటింగ్, శ్రీనివాస్ మాటలు, ఎస్.ఎస్. వీరు రాసిన పాటలు చిత్రానికి ప్రధాన బలాలుగా నిలిచాయని నిర్మాతలు తెలిపారు.

# 'హిట్ అండ్ రన్' ఫస్ట్ లుక్ రిలీజ్



క్రైమ్, థ్రిల్లర్ జానర్‌లకు ఉండే క్రేజ్ అందరికీ తెలిసిందే. ప్రస్తుతం ఆడియెన్స్ డిఫరెంట్ కంటెంట్‌ను ఎక్స్‌పీరియెన్స్ చేసేందుకు ఇష్టపడుతున్నారు. ఈ క్రమంలో క్రైమ్, థ్రిల్లర్ జానర్‌లకు మరింత డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం సంజయ్ రావ్, నటాషా సింగ్ ప్రధాన పాత్రల్లో త్వరలో రానున్న చిత్రం 'హిట్ అండ్ రన్' శ్రీ ఉరుకుంద ఈరణ్ణ స్వామి సమర్పణలో సతీష్‌రెడ్డి అల్లం ఎంటర్టైన్మెంట్, శ్రీలక్ష్మీ నరసింహస్వామి క్రియేషన్స్ బ్యానర్‌ల మీద సతీష్ రెడ్డి అల్లం, కె. శేఖర్ ఈ మూవీని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకి సాయి కృష్ణ సాగర్ దర్శకత్వం వహిస్తున్నారు.ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్‌ను ఫినిష్ చేశారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. సంజయ్ రావ్ పుట్టిన రోజు సందర్భంగా 'హిట్ అండ్ రన్' సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో సంజయ్ రావ్ ఇంటెన్స్ లుక్, ఆ గాయాలు, రక్తంతో నిండిపోవడం చూస్తుంటే 'హిట్ అండ్ రన్' ఎంతో ఇంట్రెస్టింగ్‌గా ఉండబోతోందని అర్థం అవుతోంది.త్వరలోనే 'హిట్ అండ్ రన్' టీజర్‌ను విడుదల చేయబోతోన్నారు. టీజర్ వచ్చిన తరువాత మూవీ మీద ఒక్కసారిగా అంచనాలు అమాంతం పెరుగుతాయని మేకర్లు ధీమా వ్యక్తం చేస్తున్నారు.ఈ సినిమాకి ప్రిన్స్ హెన్రీ సంగీతాన్ని అందిస్తున్నారు. డి. వెంకట్ ప్రభు ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు.

# అహ్మదాబాద్‌లో ఐపిఎల్ మహా సమరం

ఆట

## ఆర్సీబీ-గుజరాత్ టైటాన్స్ ఫైనల్ ఫైట్ * రెండో కప్ కోసం అమీతుమీ





*రెండు నెలలకు పైగా క్రికెట్ ఫ్యాన్స్‌ను అలరించిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ చివరి అంకానికి చేరుకుంది. ఎన్నో మలుపులు.. మరిన్నో ఉత్కంఠ మ్యాచ్‌లు.. టాప్ జట్లు ఢీలా, అంచనాలు లేని జట్లు ముందంజ... హీరోలనుకున్న ప్లేయర్లు ఫట్ అయితే.. అన్‌క్యాప్‌డ్ ప్లేయర్లు హిట్టయ్యారు. అయినా అనుభవందే ప్లస్ అయింది.ఇపుడు ఫైనల్ సమరానికి ఐపీఎల్ రెడీ అయింది. 10 జట్ల నుంచి రెండు జట్ల పోరుకు చేరిన ఫైనల్లో ఎవరు దుమ్మురేపుతారు? డిపెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ వరుసగా రెండోసారి కప్ అందుకుంటుందా? సొంతగడ్డ, సొంత అభిమానుల ముందు గుజరాత్ టైటాన్స్ ట్రోఫీతో మురిపిస్తుందా? అన్న ఉత్కంఠ నెలకొంది.*

**అహ్మదాబాద్, మే 30:** ఇండియన్ ప్రీమియర్ లీగ్-2026 తుది అంకానికి సమయం ఆసన్నమైంది. ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియంగా పేరొందిన అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ఆదివారం రాత్రి 7.30 గంటలకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ మధ్య ఫైనల్ పోరు జరగనుంది. సీజన్ మొత్తం ఆధిపత్యం చాటిన రెండుజట్లు చివరి అడుగులో ట్రోఫీ కోసం తలపడుతుండటంతో అభిమానుల్లో ఆసక్తి తారాస్థాయికి చేరుకుంది. లీగ్ దశలో అత్యంత స్థిరమైన ఆటతో అగ్రస్థానంలో నిలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇప్పటికే క్వాలిఫయర్-1లో గుజరాత్‌పై భారీ విజయంతో మానసిక ఆధిక్యం సాధించింది. మరోవైపు ఆ ఓటమి తర్వాత తేరుకున్న గుజరాత్ టైటాన్స్.. క్వాలిఫయర్-2లో రాజస్థాన్ రాయల్స్‌ను చిత్తు చేసి ఫైనల్ చేరింది. హోమ్ గ్రౌండ్‌లో ఆడుతున్న ప్రయోజనం గుజరాత్‌కు కలిసివస్తుండగా, సమతూకమైన జట్టుతో బెంగళూరు ఫేవరెట్‌గా కనిపిస్తోంది.

### అహ్మదాబాద్ పిచ్ బ్యాటర్లకు స్వర్గం

నరేంద్ర మోదీ స్టేడియం పిచ్ సాధారణంగా బ్యాటర్లకు అనుకూలంగా ఉంటుంది. ఈ సీజన్‌లో ఇక్కడ 200కుపైగా స్కోర్లు పలుమార్లు నమోదయ్యాయి. అయితే కొత్త బంతితో పేస్ బౌలర్లకు కూడా సహకారం లభిస్తుంది.గణాంకాల ప్రకారం ఇక్కడ మొదట బ్యాటింగ్ చేసిన జట్లే ఎక్కువసార్లు గెలిచాయి. దీంతో టాస్ గెలిచిన కెప్టెన్ ముందుగా బ్యాటింగ్ వైపు మొగ్గు చూపే అవకాశముంది. 200 ప్లస్ స్కోరు నమోదైతే మ్యాచ్‌పై గట్టి పట్టు లభిస్తుంది. ఇటీవల చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 229 పరుగుల భారీ స్కోరు సాధించింది.

### కీలకంగా మారే స్టార్ ప్లేయర్లు

గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఈ సీజన్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. 700కిపైగా పరుగులతో జట్టుకు ప్రధాన బలంగా నిలిచాడు. సాయి సుదర్శన్, జోస్ బట్లర్ కూడా నిలదొక్కుకుంటే గుజరాత్ బ్యాటింగ్ మరింత ప్రమాదకరంగా మారుతుంది. బౌలింగ్‌లో కగిసో రబాడా, రషీద్ ఖాన్ మ్యాచ్‌ను మలుపు తిప్పగలరు. ఆర్సీబీ వైపు చూస్తే రజత్ పాటిదార్ ఈ సీజన్‌లో నాయకత్వంతో పాటు బ్యాటింగ్‌లోనూ మెప్పిస్తున్నాడు. అనుభవజ్ఞుడు విరాట్ కోహ్లీ ఫైనల్ వంటి కీలక మ్యాచ్‌ల్లో తన ప్రభావం చూపగలడు. టిమ్ డేవిడ్ ఫినిషర్ పాత్రలో కీలకం. భువనేశ్వర్ కుమార్, హేజిల్‌వుడ్ కొత్త బంతితో వికెట్లు తీస్తే రాయలల్ ఛాలెంజర్స్ బెంగళూర్‌కు ఆధిక్యం లభించే అవకాశం ఉంది.

### గణాంకాలూ ఆర్సీబీ వైపే

ఈ సీజన్‌లో ఇరు జట్లు ఇప్పటికే మూడు సార్లు తలపడ్డాయి. అందులో రెండు విజయాలు ఆర్సీబీ ఖాతాలో చేరాయి. మొత్తం హెడ్ టు హెడ్‌లోనూ బెంగళూరుకే స్వల్ప ఆధిక్యం. 9 మ్యాచ్‌ల్లో ఆర్సీబీ 5 సార్లు, గుజరాత్ 4 సార్లు విజయం సాధించాయి. ఆర్సీబీ తన చివరి ఐదు మ్యాచ్‌లలో నాలుగింటిలో గెలిచి మంచి జోష్‌లో ఉంది. క్వాలిఫయర్-1లో గుజరాత్‌పై ఆర్సీబీ సాధించిన భారీ విజయం జట్టుకు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. అయితే హోమ్ కండిషన్స్, భారీ మ్యాచ్ ఒత్తిడి గుజరాత్‌ను మరింత ప్రమాదకరంగా మార్చే అవకాశముంది.

### ఎవరి విజయావకాశాలు ఎక్కువ?

ప్రస్తుత ఫామ్, బ్యాటింగ్ లోతు, బౌలింగ్ సమతూకం చూస్తే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కాస్త ముందంజలో కనిపిస్తోంది. కానీ అహ్మదాబాద్‌లో గుజరాత్‌ను తక్కువ అంచనా వేయడం ప్రమాదమే. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బ్యాట్‌తో రాణిస్తే మ్యాచ్ పూర్తిగా మారిపో వచ్చు. మొత్తం మీద అభిమానులకు ఉత్కంఠభరితమైన ఫైనల్ ఖాయమనే అంచనా వ్యక్తమవుతోంది.

**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు**

వెంకటేష్ అయ్యర్, విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్, రజత్ పాటిదార్ (కెప్టెన్), జితేష్ శర్మ, టిమ్ డేవిడ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, జాకబ్ డఫీ, జోష్ హేజిల్‌వుడ్, రసీఖ్ సలామ్ దార్.

**గుజరాత్ టైటాన్స్**

సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్),జోస్ బట్లర్,నిశాంత్ సింధు, వాషింగ్టన్ సుందర్, జేసన్ హోల్డర్, రషీద్ ఖాన్, రవిశ్రీనివాసన్, సాయి కిషోర్, కగిసో రబాడా, ప్రసిద్ధ్ కృష్ణ, మహ్మద్ సిరాజ్

### ఫైనల్ ప్రిడిక్షన్

ఆర్సీబీ - 55 శాతం, గుజరాత్ టైటాన్స్ - 45 శాతంగా గెలుపు అవకాశాలు ఉంది.ఐపీఎల్-2026కు ముగింపు పలికే ఈ ఫైనల్‌లో ఎవరు ట్రోఫీ అందుకుంటారన్న ఉత్కంఠ ఇప్పుడు దేశవ్యాప్తంగా క్రికెట్ అభిమానులను కట్టిపడేస్తోంది.

## కింగ్ కోహ్లీపైనే ఫోకస్

ఛేజింగ్ కింగ్ విరాట్ కోహ్లీపైనే అందరి దృష్టి. ఈ ఐపీఎల్ సీజన్‌లో గొప్ప ఫామ్‌లో ఉన్నాడు. ఇప్పటికే 600రన్స్ చేశాడు. జీటీపై బెటర్ రికార్డు ఉంది. గుజరాత్ టైటాన్స్‌పై విరాట్ కోహ్లీ బ్యాట్ ఎప్పుడూ గర్జిస్తూనే ఉంది. తొమ్మిది మ్యాచ్‌ల్లో 503 పరుగులు చేసిన కోహ్లీ.. ఫైనల్‌లోనూ ఆర్సీబీకి కీలక ఆయుధంగా మారనున్నాడు. బెంగళూర్‌లో జరిగిన మ్యాచ్‌లో జీటీపై 81పరుగులు చేసి ఒంటిచేత్తో ఆర్సీబీని గెలిపించాడు. ఇక క్వాలిఫయర్-1లో 43 పరుగులతో రాణించాడు. ఫ్లయింగ్ స్టార్ట్ అందించాడు.బిగ్ మ్యాచ్‌ల్లో ఆడడాన్ని ఆస్వాదించే కోహ్లీ జీటీకి ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది.

| | |
|---|---|
| మ్యాచ్‌లు: | 15 |
| పరుగులు : | 600 |
| సగటు: | 500 |
| స్ట్రయిక్ రేట్: | 164.38 |
| హాఫ్ సెంచరీలు : | 5 |
| సెంచరీలు : | 1 |

**కోహ్లీ ప్రత్యేకం:** పెద్ద మ్యాచ్‌ల్లో ఒత్తిడిని తట్టుకునే ఆట. జీటీపై మంచి రికార్డు

**రజత్ పాటిదార్(కెప్టెన్)**

మ్యాచ్‌లు : 15
పరుగులు: 486
స్ట్రయిక్ రేట్ : 196.76
హాఫ్ సెంచరీలు: 4
బెస్ట్: 33 బంతుల్లో 93
ప్రత్యేకం : మిడిల్ ఓవర్లలో టెంపో మార్చగలసామర్థ్యం

**భువనేశ్వర్ కుమార్**

వికెట్లు : 26
ఎకానమీ: 8
పవర్ ప్లే వికెట్లు: 16
ప్రత్యేకం:కొత్తబంతితోస్వింగ్

**హేజిల్‌వుడ్**

వికెట్లు : 13
ఎకానమీ: 9.62
పవర్ ప్లే వికెట్లు: 9
డెత్ ఓవర్లలో ప్రభావం
ప్రత్యేకం:హైప్రెజర్ మ్యాచ్‌లలో కచ్చితమైన లైన్-లెంగ్త్

**శుభ్‌మన్ గిల్(కెప్టెన్)**

మ్యాచ్‌లు : 15
పరుగులు: 722
స్ట్రయిక్ రేట్ : 163.71
హాఫ్ సెంచరీలు: 6
సెంచరీలు : 1
బెస్ట్: 53 బంతుల్లో 104
ప్రత్యేకం : జీటీ బ్యాటింగ్‌కు ప్రధాన బలం

**సాయి సుదర్శన్**

మ్యాచ్‌లు : 16
పరుగులు: 710
స్ట్రయిక్ రేట్ : 159.55
హాఫ్ సెంచరీలు: 8
సెంచరీలు : 1
బెస్ట్: 51 బంతుల్లో 100
ప్రత్యేకం : గిల్‌తో కలిసి బలమైన ఓపెనింగ్ జోడీ



గుజరాత్ టైటాన్స్ పేస్‌అటాక్ రబడ, సిరాజ్ ప్రధాన ఆయుధం. ఇద్దరూ ఆరంభంలోనే వికెట్లు అందిస్తున్నారు. రబడ 16 మ్యాచ్‌ల్లో 28 వికెట్లతో పర్పుల్ క్యాప్ రేసులో ఉన్నాడు. సిరాజ్ 16 మ్యాచ్‌ల్లో 18 వికెట్లు పడగొట్టాడు. ఆర్సీబీకి గతంలో పలు సీజన్లు ఆడిన అనుభవం సిరాజ్‌కు ఉంది. కోహ్లీ, పాటిదార్, జితేష్ బలాలు-బలహీనతలపై మంచి అవగాహనఉంది.కొత్తబంతితో స్వింగ్ దొరికితే టాప్ ఆర్డర్ లేపేయగలడు.పిచ్ పేసర్లకు సహకరిస్తే సిరాజ్ మరింత ప్రమాదకరంగా మారే ఛాన్స్ ఉంది.ఫైనల్లో గుజరాత్‌కు ట్రంప్‌కార్డ్‌గా మారనున్నాడు. పవర్ ప్లేలో సిరాజ్ స్పెల్ మ్యాచ్ ఫలితాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంది.

## డబుల్స్ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ జోడీ

**సింగపూర్:** భారత డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి సింగపూర్ ఓపెన్ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. పురుషుల డబుల్స్ సెమీస్‌లో సాత్విక్ జోడీ 21-19, 21-18తో ప్రపంచ నంబర్ వన్ కొరియా జోడీ కిమ్ వోన్‌సియో-సుంగ్ జెను ఓడించింది.52 నిమిషాల్లోనే ప్రత్యర్థులను మట్టి కరిపించింది. భానత జోడీ ఫైనల్ చేరడంతో కనీసం రజతం ఖరారు చేసుకుంది. ఆద్యంతం హోరాహోరీగా జరిగిన సెమీఫైనల్లో భారత జోడీ టాప్ గేర్‌లో ఆడింది. ఆరంభం నుంచి కొరియా జంటకు ముచ్చెమటలు పట్టించిన భారత ద్వయం.. రెండు గేమ్స్‌లనూ అలవోకగా నెగ్గింది. ఆదివారం జరగనున్న ఫైనల్లో సాత్విక్‌చిరాగ్ జోడీ.. ఫజర్ అల్ఫియాన్ - ముహమ్మద్ షోహిబుల్ ఫిక్రీ (ఇండోనేషియా)/ లియాంగ్ వీ కెంగ్ - వాంగ్ ఛాంగ్ విజేతతో తలపడనుంది.

## ఆసియా క్రీడల సెలెక్షన్ ట్రయల్స్‌లో నిరాశపర్చిన ఫోగట్

**న్యూఢిల్లీ :** ఆసియా క్రీడల్లో పాల్గొనాలన్న రెజ్లర్ వినేశ్ ఫోగట్ ఆశలు ఆవిరయ్యాయి. న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన ఏషియన్ గేమ్స్ కోసం సెలెక్షన్ ట్రయల్స్‌లో సెమీ ఫైనల్లోనే ఓడారు. 53 కేజీల విభాగంలో పోటీపడ్డ వినేశ్... 4-6 పాయింట్ల తేడాతో మీనాక్షి గోయత్ చేతిలోపరాజయం చవిచూశారు. హోరాహోరీగా సాగిన పోరులో వినేశ్, మీనాక్షి చాలాసేపు పోటీపడ్డారు. చివరికి విజయం మాత్రం మీనాక్షికి దక్కడంతో ఆమె ఫైనల్‌కు చేరుకున్నారు.వినేశ్ ఈ పోటీల్లో పాల్గొనేందుకు రెజ్లింగ్ సమాఖ్యతో పోరాడారు. ఆ క్రమంలో సుప్రీంకోర్టు వరకు వెళ్లి.. ట్రయల్స్‌లో పాల్గొనేందుకు అనుమతులు పొందారు. ఓటమి అనంతరం వినేశ్ స్పందించారు. నేను ఓడిపోలేదు. వ్యవస్థతో పోరాడుతున్నాను. ఒంటరి పోరాటం చేస్తున్నాను. తాను ప్రతిదాని కోసం పోరాడాల్సి వచ్చింది. అయినా న్యాయం జరగలేదు. మళ్లీ తిరిగొస్తా అని వ్యాఖ్యానించింది.

## నగల వర్తకులను ముంచేసిన.. పసిడి పన్నులు



**ముంబయి, మే 30:** కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఒకే ఒక్క నిర్ణయం దేశంలో పసిడి అమ్మకాలను భారీగా తగ్గించింది. దిగుమతి సుంకాన్ని భారీగా పెంచడంతో విక్రయాలు పడిపోయాయి. ఇరాన్‌ఉద్రిక్తతలతో పెరిగిన ఇంధన,ఆహారధరలు తోడవడంతో జనం అసలు షాపుల వైపు వెళ్లడమే మానేశారు. కేవలం రెండు వారాల వ్యవధిలోనే దేశవ్యాప్తంగా పసిడి డిమాండ్ ఊహించని విధంగా 70శాతం మేర పడిపోయింది.బంగారం దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని కేంద్రం 6 నుంచి ఏకంగా 15 శాతానికి పెంచింది. దీనికి జీఎస్‌టీ కూడా చేరడంతో పసిడిపై పడే మొత్తం పన్ను భారం 9.18 నుంచి 18.45 శాతానికి చేరింది. రూపాయి విలువ పతనం, క్రూడాయిల్ ధరలు పెరగడంతో విదేశీ మారక నిల్వలను కాపాడుకోవడానికి ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది.పన్నుల పెంపు దెబ్బకు దేశవ్యాప్తంగా పసిడి కొనుగోళ్లు భారీగా పడిపోయాయని ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ వెల్లడించింది. గతేడాది మే నెల చివరి 2వారాల్లో 25టన్నులుగా ఉన్న బంగారం డిమాండ్ ఈసారి కేవలం 7.5 టన్నులకే పరిమితమైంది. దేశీయ బంగారం వ్యాపారంలో 65శాతం వాటా ఉన్న అసంఘటిత రంగం ప్రభుత్వ చర్యతో తీవ్రంగా ప్రభావితమైంది.ఈ ఏడాది పసిడికి దూరంగా ఉండాలంటూ ప్రధాని మోదీ దేశ చేసిన విజ్ఞప్తి కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.




## సావరిన్ గోల్డ్ బాండ్స్‌పై 227శాతం రాబడులు

**ముంబయి, మే 30:** సావరిన్ గోల్డ్ బాండ్ (ఎస్‌జీబీ) పథకంలో పెట్టుబడి పెట్టిన వారికి ఆర్బీఐ గుడ్‌న్యూస్ చెప్పింది. ఐదేళ్ల క్రితం జారీ చేసిన ఎస్‌జీబీ 2021-22 సిరీస్-2 బాండ్లకు సంబంధించిన ముందస్తు విమోచన ధర ప్రకటించింది. పెట్టుబడిదారులకు ఊహించని రీతిలో ఏకంగా 227 శాతం అద్భుతమైన రాబడిని అందించేలా యూనిట్‌కు రూ.15,672గా ధరను ఖరారు చేసింది. ఐదేళ్ల కిందట రూ. 1 లక్ష ఇన్వెస్ట్ చేసినట్లయితే వారికి ఇప్పుడు రూ. 3.27 లక్షల వరకు రాబడి వచ్చింది. ఆర్బీఐ నిబంధనల ప్రకారం సావరిన్ గోల్డ్ బాండ్లను జారీ చేసిన ఐదేళ్ల తర్వాత, వడ్డీ చెల్లించే తేదీల్లో వాటిని ముందస్తుగానే డబ్బుల్ని విత్‌డ్రా చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఈ సిరీస్ బాండ్లను 2021 జూన్ 1న జారీ చేసినందున, సరిగ్గా ఐదేళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ ఏడాది జూన్ 1 నుంచి పెట్టుబడిదారులు తమ బాండ్లను నగదుగా మార్చుకునేందుకు ఆర్‌బీఐ అనుమతి ఇచ్చింది. ముందస్తు విమోచన ధరను నిర్ణయించడానికి ఆర్‌బీఐ ఒక నిర్దిష్ట పద్ధతిని అనుసరిస్తుంది. ఐబీజేఏ ప్రచురించే 999 స్వచ్ఛత కలిగిన బంగారం ధర ఆధారంగా దీనిని లెక్కిస్తారు.

విమోచన తేదీకి ముందున్న మూడు పని దినాల బంగారం ముగింపు ధరల సగటును తీసుకుంటారు. ఈ సిరీస్ కోసం ఈనెల 27,28,29 తేదీల్లోని బంగారం ధరల సగటు ఆధారంగా రూ. 15,672గా ధరను నిర్ణయించారు. 2021లో ఈ బాండ్లను జారీ చేసినప్పుడు, ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన వారికి ఒక గ్రాము (యూనిట్) ధర రూ.4,792గా ఉంది. ఆఫ్‌లైన్‌లో కొన్నవారికి దీని ధర రూ.4,842గా ఉంది. ఇప్పుడు ఆర్‌బీఐ ప్రకటించిన విమోచన ధర రూ.15,672తో పోలిస్తే, ఆన్‌లైన్ పెట్టుబడిదారులకు ప్రతి గ్రాముపై వడ్డీని మినహాయించి రూ.10,880 నికర లాభం వస్తోంది. కేవలం ఐదేళ్ల కాలంలోనే వారి పెట్టుబడిపై 227.05 శాతం రాబడి లభించినట్లయింది. సాధారణంగా ఎస్‌జీబీల కాలపరిమితి 8 సంవత్సరాలు కాగా, ఐదేళ్ల తర్వాత ఇలాంటి అధిక రాబడితో బయటకు వచ్చే అవకాశం కల్పించడం పెట్టుబడిదారులకు ఎంతో లాభదాయకంగా నిలిచింది.

## స్పేస్‌ఎక్స్ 75బిలియన్ డాలర్ల ఐపిఒపైనే ఇన్వెస్టర్ల ఫోకస్

**న్యూయార్క్, మే 30:** గ్లోబల్ బిలియనీర్ ఎలాన్ మస్క్ మరోసారి ప్రపంచ పెట్టుబడి మార్కెట్లనే తనవైపు తిప్పుకోగలిగారు. ఆయన ఆధ్వర్యంలో నడుస్తున్న స్పేస్‌ఎక్స్ కంపెనీ ఇప్పుడు చరిత్రలోనే అతిపెద్ద ఐపీఓ కోసం సిద్ధమవుతోంది.ఈప్రతిపాదన పెట్టుబడిదారుల్లో ఉత్సాహాన్ని రేకెత్తిస్తూనే,మరోవైపు అనేక ప్రశ్నలను కూడా లేవనెత్తుతోంది. స్పేస్‌ఎక్స్ దాఖలు చేసిన 300 పేజీలకు పైగా ఉన్న ప్రాస్పెక్టస్‌లో కంపెనీ లక్ష్యాలు సాధారణ వ్యాపార ప్రణాళికలను మించి ఉన్నాయి. మానవ జీవితాన్ని బహుగ్రహాలకు విస్తరించడం, చంద్రుడిపై స్థావరాలు నిర్మించడం,ఇతర గ్రహాలపైనగరాలు ఏర్పాటు చేయడం, కృత్రిమ మేధ అభివృద్ధికి సౌరశక్తిని వినియోగించడం వంటి అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రణాళికలను సంస్థ ప్రకటించింది.

భారీ పెట్టుబడులు అవసరమయ్యే ఈ ప్రాజెక్టులు సమీప భవిష్యత్తులో లాభాలను అందిస్తాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. స్పేస్‌ఎక్స్ ఐపీఓ విజయవంతమైతే కంపెనీ మార్కెట్ విలువ 1.8ట్రిలియన్‌డాలర్లకు చేరుతుందని అంచనా. కంపెనీ దాఖలుచేసిన ప్రాస్పెక్టస్ ప్రకారం, గత ఆర్థిక సంవత్సరంలో స్పేస్‌ఎక్స్ 18.7 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని నమోదు చేసింది.అదే సమయంలో కంపెనీ 4.9 బిలియన్ డాలర్ల నష్టాన్ని కూడా చవిచూసింది. సాధారణంగా ఐపీఓలకు వస్తున్న కంపెనీలు లాభదాయకత వైపు అడుగులు వేస్తున్న దశలో ఉంటాయి.జూన్‌లో జరగనున్న స్పేస్‌ఎక్స్ ఐపీఓ ద్వారా కంపెనీ 75 బిలియన్ డాలర్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది విజయవంతమైతే కంపెనీ మార్కెట్ విలువ సుమారు 1.8 ట్రిలియన్ డాలర్లకు చేరుకునే అవకాశం ఉంది. ఈ విలువలతో మస్క్ ప్రపంచంలో తొలి ట్రిలియనీర్‌గా అవతరించే అవకాశాలు ఉన్నాయని నిపుణుల అంచనా.ప్రత్యేక సూపర్‌వోటింగ్ షేర్ల ద్వారా కంపెనీపై పూర్తి నియంత్రణను కూడా మస్క్ కొనసాగించనున్నారు. స్పేస్‌ఎక్స్‌కు ప్రతిపాదించిన 1.8 ట్రిలియన్ డాలర్ల విలువ అనేక ప్రశ్నలకు దారితీస్తోంది. ప్రస్తుతం కంపెనీ ఆదాయంతో పోలిస్తే ఈ విలువ దాదాపు 100రెట్లు ఎక్కువగా ఉంది. సాధారణంగా ఎస్ అండ్ పీ 500లోని ప్రముఖ కంపెనీలు తమ వార్షిక అమ్మకాల విలువకు 3నుంచి నాలుగు రెట్ల మధ్యే ట్రేడ్ అవుతుంటాయి. అలాంటప్పుడు స్పేస్‌ఎక్స్‌కు 100 రెట్లు విలువ ఇవ్వడం అత్యంత ఆశావహ అంచనాగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. స్పేస్‌ఎక్స్‌కు ప్రధాన బలంగా స్టార్‌లింక్ నిలుస్తోంది.



## 1.66 లక్షల కోట్లకు పైగా అన్‌క్లెయిమ్డ్ ఫండ్స్

**న్యూఢిల్లీ, మే 30:** ఖాతాదారులు తమ పేరుపై ఉన్న క్లెయిమ్ చేయని ఆర్థిక ఆస్తులను సులభంగా గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త పోర్టల్‌ను ప్రారంభించింది. బ్యాంకు ఖాతాలు, బీమా పాలసీలు, షేర్లు, డివిడెండ్లు, పెన్షన్ నిధులు వంటి వివిధ ఆర్థిక సంస్థల్లో నిలిచిపోయిన క్లెయిమ్ చేయని ఆస్తుల వివరాలను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకురావడమే ఈ పోర్టల్ లక్ష్యం.ఇప్పటి వరకు క్లెయిమ్ చేయని ఆస్తులను వెతకడానికి ప్రజలు వేర్వేరు సంస్థల వెబ్‌సైట్లను సందర్శించాల్సి వచ్చేది. కొత్త పోర్టల్ ద్వారా బ్యాంకులు, బీమా కంపెనీలు, మ్యూచువల్ ఫండ్లు, షేర్ మార్కెట్ సంబంధిత సంస్థలు, ఇతర ఆర్థిక సంస్థల వద్ద ఉన్న క్లెయిమ్ చేయని నిధుల సమాచారాన్ని ఒకే చోట పరిశీలించవచ్చు. చాలా మంది ఉద్యోగ మార్పులు, చిరునామా మార్పులు, కుటుంబ సభ్యుల మరణం లేదా పాత పెట్టుబడుల వివరాలు మర్చిపోవడం వంటి కారణాల వల్ల తమ ఆర్థిక ఆస్తులను క్లెయిమ్ చేయకుండా వదిలేస్తుంటారు. అలాంటి వారికి ఈ పోర్టల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అలాగే మరణించిన కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న డిపాజిట్లు, బీమా మొత్తాలు లేదా ఇతర ఆర్థిక ఆస్తులను గుర్తించడంలో కూడా ఇది సహాయపడుతుంది.

వినియోగదారులు తమ పేరు, మొబైల్ నంబర్, పాన్, ఆధార్ లేదా ఇతర అవసరమైన వివరాలతో పోర్టల్‌లో శోధన చేయవచ్చు. సంబంధిత ఆర్థిక సంస్థల్లో ఉన్న క్లెయిమ్ చేయని ఆస్తుల వివరాలు అందుబాటులోకి వస్తాయి.అనంతరం ఆయా సంస్థల నిబంధనల ప్రకారం క్లెయిమ్ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు.ప్రస్తుతం దేశంలో బ్యాంకులవద్దనే 72 వేల కోట్ల అన్‌క్లెయిమ్డ్ మొత్తాలు ఉంటే జీవితబీమా సంస్థ వద్ద 14వేల కోట్లకు పైగా ఈ మొత్తాలున్నాయి. కీలకమైన ఈపిఎఫ్ఒ వద్ద కూడా సుమారు 80 వేల కోట్లకు పైగా ఉన్నాయని అంచనా.ఈమొత్తాలు ఈఏడాది మరింతపెరిగే అవకాశం ఉంది. ఈ మొత్తాలను అసలైన యజమానులు లేదా వారి వారసులకు చేరవేయడానికి కేంద్ర ప్రభుత్వం ఈ పోర్టల్‌ను తీసుకొచ్చింది. ఈ పోర్టల్ ద్వారా ఆర్థిక వ్యవస్థలో పారదర్శకత పెరగడంతో పాటు, ప్రజలు తమకు చెందిన ఆస్తులను సులభంగా గుర్తించి తిరిగి పొందే అవకాశం లభించనుంది. డిజిటల్ ఇండియా కార్యాచరణలో ప్రభుత్వం ఈవెబ్‌సైట్‌ను తెచ్చింది.




## ఎన్‌ఎస్‌ఇ డెరివేటివ్స్‌లో ట్రేడింగ్ సమయంపొడిగింపు

**ముంబయి, మే 30:** స్టాక్ మార్కెట్‌లో ట్రేడింగ్ చేసే పెట్టుబడిదారులు ట్రేడర్ల కోసం నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఈక్విటీ డెరివేటివ్స్ విభాగంలో ట్రేడింగ్ సమయాన్ని 10 నిమిషాలు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మార్పు క్లోజింగ్ ఆక్షన్ సెషన్ (సిఎఎస్) అమలులో భాగంగా తీసుకొస్తున్నట్లు ఎన్‌ఎస్‌ఈ వెల్లడించింది. కొత్త విధానం ప్రకారం, ప్రస్తుతం మధ్యాహ్నం 3:30గంటలకు ముగుస్తున్న ట్రేడింగ్ సెషన్‌ను మధ్యాహ్నం 3:40గంటల వరకు పొడిగించనున్నారు. ఈ మార్పు ఆగస్టు నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. క్లోజింగ్ ఆక్షన్ సెషన్ అనేది మార్కెట్ ముగిసే సమయంలో జరిగే ప్రత్యేక ట్రేడింగ్ ప్రక్రియ. ఈ సమయంలో మార్కెట్ భాగస్వాములు కొనుగోలు, విక్రయ ఆర్డర్లను నమోదు చేస్తారు. వీటి ఆధారంగా ఆయా షేర్లకు తుది ముగింపు ధర నిర్ణయించబడుతుంది. ఈ విధానం ద్వారా మార్కెట్ ముగింపు సమయంలో ధరల నిర్ణయంలో మరింత పారదర్శకత, స్థిరత్వం తీసుకురావడంలక్ష్యంగా ఎన్‌ఎస్‌ఈ పేర్కొంది.ఇతర సెషన్‌లలో మార్పులుండవు.ప్రీఓపెన్ సెషన్ యథాతథంగా కొనసాగుతుంది. ట్రేడ్ మాడిఫికేషన్ విండోలో ఎలాంటి మార్పు ఉండదు.క్యాష్‌మార్కెట్ ట్రేడింగ్ సమయాల్లో కూడా మార్పులు ఉండవు.కేవలం ఈక్విటీడెరివేటివ్స్ సెగ్మెంట్‌లో మాత్రమే ట్రేడింగ్ సమయం పొడిగిస్తారు. క్యాష్ మార్కెట్‌లో ప్రవేశపెట్టనున్న క్లోజింగ్ ఆక్షన్ సెషన్‌కు అనుగుణంగా డెరివేటివ్స్ మార్కెట్‌లో కూడా సమన్వయం ఉండేలా ఈనిర్ణయంతీసుకున్నట్లు ఎన్‌ఎస్‌ఈ తెలిపింది. క్యాష్, డెరివేటివ్స్ మార్కెట్ల మధ్య మెరుగైన సమన్వయం,ముగింపు ధరలలో పారదర్శకత, మార్కెట్ స్థిరత్వం,అంతర్జాతీయ మార్కెట్ ప్రమాణాలకు అనుగుణంగా వ్యవస్థ అభివృద్ధి సాధ్యమవుతాయని భావిస్తున్నారు. డెరివేటివ్స్ కాంట్రాక్టుల ముగింపు ధరను నిర్ణయించే విధానంలో మార్పు ఉండదని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ స్పష్టం చేసింది.







## స్పైస్‌జెట్‌కు 124 కోట్ల పన్ను నోటీసు

**న్యూఢిల్లీ, మే 30:** బడ్జెట్ విమానయాన సంస్థ స్పైస్‌జెట్ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. నెలల తరబడి జీఎస్టీ రిటర్నులు దాఖలు చేయడంలో విఫలమైనందుకు గాను జీఎస్టీ డైరెక్టరేట్ ఆ సంస్థకు రూ. 124.65 కోట్ల పన్ను డిమాండ్ నోటీసు జారీ చేసింది. పదేపదే నిబంధనలు ఉల్లంఘిస్తున్నందున కంపెనీ జీఎస్టీ రిజిస్ట్రేషన్‌ను ఎందుకు రద్దు చేయకూడదో చెప్పాలంటూ షోకాజ్ నోటీసు కూడా ఇచ్చింది. నిర్దేశిత గడువులోగా స్పైస్‌జెట్ రిటర్నులు దాఖలు చేయకపోవడంతో జీఎస్టీ చట్టంలోని సెక్షన్62 కింద అధికారులు ప్రొవిజనల్ అసెస్‌మెంట్ నిర్వహించి ఈ పన్ను డిమాండ్‌ను ఖరారు చేశారు. నవంబర్ నెలకు రూ. 44.44 కోట్లు, డిసెంబర్‌కు రూ. 43.79 కోట్లు, జనవరికి రూ. 12.19 కోట్లు, ఫిబ్రవరికి రూ. 12.10 కోట్లు, మార్చి నెలకు రూ. 12.12 కోట్ల చొప్పున బకాయిలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. జీఎస్టీ రిజిస్ట్రేషన్ రద్దుకు సంబంధించి ఈ నెల 25న షోకాజ్ నోటీసు జారీ చేసినప్పటికీ, సంస్థ నుంచి ఇంకా పూర్తిస్థాయి స్పందన రాలేదని అధికారులు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న రిటర్నులను స్పైస్‌జెట్ వెంటనే దాఖలు చేసి, చట్టపరమైన నిబంధనలు పాటించకపోతే, కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులుస్పష్టం చేశారు. స్పైస్‌జెట్ ఇప్పటికే తీవ్ర నష్టాల్లో కొనసాగుతోంది.నిన్నటి ట్రేడింగ్‌లో బీఎస్‌ఈలో స్పైస్‌జెట్ షేరు ధర 0.47 శాతం తగ్గి రూ.12.75 వద్ద ముగిసింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.